గురువారం
04-12-2025
విజయవాడ ప్రచురణ
సంపుటి : 74, సంచిక : 163
పేజీలు : 12, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఈపీఎస్ పింఛను పెంచం: కేంద్రం

న్యూఢిల్లీ: ఉద్యోగుల పింఛను నిధి పథకం (ఈపీఎస్) ఆదాయం పెరుగుతున్నా... లబ్ధిదారులు కనీస పింఛను పెంపునకు నోచుకోక అవస్థలు పడుతున్నారు. కనీస పింఛను మొత్తాన్ని రూ. 1,000 నుంచి రూ. 7,500కు పెంచాలని ఈపీఎస్-95 పథకానికి చెందిన వేలమంది పింఛనుదారులు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాన్ని తాజాగా పార్లమెంట్‌లోనూ ఓ సభ్యుడు లేవనెత్తారు. అయితే, పెన్షన్ పెంచే ప్రతిపాదనేదీ లేదని కార్మికశాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే వెల్లడించారు. 'ఉద్యోగుల పింఛను

- మిగతా 2 లో

ఏపీ టెట్ హాల్ టికెట్ల విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) హాల్ టికెట్లు బుధవారం నుంచి అందుబాటులో ఉంచారు. ఈనెల 10 నుంచి టెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. టెట్ కన్వీనర్ ఎంపీ కృష్ణారెడ్డి నేతృత్వంలో పరీక్షల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఈ పరీక్షల కోసం అక్టోబరు 24 నుంచి నవంబరు 23 వరకు దరఖాస్తులు స్వీకరించగా, 2,41,509 మంది అభ్యర్థులు 2,71,682 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. ప్రతి రోజూ రెండు

- మిగతా 2 లో

యాప్ తప్పనిసరి నిబంధన రద్దు: కేంద్రం

న్యూఢిల్లీ: భారత్‌లో కొత్తగా తయారు చేసే మొబైల్ ఫోన్లలో 'సంచార్ సాథీ' యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరేమీ కాదని కేంద్రం తెలిపింది. యాప్ ప్రీ-ఇన్‌స్టాలేషన్‌ను తప్పనిసరి చేస్తూ ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్టు టెలికమ్యూనికేషన్ల శాఖ బుధవారం ప్రకటించింది. యాప్‌పై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ఇటీవల ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకున్నట్టు వివరించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల తర్వాత స్వచ్ఛందంగా యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న సంఖ్య ఒక్కరోజులోనే పదింతలు పెరిగిందని డీఓటీ తెలిపింది. 1.4 కోట్ల మంది ఇప్పటికే ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించింది. గడచిన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చిన్న పొరపాటు జరిగింది సార్! నకిలీ మనుషుల్ని అరెస్టు చేసేసాం!

అవి దోపిడీ చట్టాలు

- కార్మిక హక్కుల్ని హరించారు
- లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పార్లమెంటు వద్ద ప్రతిపక్షాల నిరసన
- కొత్త చట్టాలు తక్షణం రద్దు చేయాలి
- ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక డిమాండ్

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ సర్కారు నియంతృత్వ పద్ధతుల్లో తీసుకొచ్చిన కొత్త కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఎంపీలు బుధవారం పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్‌లో నిరసన తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో సహా అనేక మంది ప్రతిపక్ష ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. తక్షణం కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, వామపక్ష పార్టీల ఎంపీలు పార్లమెంటు మకర ద్వారం ముందు జరిగిన నిరసనలో పాల్గొన్నారు. ఖర్గే కేంద్రంపై విరుచుకుపడ్డారు. మోదీ సర్కారు కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల ప్రభుత్వమని విమర్శించారు. ప్రతిపక్షాల నిరసన తర్వాత ఖర్గే ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. కొత్త కార్మిక కోడ్ల అమలుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటు ప్రాంగణంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపాయని పేర్కొన్నారు. "కొత్త కోడ్‌లలో కొన్ని తీవ్రమైన అభ్యంతరాల్లో ఉద్యోగ భద్రతకు ముప్పు ఒకటి. లేఆఫ్ పరిమితిని 100 నుండి 300 మందికి పెంచారు. అంటే భారతదేశంలోని 80% కంటే ఎక్కువ కర్మాగారాలు ఇప్పుడు ప్రభుత్వ అనుమతి లేకుండా కార్మికులను తొలగించవచ్చు. కొత్త నిబంధనలు ఉద్యోగ భద్రతను తగ్గిస్తుంది. కంపెనీలు ఇప్పుడు స్వల్పకాలిక ఒప్పందాలపై కార్మికులను నియమించుకోవచ్చు, దీర్ఘకాలిక ప్రయోజనాలను తప్పించుకోవచ్చు" అని ఖర్గే అన్నారు. కొత్త నిబంధనలు 8 గంటల పని దినాన్ని కాగితంపై ఉంచినప్పటికీ, రాష్ట్రాలు సౌకర్యవంతమైన షెడ్యూలింగ్ ద్వారా 12 గంటల షిఫ్ట్‌లను అనుమతించవచ్చని ఆయన అన్నారు. "రాష్ట్రాలు నిర్ణయించిన ఓవర్‌టైమ్ పరిమితులతో కలిపి, ఇది సమర్థవంతంగా చాలా ఎక్కువ పనిదినాలను అనుమతిస్తుంది, 'ఏకాభిప్రాయం' అని లేబుల్ చేయబడినప్పటికీ భద్రతా ప్రమాదాలను పెంచుతుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక కార్మికులు సమ్మె చేయడానికి 60 రోజులు వేచి ఉండాలి, దానితో పాటు 14 రోజుల కూలింగ్-ఆఫ్ వ్యవధి కూడా ఉండాలి. ఇది అసురక్షిత లేదా అన్యాయమైన పరిస్థితులపై త్వరితగత చర్యను నిరోధిస్తుంది. 51% సభ్యత్వం ఉన్న ఒక యూనియన్‌ను ఏకైక సంధానకర్తగా ఉంచడం వల్ల చిన్న యూనియన్‌లను పక్కన పెడతారు. విభిన్న కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం తగ్గుతుంది" అని ఖర్గే అన్నారు. 300 కంటే తక్కువ మంది కార్మికులు ఉన్న యూనిట్లకు స్టాండింగ్ ఆర్డర్లు వర్తించవని ఆయన ఎత్తి చూపారు. "పని గంటలు, సెలవులు, తొలగింపులపై ప్రాథమిక నియమాలు తప్పనిసరి కాదు. ఇది మధ్య తరహా యూనిట్లలో ఏకపక్ష నియామకం, తొలగింపు పద్ధతులను పెంచుతుంది" అని హెచ్చరించారు. కొత్త కార్మిక కోడ్‌లు కార్మికుల భద్రత, సంక్షేమాన్ని బలహీనపరిచాయని ఖర్గే అన్నారు. ఇక వలసదారులకు రక్షణ కల్పించడంలో కోడ్ విఫలమైంది, స్థానభ్రంశం భత్యాన్ని తొలగించి రూ. 18,000 ఆదాయ పరిమితిని నిలుపుకుంది. దీని వల్ల చాలా

- మిగతా 2 లో

భారీ ఎన్‌కౌంటర్

12 మంది మావోయిస్టులు, ముగ్గురు జవాన్ల మృతి

విశాలాంధ్ర-చింతూరు: ఛత్తీస్‌గఢ్ అడవుల్లో తుపాకీల మోత ఆగడం లేదు. వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. బీజాపూర్-దంతెవాడ జిల్లాల పరిధిలో బుధవారం జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారు. ముగ్గురు జిల్లా రిజర్వు గార్డ్ (డీఆర్‌జీ) జవాన్లు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు బస్తర్ ఐజీ సుందరరాజ్ వెల్లడించారు. దంతెవాడ, బీజాపూర్ నుంచి డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, పోలీసులు, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ జరిగిందని తెలిపారు. 12 మంది మావోయిస్టుల మృత దేహాలను, ఎస్‌ఎల్‌ఆర్‌లు, ఇన్సాస్ రైఫిళ్లు, పాయింట్ 303 రైఫిళ్లు, ఇతర మందుగుండు సామగ్రిని ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అమర జవాన్లను డీఆర్‌జీ బీజాపూర్ హెడ్ కానిస్టేబుల్ మోను వదాదీ, కానిస్టేబుల్ దుకారు గోండె, జవాన్ రమేశ్ సోడీగా గుర్తించారు. గాయపడిన ఇద్దరు జవాన్లకు ప్రాణాపాయం లేదన్నారు. చనిపోయిన మావోయిస్టులు ఎవరన్నది గుర్తించాల్సి

- మిగతా 2 లో

వివేకా హత్య కేసు దర్యాప్తుపై 10న తీర్పు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐ కోర్టులో సునీతారెడ్డి దాఖలు చేసిన పిటీషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన కోర్టు

- మిగతా 2 లో

ఏపీ రాజ్ భవన్ పేరు మార్పు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీలోని రాజ్‌భవన్‌కు లోక్‌భవన్‌గా పేరు మార్చారు. పేరు మార్పునకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి రాబోతున్నాయి. ఇకపై విజయవాడలో రాజ్‌భవన్ కాస్తా లోక్ భవన్‌గా దర్శనమివ్వబోతోంది. వలసవాద వాసనలను తుడిచిపెట్టేందుకు... రాజ్‌భవన్, రాజ్ నివాస్ పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌గా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రాసిన లేఖకు అనుగుణంగా చాలా రాష్ట్రాల్లో చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్, తమిళనాడు, గుజరాత్, అసోం, కేరళ, త్రిపుర, ఒడిశా, తెలంగాణ రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌లుగా మార్చారు. ఇప్పుడు ఆ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కూడా చేరింది.

విద్యుత్ చార్జీలు పెంచం

వ్యవసాయం లాభసాటికి పంచసూత్రాలు

- ఆహార అలవాట్లకు అనుగుణంగా సాగు పద్ధతులు
- వ్యవసాయ అనుబంధ రంగాలపైనా దృష్టి పెట్టాలి
- అంతర పంటలతో అధిక ఆదాయం
- రైతన్నా.. మీకోసం సభలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర- నల్లజర్ల: కరెంటు చార్జీలు పెంచబోమనే మాటకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, అన్నదాతకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం పంచసూత్ర ప్రణాళికతో ముందుకెళుతోందని చెప్పారు. పంచసూత్రాలపై అవగాహన కల్పించేందుకే రైతన్నా...మీకోసం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో బుధవారం రైతన్నా...మీ కోసం కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వ్యవసాయ యాక్షన్‌ప్లాన్ పై చర్చించారు. అంతకముందు అక్కడి రైతులు సాగు చేస్తున్న అంతర్ పంటలను పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ...వ్యవసాయమే మన బలం. రాష్ట్రంలో 62 శాతం మంది వ్యవసాయ, అనుబంధ రంగాలపైన ఆధారపడి జీవిస్తున్నారు. అందుకే సాగును లాభసాటి చేసేందుకు మొదటి రోజు నుంచి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. మనది వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. వ్యవసాయం లాభసాటిగా మారాలి. రైతుకు గిట్టుబాటు ధర రావాలి. తెలంగాణలో 60 శాతం సర్వీస్ సెక్టార్ ఉంది. అక్కడ వ్యవసాయంలో వచ్చే ఆదాయం 14 శాతంగా ఉంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు మన రాష్ట్ర జీఎస్‌డీపీలో 34 శాతం వాటా కలిగి ఉన్నాయి. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపైనా దృష్టి

- మిగతా 2 లో

దక్షిణకోస్తాను ముంచిన దిత్వా

తిరుపతి, నెల్లూరు జిల్లాలు అతలాకుతలం

- పొంగి ప్రవహిస్తున్న గుంజన, కండలేరు, స్వర్ణముఖి
- వరి, ఉద్యానపంటలకు తీవ్ర నష్టం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దిత్వా తుపాను ప్రభావంతో దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. వరి, ఉద్యానపంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నెల్లూరులో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రహదారులు చెరువులుగా మారాయి. మాగుంట లేఔట్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు భారీగా నిలిచింది. దీంతో రాకపోకలు నిలిపివేశారు. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలో నాలుగు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు పడుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. గుంజన నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షం కారణంగా తిరుపతి-కడప ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక చోట్ల రహదారులపై వరద నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మనుబోలు వద్ద కండలేరు వాగు రోడ్డుపై ప్రవహిస్తోంది. పొదలకూరు మండలం ముదిగేడు గ్రామంలో రహదారిపై నుంచి వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నెల్లూరులోని ఆర్టీసీ కాలనీ వర్షపు నీటితో ముంపుకు గురైంది. దిత్వా తుపాను ప్రభావంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నాయుడుపేట మండలం కాపులూరు ఉన్నత పాఠశాల జలదిగ్బంధంలో చిక్కుకుంది. చుట్టు పక్కల పొలాల్లోని నీరు పాఠశాల ఆవరణలోకి చేరింది. దీంతో వర్షపు నీటిలో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. విద్యాశాఖ అధికారులు అప్రమత్తమై విద్యార్థులను మధ్యాహ్నం తర్వాత ఇళ్లకు పంపేశారు. వర్ష ప్రభావంతో నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో సుమారు

- మిగతా 2 లో

మమత సర్కారుకు ఊరట

ఆ టీచర్ల నియామకాలు చెల్లుతాయ్: కోల్‌కతా హైకోర్టు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో కలకత్తా హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసుతో ముడిపడి ఉన్న 32 వేల ప్రైమరీ టీచర్ల నియామకాలు రద్దు చేస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది. తొమ్మిదేళ్లుగా సర్వీసులో ఉన్న వారిని ఇప్పుడు తొలగిస్తే... వారి కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడొచ్చని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సింగిల్ బెంచ్ రద్దు చేసిన... ఆ 32 వేలమంది ప్రైమరీ టీచర్ల నియామకాలు చెల్లుతాయని పేర్కొంది. 32 వేల ప్రైమరీ టీచర్ల నియామకాల విషయంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను స్వాగతిస్తున్నట్లు బెంగాల్ విద్యాశాఖమంత్రి బ్రత్య బసు పేర్కొన్నారు. 32 వేల మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఉద్యోగాలు పూర్తిగా సురక్షితంగా ఉన్నాయని పేర్కొంటూ... టీచర్లకు, ప్రాథమిక విద్యా మండలికి శుభాకాంక్షలు తెలిపారు. 2014 ఉపాధ్యాయ అర్హత పరీక్ష తర్వాత నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని పేర్కొంటూ జస్టిస్ గంగోపాధ్యాయ నేతృత్వంలోని సింగిల్ బెంచ్ 2023లో 32 వేల మంది ఉపాధ్యాయుల నియామకాలను రద్దు చేసింది. ఆ స్థానాలకు మూడు నెలల్లోపు కొత్త నియామక ప్రక్రియ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం కేసును విచారించిన జస్టిస్ సుబ్రతా, జస్టిస్ సుప్రతిమ్ భట్టాచార్యతో కూడిన ధర్మాసనం సింగిల్ బెంచ్ ఉత్తర్వుపై స్టే విధించింది. కొత్త నియామక ప్రక్రియను పూర్తి చేయడానికి రాష్ట్రానికి ఆరు నెలల అనుమతి ఇచ్చింది. ఈ స్టేకు వ్యతిరేకంగా రాష్ట్రం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో కేసు తుది విచారణ కోసం హైకోర్టుకు తిరిగి పంపింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ఆ టీచర్ల నియామకాలు చెల్లుతాయని తీర్పునిచ్చింది. వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు వెలువడిన ఈ తీర్పు... విద్యారంగంలో అవినీతి కుంభకోణాలపై విమర్శలను ఎదుర్కొన్న అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు కొంతమేరకు ఉపశమనం కలిగించింది.

'శ్వాస' మా హక్కు

స్వచ్ఛమైన గాలి కావాలి
కాలుష్యాన్ని నియంత్రించాలి
దిల్లీలో విద్యార్థులు, పౌరుల భారీ ఆందోళన

న్యూదిల్లీ: దేశ రాజధాని ఉక్కిరిబిక్కిరవుతోంది. వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకున్నది. శ్వాస ప్రశ్నార్థకమైంది. కాలుష్యం కమ్మేసి ఉండటంతో దిల్లీ వాసులు స్వేచ్ఛమైన గాలి కోసం పోరాడాల్సిన పరిస్థితులు నెలకొన్నది. ఊపిరి పీల్చుకోగల పరిస్థితుల కోసం డిమాండ్ చేస్తూ విద్యార్థులు, పౌరులు రోడ్డెక్కారు. ఈ దారుణ పరిస్థితులపై పాలకులను నిలదీశారు. వాయు కాలుష్యాన్ని ఎందుకు నియంత్రించలేకపోతున్నారని నిలదీశారు. స్వచ్ఛమైన గాలి కోసం డిమాండ్ చేశారు. దిల్లీ, జంతర్ మంతర్ వద్ద బుధవారం భారీ నిరసన ప్రదర్శన జరిగింది. దిల్లీ యూనివర్సిటీ, జేఎన్‌యూ, జామియా మిల్లియా ఇస్లామియా విద్యార్థులతో పాటు ఎన్‌ఎస్‌యూఐ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడం హక్కు అంటూ నినాదాలు ఇచ్చారు. వాయు నాణ్యత చాలా కాలంగా క్షీణించి ఉన్నప్పటికీ దిల్లీ వాసులకు స్వచ్ఛమైన గాలి అందించడం కోసం కచ్చితమైన చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. స్వచ్ఛమైన గాలి అందించాలని డిమాండ్ చేశారు. 'ఏక్యూఐ 50లోపు ఉండే గాలిని పొందేందుకు దిల్లీ వాసులు అర్హులు, స్వచ్ఛమైన గాలి ప్రాథమిక హక్కు ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన గాలి పీల్చుకునే హక్కు ఉన్నది' అంటూ నినాదాలు ఇస్తూ, ప్లకార్డులు, బ్యానర్లను ప్రదర్శించారు. కొందరు గాయకులు తమ పాటలతో ఆందోళనను ఉత్తేజపరచారు. కేంద్రంతో పాటు ఎంసీడీలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ కాలుష్యాన్ని నియంత్రించడంలో విఫలమైందని నిరసనకారులు అసహనం వ్యక్తంచేశారు. గతంలో నిండా క్రీడ సాగేది కానీ ఇప్పుడు సాకులు కూడా లేవని కొందరు దుయ్యబట్టారు. ఏక్యూఐ డేటాను మారుస్తున్నారని నివేదికలు వస్తున్నాయని, అయినప్పటికీ గాలి నాణ్యత చాలా తక్కువగా ఉందని అన్నారు. 'నిజమైన ఏక్యూఐ ఎంతో ఎవరికి తెలుసు? డేటా మొత్తం ప్రభావితం చేస్తూ తప్పుడు గణాంకాలు ప్రచారం చేస్తున్నారు? అయినా నాణ్యత గొప్పగా ఏమీ లేదు. ఈ సమస్యను పరిష్కరించే దిశగా కచ్చితమైన కార్యాచరణ చేపట్టేంత వరకు మా ఆందోళనలు కొనసాగుతాయి. స్వచ్ఛమైన గాలి మన ప్రాథమిక హక్కు' అని నిరసనకారుల్లో ఒకరైన 26 ఏళ్ల నేహా వెల్లడించారు.

10న తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

తీర్పును రిజర్వు చేసింది. దీనిపై ఈ నెల 10న తీర్పు వెల్లడిస్తామని తెలిపింది. వివేకానందరెడ్డి హత్య జరిగి ఏడేళ్లవుతున్నా ఇప్పటికీ సీబీఐ ఏమీ తేల్చలేకపోయింది. పైగా ఈ కేసులో తమ దర్యాప్తు ముగిసిందంటూ సీబీఐ నేరుగా సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డి కుమార్తె సునీత మరలా కోర్టును ఆశ్రయించడంతో ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా లేదా అనే అంశంపై నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును గతంలో సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో సునీత హైదరాబాద్ సీబీఐ కోర్టును ఆశ్రయించారు. తన తండ్రి హత్యపై సీబీఐ జరిపిన దర్యాప్తు సంతృప్తి కరంగా లేదని, ఈ కేసులో మరింత సమగ్ర దర్యాప్తు అవసరమంటూ సునీతారెడ్డి కోర్టును కోరారు. ఆమె పిటిషన్‌పై సీబీఐ కోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సునీత తరపున న్యాయవాది కోర్టుకు వాదనలు వినిపించారు. వివేకా హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపకపోతే అసలు దోషులు తప్పించుకునే ప్రమాదం ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. అలాగే ఈ కేసులో ఇప్పటికే దాఖలు చేసిన ఛార్జిషీట్‌కు అదనంగా అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసేలా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలా చేస్తేనే ఈ కేసులో ఇప్పటివరకు వెలుగు చూడని సంచలన విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. వాదనలు విన్న సీబీఐ కోర్టు తీర్పును 10వ తేదీ వెల్లడిస్తామని ప్రకటించింది.

అవి దోపిడీ చట్టాలు

(మొదటిపేజీ తరువాయి)

మంది వలసదారులు రక్షణ లేకుండా పోయారన్నారు. తప్పనిసరి ఆధార్ ఆధారిత రిజిస్ట్రేషన్ కారణంగా వలసదారులు, అనధికారిక కార్మికులు తరచుగా డాక్యుమెంటేషన్ లోపాలు లేదా పరిమిత డిజిటల్ యాక్సెస్‌ను ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. సామాజిక భద్రతా నమోదుకు అడ్డంకులను సృష్టిస్తుందని ఖర్గే స్పష్టం చేశారు.

నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ కార్మిక చట్టాలను సరళీకృతం చేయడం పేరుతో కేంద్ర ప్రభుత్వం నాలుగు కొత్త కార్మిక కోడ్‌లను తీసుకువచ్చిందని, అయితే ఈ సాకుతో ప్రభుత్వం కార్మికుల అన్ని హక్కులను లాక్కుందని మండిపడ్డారు. "గతంలో కార్మికులకు ఇచ్చిన రక్షణ తీసివేయబడింది. వారి దోపిడీకి కొత్త మార్గాలు తెరవబడ్డాయి. ఈ చట్టాల ద్వారా, నరేంద్ర మోదీ జీ పెట్టుబడిదారీ అనుకూల, కార్మిక వ్యతిరేక మనస్తత్వం మరోసారి తెరపైకి వచ్చింది. దేశం ఈ చట్టాలను అంగీకరించదు" అని ఆమె నిరసన తర్వాత హిందీలో 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ఆ చట్టాలను ఆమె "దోపిడీ చట్టాలు"గా విమర్శించారు. కొత్త కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా పోస్టర్లు, ప్లకార్డులు పట్టుకుని, ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేశారు. వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

ఖర్గేతో పాటు, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, టీఎంసీకి చెందిన డోలా సేన్, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎ.రాజా,సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన సుదామ ప్రసాద్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు. 'కార్పొరేట్ జంగిల్ రాజ్‌కు నో, లేబర్ జస్టిస్‌కు యస్' అని రాసి ఉన్న పెద్ద బ్యానర్‌ను కూడా ఎంపీలు ప్రదర్శించారు.

డ్రోన్లతో అసుపత్రులకు మందులు

విశాలాంధ్ర-సచివాలయం: వైద్య సేవల్లో డ్రోన్లు వినియోగించేందుకు యత్నిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ప్రయోగాత్మకంగా గిరిజన ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా డ్రోన్ల ద్వారా నిర్దేశించిన ప్రాథమిక, సామాజిక, ఏరియా ఆరోగ్య కేంద్రాలకు మందులు, బ్లడ్ యూనిట్లు పంపించాలని అధికారులు యోచిస్తున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో డ్రోన్ల ద్వారా మందులు, బ్లడ్ యూనిట్లు పంపుతున్న సంస్థ 'ప్రూఫ్ అఫ్ కాన్సెప్ట్' కింద ఉచితంగా 9 నెలలపాటు రాష్ట్రంలో సేవలందించేందుకు ముందుకొచ్చిందని అధికారులు తెలిపారు. అత్యవసర సమయాల్లో డ్రోన్ల సేవలు ఎంతగానో ఉపయోగపడతాయి. పాడేరు నుంచి దూర ప్రాంతాల అసుపత్రులకు వాహనాలు లేదా సిబ్బంది ద్వారా మందులు పంపుతున్నారు. ప్రస్తుతం పాడేరు కేంద్రంగా మూడు/నాలుగు డ్రోన్లను వినియోగించే అవకాశం ఉంది. సుమారు 60 నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక, సామాజిక, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలకు పాడేరు నుంచి మందులు, బ్లడ్ యూనిట్లు పంపించాలన్నది అధికారుల ఆలోచన. ఒక్కో డ్రోన్ రెండు కిలోల మందులు, బ్లడ్ యూనిట్లు తీసుకెళ్లగలదు. వాక్సిన్లు పంపేందుకు అవసరమైన చల్లదనం సౌకర్యం కూడా డ్రోన్లలో ఉంది. మందులను బట్వాడా చేసిన అనంతరం సంబంధిత ఆసుపత్రి నుంచి రక్త, మల, మూత్ర నమూనాలను తీసుకొని డ్రోన్ తిరిగి పాడేరుకు వస్తుంది.

దక్షిణకోస్తాను ముంచిన దిత్వా

(మొదటిపేజీ తరువాయి)

రెండు వేల ఎకరాల్లో వరి నారు నీట మునిగింది. బుధవారం సాయంత్రం 5 గంటల నాటికి తిరుపతి(జి) తొట్టంబేడులో 47.2 మిమీ, నెల్లూరు(జి) కృష్ణపట్నంలో 37.5 మిమీ, తిరుపతి(జి) మన్నారుపోలూరులో 32.7 మిమీ, చిత్తూరు(జి) నింద్రలో 30 మిమీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది. గురువారం కూడా నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాల్లో గాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని సూచించింది. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో అధికార యంత్రాంగం తుపాన్ ప్రభావంతో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా నివారించేందుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ... అవసరమైన సహాయక చర్యలు చేపడుతోంది.

రాష్ట్ర ప్రగతి, యువత భవితపై వైసీపీ దాడి

దేవినేని ఉమ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రగతిపై, యువత భవితపై దాడి చేయడమే పనిగా వైసీపీ పెట్టుకున్నదని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. అమరావతిపై వైసీపీ ప్రకటనలు, ఆ పార్టీ అనుబంధ పత్రిక సాక్షి కథనాలను ఖండించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. మిడిమిడి జ్ఞానంతో వైసీపీ నాయకులు ప్రజా రాజధాని గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. అమరావతిపై మాట్లాడే ముందు మూడు వేల మంది రైతులు 1,631 రోజుల పాటు చేసిన ఉద్యమాన్ని మాజీ సీఎం జగన్ గుర్తు చేసుకోవాలని దేవినేని ఉమా దుయ్యబట్టారు. 'జగన్ హయాంలో 272 మంది అమరావతి రైతులు గుండెలు ఆగాయి. 400 కేసులు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టారు. నిరాహార దీక్ష చేస్తున్న రైతులు కనిపించకుండా పరదాల చాటున అసెంబ్లీకి వెళ్లారు. అమరావతిపై అదే కక్షసాధింపు కొనసాగిస్తున్నారు' అని ఆయన విమర్శించారు. కేంద్ర మంత్రి నిర్మాల సీతారామన్ 15 బ్యాంకుల కార్యాలయాలకు అమరావతిలో శంకుస్థాపన చేస్తే విమర్శిస్తూ... తప్పుడు కథనాలతో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మంత్రి నారాయణ, ఎంపీ పెమ్మసాని, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌తో కూడిన త్రిసభ్య కమిటీ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు దేవినేని ఉమా తెలిపారు. ప్రతీ 15 రోజులకు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమరావతిలో 16 వేల మంది కార్మికులు రాత్రి-పగలు శ్రమిస్తున్నారన్నారు. వచ్చే ఏడాది మార్చి 26 నాటికి ఎన్జీఓ, ఎమ్మెల్యేల క్వార్టర్లు, అధికారుల భవనాలు పూర్తి చేస్తామని దేవినేని ఉమా తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణంపై జగన్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో భూముల ధరలు పెరిగి ఉద్యోగ కల్పనకు గనిగా అమరావతి మారుతుందని ఆకాంక్షించారు. శాసనసభకు వచ్చి మాట్లాడని దౌర్భాగ్య స్థితిలో జగన్ ఉన్నారని విమర్శించారు. పులివెందులకు కృష్ణా జలాలు తెచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు మంచి నీళ్లు ఇవ్వని జగన్... మెడికల్ కాలేజీలు గురించి మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని దేవినేని ఉమా అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడుతుంటే వాటిని తెచ్చింది తానేనని జగన్ చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు.

పంటలకు మద్దతు ధర ఏదీ: కారుమూరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం రైతులకు శాపంగా మారిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. ఏ పంటకూ గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'రైతన్నా మీ కోసం' కాదు 'రైతన్నకు మోసం' అంటూ మండిపడ్డారు. రైతులే లేకుండా తమ పార్టీ కార్యకర్తలకు పచ్చ కండువాలు కప్పి, ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధానాన్ని దుర్వినియోగిస్తున్నారని ఆక్షేపించారు. జగన్ ప్రభుత్వంలో ధాన్యానికి మద్ధతు ధరతో పాటు గోను సంచులు, రవాణా ఖర్చులు అందించినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లేక తమ పంటను దళారులకు అమ్ము కునే పరిస్థితుల్లో రైతులు ఉన్నారన్నారు. రూ.1700 ఉండాల్సిన ధాన్యం రూ.1200కే అమ్ముకుంటు న్నారన్నారు. తక్షణమే మద్ధతు ధర కల్పించడంతో పాటు, రానున్న సీజన్‌లో విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై సమీక్షలు కరువయ్యాయని విమర్శించారు. జగన్ హయాంలో ఈ-క్రాప్ చేసి, బీమాతో పాటు సున్నా వడ్డీకే రుణాలిచ్చి రైతులను అన్ని రకాలుగా ఆదుకున్నామన్నారు. పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా జగన్ ప్రభుత్వం అందించిందని కారుమూరి తెలిపారు. మొంథా, దిత్వా తుపాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకునే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. మంత్రి లోకేశ్ దిల్లీకి వెళ్లి వినతిపత్రాలు ఇస్తున్నారేగానీ, పాలకులు ఏమీ ప్రకటించడంలేదన్నారు. 'రైతుల నుంచి అరటి కిలో రూ.50 పైసలకు కొంటున్నారు.... కిలో రూ.50 చొప్పున మార్కెట్‌లో అమ్ముతున్నారు. అంటే మధ్యలో దళారులు లాభపడుతున్నారు. మామిడి, కోకో, చీనీ, పత్తి, అపరాలు, ధాన్యం ఇలా ప్రతి పంటకు మద్ధతు ధర లేక రైతన్న కుదేలవుతున్నాడు. వరి సాగుచేసే రైతుకు పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదు' అని కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి రూపాయి బకాయి లేకుండా ధాన్యం సేకరణ డబ్బులు చెల్లించామని ఓ ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఒన్ జీసీ డ్రెడ్జింగ్ వల్ల నేల కుంగి కొబ్బరి చెట్లు కూలుతున్నాయేగానీ మరే కారణం లేదని అన్నారు. రైతులకు నష్టపరిహారం ఇప్పించడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టిపెట్టాలని, అనవసర మాటలను మానుకోవాలని ఆయనకు కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు

సహజ ప్రసవాలు పెరగాలి వీరపాండియన్

విశాలాంధ్ర-సచివాలయం: సహజ ప్రసవాలు పెంచేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తోందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే గైనికాలజిస్టులకు తొలిసారిగా 'అసిస్టెడ్ వెజైనల్ డెలివరీ' (సహజ ప్రసవం) విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ నెల 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆరు నెలల పాటు శిక్షణ కార్యక్రమాలు జరగనున్నాయి. గుంటూరు, ఒంగోలు, విశాఖ, కాకినాడ, తిరుపతి నగరాల్లో రెండు దశల్లో సెకండరీ, బోధనాసుపత్రుల్లో పనిచేసే 370 మంది గైనికాలజిస్టులకు ఫెర్నాండెజ్ ఫౌండేషన్, యూనిసెఫ్ సాయంతో శిక్షణ ఇవ్వనున్నట్లు వీరపాండియన్ తెలిపారు. 'సహజ ప్రసవాలను ప్రోత్సహించేలా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంటోంది ఇప్పటికే ఎంపిక చేసిన స్టాఫ్ నర్సులకు 18 నెలల ప్రత్యేక ప్రొఫెషనల్ మిడ్ వైఫరీ కోర్సును నిర్వహిస్తోంది. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఈ శిక్షణ ఇస్తున్నారన్నారు. గుంటూరు, తిరుపతి, శ్రీకాకుళం, నెల్లూరు, కర్నూలు, కాకినాడ నగరాల్లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం 172 మంది స్టాఫ్ నర్సులు శిక్షణ పొందుతున్నారు. తొలి బ్యాచ్‌లో 60 మంది స్టాఫ్ నర్సులు శిక్షణ పొందారు. గతంతో పోలిస్తే సిజేరియన్లు తొమ్మిది శాతం వరకు తగ్గాయి' అని వీరపాండియన్ తెలిపారు. ప్రసవ సమయంలో జరిగే పెర్నియల్ కోతల్లో 10 శాతం వరకు తగ్గాయన్నారు. నెదర్లాండ్ కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ మిడ్ వైవ్స్ ఈ శిక్షణా కార్యక్రమాలు, పర్యవేక్షణను బెస్ట్ ప్రాక్టీసెస్ కింద గుర్తించింది.

నేడు ఏపీపీ నియామక పరీక్ష ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఎస్ఎల్‌పీఆర్‌బీ) అధ్వర్యంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలు డిసెంబర్ 4న (సాయంత్రం 05.00 గంటలకు) ప్రకటించనున్నట్లు బోర్డు వెల్లడించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. మొత్తం 42 ఖాళీల కోసం అక్టోబర్ 6న విశాఖపట్నం, కాకినాడ, కర్నూలు, గుంటూరు జిల్లాల్లోని నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షకు మొత్తం 1,520 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులు పరీక్ష ఫలితాలు, ఫైనల్ కీని అధికారిక వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే స్కాన్ చేసిన ఓఎంఆర్ షీట్లు కూడా డిసెంబర్ 13 నుంచి 20 వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి.

భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్లు సుందరరాజ్ తెలిపారు. బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో రీఇన్‌ఫోర్స్‌మెంట్ బృం దాలు తనిఖీలు చేపట్టినట్లు వెల్లడిం చారు. గాలింపులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. పశ్చిమ బస్తర్ మావోయిస్టు నాయకుడు పాపారావు, గంగలూరు ఏరియా కమిటీ సభ్యులతో సహా 12 మంది మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. ఈ ఏడాది జరిగి న ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 275 మంది మావోయిస్టులు మరణించారని ఎస్పీ యాదవ్ వెల్లడించారు.

ఈపీఎస్ పింఛను పెంచం

(మొదటిపేజీ తరువాయి)

నిధికి మూలధనం అనేది వేతనాల్లో యజమాని 8.33 శాతం వాటాతో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పడుతుం ది. ఆ లెక్కల నుంచి వచ్చిన ఆదాయంతోనే ఈ పథకం కింద అన్ని ప్రయోజనాలు అందిస్తున్నాం. ఏటా ఈ నిధిని అంచనా వేస్తుంటారు. అయితే, ప్రస్తుతం ఆ మూల్యాంకనం ప్రకారం ఈ పింఛను నిధి లోటులో ఉంది. దీనికి సరైన రిటర్నులు రానందున... ప్రస్తుత నిబంధనల ప్రకారం కనీస పింఛను చెల్లించేందుకు ప్రభుత్వం అదనపు నిధులు కల్పిం చాల్సి వస్తోంది' అని మంత్రి వివరించారు. దీంతో ఇప్పట్లో ఈపీఎస్ కనీస పింఛన్ పెంచే అవకాశాలు కనిపించట్లేదు.

ఏపీ టెట్ హాల్ టికెట్ల విడుదల

(మొదటిపేజీ తరువాయి)

విడతలుగా పరీక్షలు జరుగుతాయి. మొదటి విడత ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ విడత మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే డీఎస్సీకి దరఖాస్తు చేయాలంటే టెట్ పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంది. దీంతో పెద్దఎత్తున ఈ విడత నిరుద్యోగ ఉపాధ్యాయులతోపాటు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. ఏపీ టెట్ 2025 వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

యాప్ తప్పనిసరి నిబంధన రద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క రోజులోనే 6 లక్షల మంది యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నారని తెలిపింది. వినియోగదారుల సంఖ్య శీఘ్రగతిని పెరుగుతోందని చెప్పింది. యాప్‌ను తప్పనిసరి చేయడం వెనుక ఈ ప్రక్రియను వేగవంతం చేయడం, ప్రజలందరికీ తేలిగ్గా తెలుసుకునే అవకాశం కల్పించడం తమ ఉద్దేశమని డీఓటీ ఆ ప్రకటనలో వివరించింది. సంచార్ సాథీకి పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ముందస్తు ఇన్‌స్టాలేషన్ తప్పనిసరి చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించినట్టు పేర్కొంది.

విద్యుత్ చార్జీలు పెంచం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టాలి. అలాగే భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరువు ఉండదు. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారలో కలుపుతాం. పెన్నాకూ తీసుకెళతాం. భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరువు ఉండదు. పోలవరం రైట్ కెనాల్ నుంచి నీరు ఇస్తే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయని, దీనివల్ల సాగు, తాగునీటితో పాటు పరిశ్రమలకు కూడా నీటి ఎద్దడి లేకుండా చేస్తామని సీఎం వివరించారు.

డిమాండ్ ఉన్న పంటల సాగుతో ఆదాయం

రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి. వినూత్న పద్ధతుల్లో విభిన్న పంటలు పండించాలి. ఏ పంటలకు డిమాండ్ ఉంది, ఎక్కడ మార్కెట్ ఉంది, సాగులో కొత్త విధానాలు ఏంటనే వాటిపై రైతులకు అవగాహన రావాలి. వ్యవసాయ రంగాన్ని రీ-ఓరియేంటేషన్ చేస్తాం. యూనివర్సిటీల్లో చేస్తున్న పరిశోధనలు రైతులకు ఉపయోగకరంగా ఉండాలి. పామాయిల్ సాగులో టెక్నాలజీ ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు. ఆనాడు పామాయిల్ సాగును ఎన్టీఆర్ ప్రోత్సహించారు. సాగు కోసం మొదటిసారిగా మలేషియా నుంచి మొక్కలు తెప్పించారు. నేడు ప్రపంచీకరణతో మొత్తం మారింది. ఎక్కడో ఉక్రెయిన్‌లో జరిగిన యుద్ధం మన పంటలపై ప్రభావం చూపుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు కోపం వస్తే మన రొయ్య ఎగిరిపోయే పరిస్థితి వచ్చింది. ఇథనాల్ తయారీ కోసం కేంద్ర ప్రభుత్వాలు మొదట మొక్కజొన్న సాగును ప్రోత్సహించాయి. తర్వాత పాలసీ మారడంతో ఇథనాల్ తయారీకి 40 శాతం వరి నూకలు, 60 శాతం జొన్నలు వాడుతున్నారు. దీంతో మొక్కజొన్నకు డిమాండ్ తగ్గి రైతులు నష్టపోయారు. అలాగే డిమాండ్ ఉందని హెచ్డీ బర్లీ పొగాకు భారీగా సాగు చేశారు. తర్వాత మార్కెట్ పడిపోయింది. అంతర్ పంటలు వేసిన రైతులకు లాభాలు వస్తున్నాయి. ఎరువుల వాడకం ఎక్కువగా ఉంటే ఖర్చు పెరిగిపోతుంది. చిత్తూరు జిల్లాలో కొందరు రైతులు మామిడి పండ్లకు పురుగు పట్టకుండా కవర్ పెట్టి జాగ్రత్తలు తీసుకోవడంతో మంచి లాభాలు పొందారని సీఎం వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం పదిలం

టెక్నాలజీ వినియోగంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. ఒక పంట వరి వేసినప్పటికీ మరో పంటగా హార్టికల్చర్ కు వెళితే ఆదాయం పెరుగుతుంది. నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు పెడుతున్నాం. రైతులు పండించిన పంటను నేరుగా వినియోగదారునికి విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రకృతి సేద్యంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తయారు చేస్తున్నాం. సీమలో 18 రకాల పంటలు, పండ్లు పండుతున్నాయి. ఎడారిలో పండే ఖర్జూరాలనూ వాళ్లు పండిస్తున్నారు. కాఫీ నుంచి కోకో వరకు, బత్తాయి నుంచి బొప్పాయి వరకు, పట్టు నుంచి పసుపు వరకు...పామాయిల్ నుంచి శనగ వరకు, అగ్రికల్చర్ నుంచి ఆక్వాకల్చర్, హార్టికల్చర్ వరకు....మన దగ్గర పండని పంటలేదు, మన దగ్గర దొరకని ఫలం లేదు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ముందుకెళ్లాలి. డైరీ, పౌల్ట్రీ...మీట్ లో రూ.2 లక్షల కోట్ల జీఎస్డీపీ వస్తుంది. హార్టికల్చర్ లో రూ.లక్షా 85 వేల కోట్ల జీఎస్డీపీ వస్తుంది. చేపలు, రొయ్యల సాగుతో రూ.లక్షా 45 వేల ఆదాయం వస్తుంది. అదే వ్యవసాయంలో కేవలం రూ.50 వేల ఆదాయమే వస్తుంది. ఒకప్పుడు అరకు కాఫీ ఎవరికీ పెద్దగా తెలీదు. మనం ఇచ్చిన ప్రోత్సాహంతో నేడు అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్ గా మారింది. ఈ విషయాలన్నింటిపై అవగాహన పెంచుకుని లాభసాటి సాగు చేయాలని సీఎం సూచించారు.

విమర్శలు సహజమే

పాలనలో సంస్కరణలు తీసుకొస్తున్న క్రమంలో అడ్డంకులు సహజం. నాడు నేను ఐటీని ప్రోత్సహించినప్పుడు విమర్శలు చేశారు. డ్వాక్రా సంఘాలు పెట్టినప్పుడు హేళన చేశారు. కానీ నేడు వాటి ఫలితాలు ఎలా ఉన్నాయో చూస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే విశాఖ నగరానికి గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పనకు కట్టుబడి ఉన్నాం. కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

ఇదేనా సనాతన ధర్మం ?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వ పాలనలో కొబ్బరి, అరటి, పొగాకు, పత్తితోపాటు అన్ని పంటలకూ ధరలు తగ్గాయని, రైతులను ఆదుకునేందుకు ప్రయత్నించకుండా కోనసీమ కొబ్బరికి తెలంగాణ ప్రజల దిష్టి తగిలిందంటూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇదేనా పవన్ అనుసరిస్తున్న సనాతన ధర్మం?, తక్షణమే ఆయన వ్యాఖ్యలను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే విధంగా పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు ఉన్నాయని తప్పుపట్టారు. బాధ్యత కలిగిన ఉప ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పైగా దిష్టితగిలితే పంటలు ఎండిపోతాయని అనడమేనా ఆయనకు తెలిసిన సనాతన ధర్మం అని సూటిగా ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలను బాధ్యత కలిగిన పవన్ కల్యాణ్ ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. ఇలాంటి మాటలు ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చ గొట్టడమేనని, పవన్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భౌగోళికంగా విడిపోయినప్పటికీ, రెండు తెలుగు రాష్ట్రాల(ఆంధ్రా, తెలంగాణ) ప్రజలు సోదర భావంతో కలిసిమెలిసి ఉంటున్నారని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పరస్పర ప్రోత్సాహంతోనే అభివృద్ధి కొనసాగుతుందని, మెరుగైన తత్సంబంధాలు ఉంటాయని తెలిపారు. అలాంటి తరుణంలో పవన్ చేసిన వ్యాఖ్యలు ప్రాంతీయ విభేధాలు సృష్టించేలా ఉన్నాయని అన్నారు. సముద్రం నుంచి పైకొస్తున్న ఉప్పు నీళ్లతో లక్షల సంఖ్యలో చెట్లు కూలిపోతే, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని ప్రభుత్వ వైఫల్యాన్ని దిష్టి మీద రుద్దడం సరికాదన్నారు. మూఢ నమ్మకాలను అడ్డంపెట్టుకుని ప్రజలను కించపరచడం తగదని, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న పవన్ కల్యాణ్ అలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని తెలిపారు. పవన్ కల్యాణ్‌కు చిత్తశుద్ధి ఉంటే కోనసీమ కొబ్బరిచెట్టుపై ఉప్పునీటి ముప్పు నుంచి తప్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, కొబ్బరి రైతుల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవికి పవన్ కల్యాణ్ అనర్హుడని, తక్షణమే ఆయన్ని మంత్రి పదవి నుంచి తొలగించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

పెరిగిన రైతు ఆత్మహత్యలు

పట్టించుకోని ప్రభుత్వం: ఈశ్వరయ్య

విశాలాంధ్ర- పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): రైతుల ఆత్మహత్యలు అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. అనకాపల్లి నుంచి విజయవాడ వెళుతూ పాయకరావుపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 150 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఈశ్వరయ్య తెలిపారు. తుపాను కారణంగా 20 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని, రైతులు వేల కోట్ల రూపాయలు నష్టపోయారని, ఈ నష్టాన్ని అంచనా వేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. నష్టపరిహారం పంపిణీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. ప్రభుత్వంపై విమర్శలు రావడంతో ఢిల్లీ వెళ్లి వినతిపత్రాలు మాత్రమే అందజేశారన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న కూటమి ప్రభుత్వం ఇప్పటికీ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతి గురించి స్పందనే లేదని ఆరోపించారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తానని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు... ఉన్న పరిశ్రమలను ఖాయిలా పడేలా చేస్తున్నారని విమర్శించారు. కొత్త పరిశ్రమలు పెట్టకపోగా... ఉన్న పరిశ్రమలు మూసివేయటం, ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని 100 పర్యాయాలు వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నక్కపల్లి మండలం రాజయ్య పేటలో ఏర్పాటు చేయతలపెట్టిన బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు, రైతులు 75 రోజులుగా ఆందోళన చేస్తుంటే...స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ముఖం చాటేశారన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు బల్క్‌డ్రగ్ పార్క్ గురించి ప్రస్తావనే చేయడం లేదన్నారు. ప్రజల ప్రాణాలు, కాలుష్యం గురించి పట్టించుకోకుండా దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా పారిశ్రామికవేత్తలు, పాలకవర్గాలు కుమ్మకయ్యాయని విమర్శించారు. ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమలే ఎక్కువా అని ప్రభుత్వాన్ని ఈశ్వరయ్య ప్రశ్నించారు. ఆయన వెంట జిల్లా కార్యవర్గ సభ్యులు రావు వెంకట జగ్గారావు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బందుల సుబ్బలక్ష్మి, పార్టీ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, ఓబులరెడ్డి, భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మాఫియా ఆగడాలు అరికట్టండి: ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యువతను నిర్వీర్యం చేస్తూ నేర సంస్కృతిని ప్రేరేపించే గంజాయి మాఫియా ఆగడాలను తక్షణమే అరికట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం బుధవారం గూగుల్ మీట్ ద్వారా జరిగింది. ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, మత్తు పదార్థాల వినియోగం రోజురోజుకూ పెరిగిపోయిందని, యువతను నిర్వీర్యం చేస్తూ నేర సంస్కృతిని పెంచుతున్నందున డ్రగ్స్‌ను నిలువరించాల్సిన పాలకులు చోద్యం చూస్తున్నారన్నారు. 'గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్' అనే ప్రభుత్వ మిషన్ మాటల్లోనే మిగిలిందని ఆయన విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి రవాణా, స్వాధీనం వార్తలు రోజూ వస్తూనే ఉన్నప్పటికీ...ఈ నేరాలకు రాజకీయ అండదండలను అరికట్టే ధైర్యం ప్రభుత్వం చూపడం లేదన్నారు. పాఠశాల విద్యార్థుల నుంచి విశ్వవిద్యాలయ విద్యార్థుల వరకు గంజాయి వినియోగం పెరిగిందని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు ముప్పు అని ధ్వజమెత్తారు. నెల్లూరులో పెంచలయ్యను గంజాయి మాఫియానే హత్య చేసిందని, మత్తుకు బానిసలైన యువత లైంగిక దాడులు, అత్యాచారాలు, దోపిడీలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో గణాంకాల్లో మైనర్లు లక్షల సంఖ్యలో మత్తు కేసుల్లో చిక్కుకోవడం పాలకుల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోందన్నారు. నక్సలైట్ల కోసం అడవులు గాలించే ప్రభుత్వం... గంజాయి పంటలు నిర్మూలించడంలో ఎందుకు మౌనంగా ఉందని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిళ్లు, కొంతమంది నేతల అండదండలే మాఫియాలను బలపరుస్తున్నాయని విమర్శించారు. యువతను చైతన్యపరిచే, మత్తు వ్యతిరేక ఉద్యమాలు బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏఐవైఎఫ్ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతస్థాయి ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.యుగంధర్, పరుచూరి రాజేంద్రబాబు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం: షర్మిల

కోనసీమ కొబ్బరికి తెలంగాణ ప్రజల దిష్టి తగిలిందంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఇలాంటి ఇలాంటి మాటలు ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చ గొట్టడమేనని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు షర్మిల తప్పుపట్టారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ, అన్నదమ్ముల్లాంటి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య మళ్ళీ ప్రాంతీయ విద్వేషాలను నింపొద్దు అని, శంకరగుప్తం డ్రెయిన్‌కు ఇరువైపులా గట్లు, డ్రెడ్జింగ్ నిర్మాణాలకు పట్టింపు లేకపోతే, సముద్రం నుంచి పైకొస్తున్న ఉప్పు నీళ్లతో లక్షల సంఖ్యలో చెట్లు కూలిపోతే, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో ఈ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఇది దిష్టి మీద రుద్దడం సరికాదని, మూఢ నమ్మకాలను అడ్డంపెట్టుకుని ప్రజలను కించపరచడం ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్‌కు తగదన్నారు.

ఫాసిస్టు ప్రభుత్వాలను తరిమికొట్టాలి

కమ్యూనిస్టు పార్టీల పూర్వవైభవం కోసం సైద్ధాంతిక పోరు

గంధమనేని శివయ్య వర్థంతి సభలో వక్తల పిలుపు

విశాలాంధ్ర - తిరుపతి: ఫాసిస్టు ప్రభుత్వాలను తరిమికొట్టేందుకు కమ్యూనిస్టు పార్టీలు ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని వక్తలు పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీల పూర్వ వైభవం కోసం అలుపెరుగని పోరు సాగించాలని పిలుపునిచ్చారు. తొలితరం కమ్యూనిస్టు కామ్రేడ్ గంధమనేని శివయ్య 47వ వర్థంతి సందర్భంగా బుధవారం తిరుపతి గంధమనేని శివయ్య మెమోరియల్ సొసైటీ అధ్వర్యంలో 'భారతదేశంలో వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం , సామాజిక రాజకీయ సాంస్కృతిక రంగాలపై దాని ప్రభావం ' అనే అంశంపై రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రామానాయుడు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిస్టుల పార్టీలు ప్రజా సమస్యలపై ఉద్యమాలతో పాటు పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలన్నారు. నూరేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నెమరు వేసుకుంటున్న తరుణం లో వైఫల్యాలను కూడా సమగ్రంగా చర్చించు కోవాలన్నారు. నేటి ఫాసిస్ట్ పాలకులు భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి ఫాసిస్ట్ రాజ్యాంగం నిర్మించేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. అదే జరిగితే దేశానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం అన్నారు. దీనిని ఎదుర్కోవడానికి కమ్యూనిస్టు పార్టీలతో పాటు ప్రజా సంఘాలు బలపడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు డి. పాపారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం ముందు నుండి నేటి వరకు సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. కమ్యూనిస్టు భావజాలం సమాజంలో, ప్రజల మనస్సులో బలంగా ఉందన్నారు. కమ్యూనిస్టుల పనైపోయిందనేవారికి చేతలతో బుద్ధి చెప్పాలన్నారు. ప్రజల పక్షాన నిలబడి బలమైన ఉద్యమాలు నిర్మించాలని, సైద్ధాంతిక పోరాటాలకు వెనుకాడకూడదన్నారు. ధనిక దేశాలు తమ నిర్ణయాలతో శ్రమ చేసి జీవించడానికి బదులు ప్రజల్ని ఈజీ మనీకి అలవాటు చేస్తున్నారన్నారు. రియల్ ఎస్టేట్ రంగం లోనే పెట్టుబడులు ఉన్నాయని దీని ద్వారా ఉత్పత్తి పెరగదన్నారు. అదనపు విలువ కనబడని చోట వర్గ పోరాటాలు తగ్గిపోయాయని...దీని ప్రభావం వల్ల కమ్యూనిస్టు ఉద్యమాలు తగ్గాయన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని కమ్యూనిస్టుల పనైపోయిందనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతికతలు వస్తున్న తరుణంలో ప్రపంచం మొత్తం నిరుద్యోగ సమస్య మరింత పెరుగుతోందన్నారు. నిరుద్యోగ సమస్యను ప్రధానంగా తీసుకుని కమ్యూనిస్టులు పోరాడాలని పిలుపునిచ్చారు.సభకు అధ్యక్షత వహించిన ఏ రామానాయుడు మాట్లాడుతూ గంధమనేని శివయ్య ఉమ్మడి జిల్లా పార్టీ కార్యదర్శి గా పనిచేసే బలమైన పార్టీ ఉద్యమాన్ని నిర్మించారని తెలిపారు. పార్టీ చీలిక అనంతరం పుత్తూరు నుండి సీపీఐ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని చెప్పారు. భూస్వామ్య కుటుంబం నుండి వచ్చినప్పటికీ పార్టీలో అంకితభావంతో పని చేశారని పేర్కొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు గంధమనేని శివయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అతిథులకు సీపీఐ జిల్లా కార్యదర్శి పీ మురళి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధాకృష్ణ, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి ఆర్.హరికృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చారులత, నాగరాజు, ఫ్లూట్ సుబ్బు లు ఆలపించిన ఉద్యమ గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

గంజాయి ముఠాపై ప్రభుత్వం తీరిదేనా ?

శ్రీనివాసరావు ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గంజాయి గ్యాంగులపైనా, పెంచలయ్య హత్యపైనా ప్రభుత్వ స్పందన దారుణంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 28వ తేదీన నెల్లూరులో గంజాయి బ్యాచ్ పెంచలయ్యను హత్య చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ కొనసాగుతోందని, అయినా ముఖ్యమంత్రి గానీ, హోంమంత్రిగానీ స్పందించలేదని తెలిపారు. దీనిపై హోంమంత్రికి లేఖ రాశామని ఆయన గుర్తుచేశారు. రాజకీయ హత్యల్లో తమవారికో న్యాయం... ఇతరులకు మరో న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పనిచేసిన పెంచలయ్య హత్యకు గురైతే కనీసం మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గంజాయి మాఫియాకు బలైన పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ సభలో నెల్లూరులో లేడీడాన్ల గురించి మాట్లాడిన సీఎం... దాన్ని రాజకీయ నిందల కోసం వాడుకున్నారేగానీ, గంజాయి గ్యాంగ్‌లపై పోరాడి చనిపోయిన పెంచలయ్య హత్యపై మాట్లాడ లేదని విమర్శించారు. కందుకూరులో రాజకీయ హత్య జరిగితే సీఎం నేరుగా వెళ్లి భారీఎత్తున పరిహారం ప్రకటించారని, అలాంటిది ప్రజల కోసం చనిపోయిన వారికి సాయం చేయలేరా అని ప్రశ్నించారు. దీనిపై ముఖ్యమంత్రిని కలవడానికి అపాయింట్‌మెంట్ కోరామన్నారు. కలెక్టర్‌ను కలుస్తామని, స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని చెప్పారు. రాష్ట్రంలో పేరెంట్ టీచర్స్ సమావేశాలను రాజకీయ వేదికలుగా మార్చొద్దని, గతంలో రాజకీయాలకు, విద్యార్థి సంఘాలకు అవకాశం లేదని జీవో ఇచ్చి... ఇప్పుడు తెలుగుదేశం కార్యకర్తలు పీటీఎంలకు వెళ్లాలని చెప్పడం విద్యా వ్యవస్థను చెడగొట్టడమేనన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే విధంగా పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు ఉన్నాయని ఎద్దేవా చేశారు.

ఉక్కు కార్మికులకు పనికి తగ్గ వేతనం

వేతనాల్లో కోత నిబంధన తొలగింపు

రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగార యాజమాన్యం ఇష్టారాజ్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా, ఉక్కు కార్మికులకు పర్సెంటేజీ రూపంలో వేతనాలు ఇచ్చే సర్క్యులర్ జారీ చేయడం దారుణమని, ఇలాంటి పిచ్చి తుగ్లక్ నిర్ణయాలు ఉపసంహరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఉత్పత్తికి అనుగుణంగా ఇన్సెంటివ్, బోనస్‌లు ఉంటాయని, కార్మికుడు రోజులో ఎనిమిది గంటల పాటు పని చేసేందుకు వేతనం ఉంటుందని తెలిపారు. ఉత్పత్తి బాగుంటే దానికి అనుగుణంగా ఇన్సెంటివ్‌లు ఇస్తారని, అలాకాకుండా వేతనాలు ఇవ్వడం ఏమిటని ఆయన ధ్వజమెత్తారు. ఉక్కు కార్మికుడు రాత్రింబవళ్లు ఎంతో ప్రమాదకరమైన పరిస్థితులలో సరైన సదుపాయాలు లేకున్నా, సిబ్బంది తక్కువ ఉ ఉన్నా దేశంలో ఏ స్టీల్ ప్లాంట్‌లో లేని విధంగా రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారని అన్నారు. సెయిల్ కర్మాగారంలో కార్మికుడు ఏడాదికి 610 టన్నులు ఉత్పత్తి చేస్తుంటే, విశాఖ ఉక్కులో 785 టన్నులు ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. అయితే యాజమాన్యం చేతకాని తనంతో ముడి సరుకును సకాలంలో అందించకపోవడం, యంత్రాలకు సకాలంలో మరమ్మతులు చేయించక ఉత్పత్తి తగ్గించి... నేడు దానిని కార్మికు లపై నెట్టి పర్సెంటేజీ రూపంలో వేతనాలు చెల్లించడం అన్యాయని అన్నారు. ఇప్పటికే కార్మికులకు రావలసిన హెచ్ఎస్ఏ ఇన్సెంటివ్‌తో పాటు అన్ని ప్రయోజనా లలో కోత విధించారన్నారు. ఉక్కు యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని, ఉక్కు మంత్రిత్వ శాఖ తక్షణమే స్పందించి పూర్తి వేతనాలు చెల్లించాలని, గతంలో ఇవ్వాల్సిన బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్మాగారంలో దాదాపు 450 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, దశలవారీగా యాజమాన్యం ఇంకా తొలగిస్తూనే ఉందని చెప్పారు. మొదటి దశలో 1,500 మందిని, రెండో విడత 1,540 మందిని పనుల నుంచి పక్కన పెట్టారని అన్నారు. ఈ విధంగా దాదాపు 3,500 మంది కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వివరించారు. కాంట్రాక్ట్ కార్మికులు పనిలోకి వెళ్లే వరకు ముందస్తు సమాచారం లేకుండానే ఆపేయడం వల్ల వారి విధుల నిర్వహణలో ఆందోళన నెలకొందన్నారు. ఉక్కు కర్మాగారంలో నిర్దేశించిన ఉత్పత్తిని వంద శాతం సాధిస్తేనే పూర్తి వేతనం ఇస్తామని ఇటీవల యాజమాన్యం ప్రకటించిందని, లక్ష్యానికి ఎంత శాతం తగ్గితే అంత మేర వేతనాల్లో కోత పెడతామనే నిబంధనలు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మిక వ్యతిరేక నిర్ణయాలు ఉపసంహరించకపోతే జరిగే పరిణామాలకు వారే బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా

18న ధర్నా జయప్రదం చేయండి

డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-అమలాపురం: వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పడాన్ని నిరసిస్తూ ఈ నెల 18న వైద్య కళాశాలల వద్ద ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపు నిచ్చారు. బుధవారం అమలాపురం ఎస్టీయూ కార్యాలయం నందు శీలం వెంకటేష్ అధ్యక్షతన సీపీఐ జిల్లా సమితి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరయిన డేగా ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన 17 వైద్య కళాశాలల్లో 5 కళాశాలలు ప్రారంభమై అడ్మిషన్లు నడుస్తున్నాయని, మిగిలిన 12 కళాశాలలను ప్రస్తుతం ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు 33 సంవత్సరాల లీజుకి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తుందన్నారు. దాని ద్వారా ప్రభుత్వం అధీనంలో ఉండాల్సిన కళాశాలలు ప్రైవేటు కళాశాలలుగా మారతాయని విమర్శించారు. కోట్లు ఖర్చు పెట్టి వైద్య సీట్లు కొనాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్య విద్య కలగానే మిగిలిపోతుందని తెలిపారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాల్సిన ఈ ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు చవకగా ప్రభుత్వ భూములు అప్పజెప్పి ఓటు వేసిన ప్రజలను నట్టేట ముంచుతున్నాయని మండిపడ్డారు. అలాగే రైతులకు మద్దతు ధర అందించాలని, వరుస తుపానుల కారణంగా నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న మార్కెట్ యార్డుల వద్ద నిరసనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరగాల్సిన సీపీఐ శత వార్షిక వేడుకలు తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ఎన్నికల కారణంగా జనవరి 18కి వాయిదా పడ్డాయని, జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆ మహాసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సమితికి ఎస్టీయూ జిల్లా సమితి రూ.10 వేలు విరాళంగా అందజేసింది. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్తిబాబు, రామకృష్ణ, రాము, రవి, తాతాజీ, యేసురాజు, యేసుదాసు, ఆనంద్, గెడ్డం ప్రభాకర్, చిట్టూరి ప్రసాద్, రామిరెడ్డి, శ్యామ్, ఉండవల్లి గోపాలరావు, మాచరయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూటమి సర్కార్ అండ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గంథ్రాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర బాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు. దివ్యాంగులను అన్ని విధాలుగా ఆదుకుని అండగా నిలుస్తుంది కూటమి ప్రభుత్వమేనని నేతలు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో దివ్యాంగులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దివ్యాంగులకు ట్రై సైకిల్స్ వంటి ఉపకరణాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పింఛన్లను రూ.3 వేల నుంచి 6 వేలకు పెంచి వారి అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. అర్హులయిన వారందరినీ గుర్తించి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి, మంత్రి బాధ్యత తీసుకున్నారన్నారు. దివ్యాంగుల సంకల్పాలను అవకాశాలుగా మార్చుకునే దిశగా ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం 17 నెలల్లో విభిన్న ప్రతిభావంతులను ఎలా ఆదుకోవాలని ఒక కార్యాచరణ రూపొందించి క్షేత్ర స్థాయిలో అమలు చేస్తోందన్నారు. పూర్తిగా మంచానికి పరిమితమైన వారి పింఛన్ రూ.15 వేలు చేశారని తెలిపారు. వివిధ వ్యాపారాలు, రంగాలలో దివ్యాంగులను పైకి తీసుకురావడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అవసరమైన వారు ద్విచక్ర వాహనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతుల గోడు ప్రభుత్వానికి పట్టదా?

- తాటిపాక మధు
- వెంటనే పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్
- 10న పిఠాపురంలో అందోళనకు పిలుపు
- తుపానుకు దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

విశాలాంధ్ర-కాకినాడ/పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గంలో ఏ రైతును కదిలించినా మొంథా తుపాను సాయం అందలేదని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదని రైతులు, కౌలు రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు అవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పై సీపీఐ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ నెల 10న పిఠాపురంలో ఆందోళన చేస్తామని మధు తెలిపారు. బుధవారం ఉదయం నుండి పిఠాపురం మండలంలో సీపీఐ, రైతు సంఘం జిల్లా కమిటీల అధ్వర్యంలో తుపానుకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేస్తామని, అందుకు గాను 6 కోట్ల70 లక్షల గోనె సంచులు అందుబాటులో ఉంచుతామని చెప్పిన ప్రభుత్వం... ఆచరణలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కనీసం గోనె సంచులను రైతాంగానికి అందించడంలో విఫలమైందని, తేమ శాతం పేరుతోనూ, ధాన్యం రంగు మారిందని, తాలు, తప్పలు ఉన్నాయని ధాన్యం కొనుగోలు చేయకుండా అనేక కొర్రీలు పెడుతున్నారన్నారు. ప్రస్తుతం దిత్వా తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతింటాయని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, కనీసం పంటను ఆరబెట్టుకోవడానికి, తడవకుండా కాపాడుకోవడానికి పట్టాలు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కొనుగోలు నిబంధనలు సడలించి ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పేవన్నీ పేపర్లకే పరిమితమయ్యాయని... ఆచరణ శూన్యమన్నారు. కొనుగోలు కేంద్రం, రైతు సేవ కేంద్రం, రవాణా ఇంచార్జిలు, కస్టోడియన్ ఆఫీసర్లు రైస్ మిల్లర్స్ కుమ్మక్కై ధాన్యం దళారులకే అమ్ముకునే విధంగా వ్యవహరిస్తున్నరన్నారు. క్షేత్ర స్థాయిలో ధాన్యం రైతులు ఇబ్బంది పడుతుంటే నాదెండ్ల పర్యటనలకే పరిమితమవుతున్నారని పేర్కొన్నారు. దీంతో 75 కేజీల బస్తాను రూ.1200 అమ్ముకొని బస్తాకు రూ.400 నుంచి 500 వరకు నష్టపోతున్నారని, కొనుగోలులో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని,దోపిడీని నివారించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మొంథా తుపాను వలన రూ.5500 కోట్లు పైగా నష్టం జరిగితే ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.1000 కోట్ల మేర ధాన్యం రైతులకు నష్టం జరిగిందన్నారు. ఎన్యూమరేషన్ పూర్తి చేసి నెల రోజులైనా రైతాంగానికి నష్ట పరిహారం అందించకపోవడం రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదనడానికి నిదర్శనమన్నారు. కూటమి సర్కారు ఉచిత పంటల బీమా పథకం ఎత్తివేసి స్వచ్ఛంద పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టడంతో బీమా ప్రీమియం భారం భరించలేక ఎక్కువ మంది రైతులు పథకంలో చేరలేక పోయారన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు బీమా పరిహారం దక్కే అవకాశం లేకుండా పోయిందని... దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రబీ నుండైనా ఉచిత పంటల బీమా పథకం అమలు అమలు చేయాలని కోరారు. గత 18 నెలలగా రాష్ట్ర ప్రభుత్వం రైతులను నమ్మించి మోసం చేసిందన్నారు. ఇంటికి వెళ్లి రైతును రాజును చేస్తామని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని,రైతులను రాజును చేయటం ఏమోగానీ రైతులను బికార్లను చేయొద్దన్నారు. రైతుల అభివృద్ధికి ప్రభుత్వం పంచసూత్రాలను ప్రచారం చేస్తోందని... కూటమి సర్కారు ఆధికారంలోకి వచ్చిన తరువాత పంచ పాపాలు చేసి రైతాంగాన్ని దగా చేసిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసాలను నిలదీయడానికి, ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 10 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులు, రైతాంగానికి పిలుపునిచ్చారు. కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని మొంథా తుపాను, ఆధిక వర్షాలు, వరదలు, కరువు వలన పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు, కౌలురైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీని చెల్లించాలని మధు డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సీపీఐ జిల్లా కార్యదర్శి కే బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, పిఠాపురం కార్యదర్శి సాక రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎన్.శ్రీనివాస రావు, కే గోవింద్, రైతులు దొరబాబు, టీ ఏసుబాబు, గోవింద్, రాజాల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘన

వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్‌బాబు ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘన చేస్తూ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆక్షేపించారు. చట్టాన్ని చుట్టంగా భావిస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో పరాకాష్టకు చేరిందని ఆయన దుయ్యబట్టారు. సాక్ష్యాలు, కారణాలు లేకుండా ఎడాపెడా కేసులు నమోదు చేస్తున్న కూటమి ప్రభుత్వం, తమ పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఎప్పటికప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శించారు. ఏడాదిన్నర కాలంగా ఈ ప్రభుత్వం రాష్ట్రానికి, ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అధికారమే పరమావధిగా ఏ మాత్రం నైతిక విలువలు లేకుండా సీఎం చంద్రబాబు వికృత, నీచ రాజకీయాలు చేస్తారనీ, అధికారం కోసం ఆయన ఏ అడ్డదారి అయినా తొక్కుతాడని, ఆ చర్యల్లో చంద్రబాబు డబుల్ పీహెచ్‌డీ పట్టా పొందారని దుయ్యబట్టారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.29(4)/టి.ఓ./2025-26 తేది : 28-11-2025
2025-26 సంవత్సరమునకు కోర్టు భవనాలు మరమ్మత్తుల నిమిత్తం మొత్తము 4 పనులకుగాను అంచనా విలువ : రూ.72.00 లక్షలకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు తేది : 08-12-2025, సా. 3గం.ల నుండి. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in లో పొందవచ్చును. ఫోన్ : 08672-252500.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు (ర.భ) శాఖ, మచిలీపట్నం
DIPR/18248/CL/ADVT-1/1/2021-22 Dt.3-12-2025

సంపాదకీయం

అజ్ఞాన జనిత అసత్య ప్రచారం

చదువు వచ్చిన వారికి చదువు రాని వారికీ తేడా స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. ఇక్కడ చదువు అంటే అక్షరాస్యత, డిగ్రీలు, స్నాతకోత్తర పట్టాలు అని కాదు. కానీ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ తనకొచ్చిన చదువునంతా అటకెక్కించేసి వాట్సాప్ యూనివర్సిటీ డిగ్రీకోసం తాపత్రయ పడుతున్నట్టున్నారు. చదువు లేకపోవడం ఎవరి తప్పూ కాకపోవచ్చు. రాజకీయ నాయకులకు విద్యార్హత ఉండవలసిన అవసరం లేదు. కానీ జ్ఞానం, లోకజ్ఞానం – రెండూ ఉంటేనే గానీ ఎవరూ రాజకీయాలలో రాణించలేరు. రాజ్‌నాథ్‌సింగ్ విద్యార్హతపై ఎలాంటి అనుమానాలూ లేవు. ఆయన భౌతిక శాస్త్రం (ఫిజిక్స్) లో ఎమ్మెస్సీ పట్టా సాధించారు. కొంత కాలం అధ్యాపకుడిగా కూడా పని చేశారు. 74 ఏళ్లు దాటిన రాజ్‌నాథ్‌సింగ్ రాజకీయ అనుభవం కూడా సుదీర్ఘమైందే. 13 ఏళ్ల వయసు నుంచి ఆయనకు ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధం ఉంది. ఆయన ఉత్తరప్రదేశ్ మంత్రి వర్గంలో విద్యాశాఖను కూడా నిర్వహించారు. ఆ తరవాత ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా అయ్యారు. ఆయన హయాంలోనే ఉత్తరప్రదేశ్‌లో వేదిక్ గణితాన్ని పాఠ్యాంశంగా చేర్చారు. పరీక్షల్లో కాపీ కొట్టడాన్ని నిరోధించడానికి చట్టం కూడా తీసుకొచ్చారు. రాజ్‌నాథ్‌సింగ్ విద్యాధికుడే కాక పరిణత రాజకీయ నాయకుడు అనుకుంటాం. అలాంటి పెద్ద మనిషి రాజకీయ స్వప్రయోజనాల కోసం ఏ రకంగానూ సమర్థనీయం కాని అబద్ధాలు మాట్లాడుతున్నారు. మంగళవారం ఆయన మెడకాయ మీద తలకాయ ఉన్న వారందరూ నిర్ఘాంత పోయే అబద్ధం చెప్పారు. పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ నిధులతో బాబ్రీ మసీదు నిర్మించాలనుకున్నారని జంకూ గొంకూ లేకుండా పెద్ద అబద్ధం ఆడేశారు. నెహ్రూ మీద రాజ్‌నాథ్‌సింగ్ తెలిసి తెలిసి అబద్ధం ప్రచారంలో పెడుతున్నారని గ్రహించడానికి పెద్ద పరిశోధన అక్కర్లేదు. ఎందుకంటే నెహ్రూ బతికున్నన్నాళ్లూ ఆ తరవాత 28 ఏళ్లు బాబ్రీ మసీదు పదిలంగానే ఉంది. అలాంటప్పుడు నెహ్రూ బాబ్రీ మసీదును నిర్మించడం ఏమిటి? దాని నిర్మాణానికి ప్రభుత్వ నిధులు వెచ్చించాలనుకోవడం ఏమిటో? ప్రభుత్వ ధనంతో నెహ్రూ బాబ్రీ మసీదు నిర్మించాలనుకుంటే దాన్ని వ్యతిరేకించిన ఏకైక వ్యక్తి సర్దార్‌పటేల్ అని చెప్పడానికి రాజ్‌నాథ్‌సింగ్ ఏమాత్రం సిగ్గు పడలేదు. బాబ్రీ మసీదు పునర్నిర్మాణ చర్చ 1992 డిసెంబర్ 6 న సంఘ్ పరివార్ కరసేవకులు నేల మట్టం చేసిన తరవాత కదా చర్చలోకి వచ్చింది. బాబ్రీ మసీదుకు సంబంధించి నెహ్రూ ప్రమేయం ఒకే ఒక్కసారి కనిపిస్తుంది. అది 1949 లో ఓ అర్ధరాత్రి వేళ దొంగచాటుగా బాబ్రీ మసీదులో రాముడి విగ్రహాలు చేర్చడం. దీన్ని నెహ్రూ అంగీకరించలేదు. ఆ విగ్రహాలను తొలగించాలని అప్పటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి గోవింద వల్లభ్ పంత్‌ను నెహ్రూ కోరారు. కానీ ఆ ప్రాంత జిల్లా కలెక్టర్ కె.కె.నాయర్ వెనుకాడారు. పటేల్ కూడా ఆ విగ్రహాలను తొలగించాలనే అన్నారు. నెహ్రూ అనుకున్నట్టు విగ్రహాలను బాబ్రీ ఆవరణ నుంచి తొలగించడం కుదరనే లేదు. విగ్రహాలు తొలగిస్తే అగ్గి అంటుకుంటుంది అని గోవింద్ వల్లభ్ పంత్, ఆ ప్రాంత జిల్లా కలెక్టర్ కె.కె.నాయర్ భయపెట్టారు. బాబ్రీ నిర్మాణానికి ప్రభుత్వ నిధులు వినియోగించాలని నెహ్రూ అనుకున్నట్టు, అప్పటి హోం మంత్రి సర్దార్‌పటేల్ దాన్ని వ్యతిరేకించినట్టు రాజ్‌నాథ్‌సింగ్ అల్లింది కేవలం కట్టుకథే. నెహ్రూకు, సర్దార్‌పటేల్‌కు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, అధికారిక దస్తావేజులు అన్నీ ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయి. ఈ ఇద్దరు నాయకుల సంకలిత రచనలు డజన్ల సంఖ్యలో ఉన్నాయి. నెహ్రూ రచనల, ఉపన్యాసాల, ఉత్తర ప్రత్యుత్తరాల సంపుటాలన్నీ కలిపితే వంద దాకా ఉంటాయి. ఇవన్నీ అందుబాటులోనే ఉన్నాయి.

రాజ్‌నాథ్ సింగ్ చదివింది భౌతిక శాస్త్రమైనా చరిత్ర గురించి మాట్లాడేటప్పుడు చరిత్రలో కొన్ని పేజీలైనా తిరగేయాలన్న ఆలోచన రాజ్‌నాథ్ సింగ్‌కు రానే లేదు. సైన్స్ చదువుకున్న వారందరికీ శాస్త్రీయ జ్ఞానం ఉంటుందనుకోలేం. రాజ్‌నాథ్‌సింగ్ దీనికి మినహాయింపు కాదు. ప్రభుత్వ రికార్డుల్లోగాని నెహ్రూ-పటేల్ సంకలిత రచనల్లో గానీ రాజ్‌నాథ్‌సింగ్ చేసిన ఆరోపణ ఎక్కడా కనిపించదు. ఏ చరిత్రకారుడూ ఇలాంటి ప్రస్తావన ఎన్నడూ తీసుకురాలేదు. ఇప్పుడు అందుబాటులో ఉన్న గ్రోక్‌లాంటి కంప్యూటర్‌పరిజ్ఞానాన్ని ఉపయోగించినా రాజ్‌నాథ్ సింగ్ అబద్ధాల ఊసు ఎక్కడా కనిపించదు. అయితే ఉన్నత స్థానాల్లో ఉన్న రాజ్‌నాథ్ సింగ్ లాంటి వారు చెప్పేది అబద్ధమైనా ఆ ప్రభావం కచ్చితంగా లోతుగా పరిశీలించే అలవాటు లేని జనం మీద ఉంటుంది. పైగా వాట్సప్ యూనివర్సిటీ రాజ్యమేలుతున్న దశలో అసత్యం ఆఘమేఘాల మీద వ్యాపిస్తుంది. రాజ్‌నాథ్ ఇలా మాట్లాడడం హాస్యాస్పదమే కాదు దౌర్భాగ్యం. నెహ్రూ వ్యక్తిత్వం, ఆయన ఆలోచనా విధానం ఏమిటో గ్రహించడానికి మరో ఉదంతం గురించి తెలుసుకోవాలి. సోంనాథ్ దేవాలయం జీర్ణోద్ధారణ జరిగింది. దీనికి ప్రభుత్వ ధనం ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పిన మాట అక్షర సత్యం. సోంనాథ్ ఆలయ జీర్ణోద్ధరణకు ప్రభుత్వ ధనం వాడకూడదని మత విశ్వాసాలు ఉన్న మహాత్మాగాంధీ కూడా అనేవారు. నెహ్రూది అదే అభిప్రాయం. కానీ ఆలయ పునరుద్ధరణ తరవాత అప్పటి రాష్ట్రపతి డా. రాజేంద్రప్రసాద్‌ను ఆహ్వానించారు. ఇలాంటి కార్యక్రమాలకు రాష్ట్రపతిస్థానంలో ఉన్నవారు వెళ్లకూడదని నెహ్రూ అభిప్రాయపడ్డారు. అప్పటి రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి ఈ విషయంలో జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు అందుబాటులో ఉన్నాయి. తమ జ్ఞానాన్ని అజ్ఞానం ప్రచారం చేయడానికి ప్రయత్నించిన "మహామహుల"కు కొదవేలేదు. హనుమాన్‌ప్రసాద్ పోద్దార్ గీతా ప్రెస్ ట్రస్టీలలో ఒకరు. ఆయన "కళ్యాణ్" పత్రిక నిర్వహించే వారు. అందులో గాంధీ కూడా రెండో మూడో వ్యాసాలు రాశారు. ప్రేంచంద్ కూడా రాశారు. అంతమాత్రంచేత గాంధీ, ప్రేంచంద్ మతతత్వవాదులు అయిపోరు. నెహ్రూనుకూడా తమ "కళ్యాణ్" పత్రికలో రాయాలని పోద్దార్ రెండుసార్లు అడిగారు. కానీ సైద్ధాంతిక సామ్యం లేని చోట తానురాసే ప్రసక్తేలేదని నెహ్రూ తెగేసిచెప్పారు. సెక్యులరిజం, సోషలిజం, అంతర్జాతీయవాదం గురించి నెహ్రూకు కచ్చితమైన, నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉండేవి. వాటితో ఆయన ఎప్పుడూ రాజీ పడలేదు. నెహ్రూకు-సర్దార్ పటేల్‌కు, నెహ్రూకు-సుభాష్‌చంద్రబోస్‌కు, నెహ్రూకు నేతాజీకి విభేదాలున్నాయని సంఘ్ పరివార్ నిరంతరం ప్రచారం చేస్తూ ఉంటుంది. వారి మధ్య ఉన్నవి భిన్నాభిప్రాయాలే గానీ విభేదాలు కావు. చరిత్ర గురించి కనీస అవగాహన లేని రాజ్‌నాథ్ లాంటి వారు అబద్ధాలు తప్ప ఏం చెప్పగలరు గనక!

పుష్కలంగా ఉన్నా... దిగుమతులా?

ఆంధ్రప్రదేశ్‌లో నేడు మొక్కజొన్న రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నాడు. సేద్యపు ఖర్చులు పెరగడం, పండించిన పంటకు న్యాయమైన ధర లభించక, మద్దతు ధర అలంకార ప్రాయంగా మారడం, దళారుల దోపిడీకి గురై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. ప్రపంచంలో మొక్కజొన్నను అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశాలు అమెరికా, మెక్సికో, బ్రెజిల్, చైనా. అమెరికా 9 కోట్ల, 60 లక్షల ఎకరాల సాగు ద్వారా 360 మిలియన్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి చేస్తూ మొదటి స్థానంలో ఉంది. అమెరికా ఆర్థిక వ్యవస్థలో మొక్కజొన్న ఉత్పత్తి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నది.

ప్రపంచ ఎగుమతుల్లో అమెరికా వాటానే 50% గా ఉంది. అమెరికా పాలకులు 1930 నుంచి మొక్కజొన్న ఉత్పత్తికి మద్దతు ఇస్తున్నారు. గత 20 సంవత్సరాల్లో సబ్సిడీ సగటు వార్షిక వ్యయం 47 లక్షల డాలర్లు. ప్రతి సంవత్సరం అమెరికా రైతు 61 వేల డాలర్ల సబ్సిడీ పొందుతున్నాడు. భారత రైతులకు కేవలం 282 డాలర్లు మాత్రమే సబ్సిడీ లభిస్తున్నది. అమెరికాలో మొక్కజొన్న దిగుబడి హెక్టార్‌కు 11 టన్నులు కాగా, భారత్‌లో 2 టన్నుల 540 కిలోలు మాత్రమే. నేడు భారతదేశంలో 9.89 మిలియన్ల హెక్టార్ల మొక్కజొన్న సాగు ద్వారా ప్రపంచ విస్తీర్ణంలో 4 వ స్థానంలో ఉంది. ఉత్పత్తి 42.3 మిలియన్ టన్నులు. సగటు దిగుబడి ఎకరాకు 20 క్వింటాళ్లు. దిగుబడుల్లో చాలా వెనుకబడి ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంవత్సరం 1.42 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. దేశంలో మొక్కజొన్న సాగులో తెలంగాణ 5 వ, ఆంధ్రప్రదేశ్ 7వ స్థానంలో ఉన్నాయి. ఏపీ ఎకరా సేద్యపు ఖర్చు 30 నుంచి 35 వేలు. కౌలు రైతులు అదనంగా మరో 13 వేలు కౌలు చెల్లించాలి. సగటు దిగుబడి 25 క్వింటాళ్లు. కొందరి రైతులకు 35 క్వింటాళ్ల దాకా వస్తున్నది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర 2,400 రూపాయలు. ఈ ధర రైతులకు అంత ప్రయోజనంగా లేదు. ఏపీ రైతులకు మద్దతు ధర లభించక నష్ట పోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలు లేక పోవడం వల్ల ప్రైవేట్ మార్కెట్లో లభిస్తున్న ధర 1600 రూపాయలు మాత్రమే. కొన్ని ప్రాంతాల్లో 1450 మాత్రమే ధర దక్కుతున్నది. ఫలితంగా రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రాక నష్ట పోతున్నాడు.

రైతాంగం గిట్టుబాటు ధర లభించక నష్టపోయి అప్పుల పాలౌతుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకునే చర్యలు తీసుకోవాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. దేశ రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నను కొనుగోళ్లు చేయకుండా 5 లక్షల టన్నుల మొక్కజొన్నను మోదీ ప్రభుత్వం అమెరికా నుంచి దిగుమతి చేసుకుని భారత రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టింది. అమెరికా మొక్కజొన్నను భారత్ దిగుమతి చేసుకోవాలని మోదీని ట్రంప్ బెదిరించడం, ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన చర్చల్లో మా మొక్కజొన్న కొనరా అని అమెరికా వాణిజ్య మంత్రి హౌ వార్డ్ లుట్నిక్ భారత ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, అందుకు తలొగ్గిన మోదీ ప్రభుత్వం మొక్కజొన్న దిగుమతిపై 11%గా ఉన్న సుంకాన్ని కూడా తొలగించి దిగుమతి ఒప్పందం చేసుకోవడం భారత ప్రభుత్వంపై అమెరికా ఆధిపత్యానికి నిదర్శనం.

కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి పంటల కొనుగోళ్ల బాధ్యత ఉంది. గిట్టుబాటు ధర పంటలకు లభించనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలి. అందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. దాని ద్వారా పంటలు కొనుగోళ్లు చేయాలి. నేడు పత్తి రైతులను ఆ విధంగా ఆదుకోవాలి. అలాంటి చర్యలు చంద్రబాబు ప్రభుత్వం చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి 3 వేల కోట్లు కేటాయిస్తే, కూటమి ప్రభుత్వం 300 ,కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ మొత్తంతో పంటల కొనుగోళ్లు ఎలా సాధ్యం. కూటమి ప్రభుత్వం మొక్కజొన్న రైతులనే కాదు, ఏ పంట రైతులను ఆదుకోవటం లేదు. ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదు. రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. మొక్కజొన్న కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిరసిస్తూ, మద్దతు ధర చెల్లించి ప్రభుత్వ సంస్థలే రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నను కొనుగోళ్లు చేయాలని, దళారుల, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీని అరికట్టాలని, మొక్కజొన్న దిగుమతులను ఆపాలని ఉద్యమించడమే రైతుల తక్షణ కర్తవ్యం.

బొల్లిముంత సాంబశివరావు

సెల్:9885983526

విత్తన ముసాయిదా బిల్లు కార్పొరేట్ల లాభాలకే



కేవీవీ ప్రసాద్

కేంద్ర ప్రభుత్వం 2025 నవంబరు 11 న "విత్తన చట్టం -2025" ముసాయిదా బిల్లు తెచ్చింది. దీనిపై డిసెంబరు 11 వరకు సూచనలు, సలహాలు, అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సిందిగా ప్రజల మధ్య ఉంచింది. 1966 విత్తనచట్టం, విత్తన కంట్రోలు చట్టం 1983 సవరణ చట్టం బదులుగా 2025 విత్తనాల ముసాయిదా బిల్లును రూపొందించి ప్రజా సమూహంలో చర్చకు పెట్టింది. బిల్లుపై రైతుసంఘాలు, శాస్త్రవేత్తల సూచనలు పంపిస్తున్నారు. అయితే కేంద్రం బిల్లు రూపొందించే ముందుగానే రైతు సంఘాలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగంలో అనుభవం గడించిన నిపుణులతో చర్చకు ఆహ్వానించి ఉండాల్సింది. డిసెంబరు 11 లోగా అంటే కేవలం నెలరోజులు గడువుపెట్టి బిల్లుపై సూచనలు తెలియచేయమనడం ఏమాత్రం సమర్థనీయం కాదు.

దేశ వ్యాపితంగా సుమారు 10 కోట్ల మంది రైతులు, కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వీరందరూ వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. కేంద్రంతో పాటు రాష్ట్రాలలో సైతం గతంలో రూపొందించిన విత్తన చట్టాలు ఉన్నాయి. అనేక భాషల్లో మాట్లాడే రైతులు ఉన్నారు. కేంద్ర చట్టం ఇంగ్లీషు లేదా హిందీ భాషల్లో మాత్రమే ఉంటుంది. మరో పక్క అనేకమంది రైతులు నిరక్షరాస్యులు ఉన్నారు. వీరందరూ బిల్లుపై చర్చించి తమ అభిప్రాయాలు వెల్లడించాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఉన్న రైతాంగం, ప్రజలు బిల్లుపై సంపూర్ణంగా చర్చించి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు వెల్లడించడానికి కనీసం ఆరు నెలల సమయం అవసరం. అదే విధంగా ముసాయిదా బిల్లు ప్రతులు అన్ని భాషల్లో తర్జుమా చేసి అందించాలి. బిల్లుపై విస్తృత చర్చ జరిగే వీలు కల్పించాలి. తద్వారా సమగ్ర విత్తన చట్టం రూపొందించాలి. అదేవిధంగా రాష్ట్రాల పరిధిలో ఉండాల్సిన వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ విత్తన కంపెనీల లాభాల కోసం కేంద్రం తమ చేతుల్లోకి తీసుకొని రాష్ట్రాల ప్రమేయం లేకుండా చట్టాలు రూపొందిస్తున్నది. చట్టం రూపకల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలపై కూడా చర్చ జరగాల్సి ఉంది.

భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాన్ని, చట్టానికి నిబంధనలు రూపొందించి అమలు చేయాలి. విత్తనాలపై ధరల నియంత్రణ కూడా రాష్ట్రాలదే. రాష్ట్రాల్లో యూనివర్సిటీలు, నూతన పరిశోధన కేంద్రాలు, కొత్త విత్తనాలు కనిపెట్టి పరిశీలించి ఫీల్డ్ ట్రయల్స్ జరిపి ఐసీఏఆర్ ఆమోదం పొందిన తర్వాత వాణిజ్యపరంగా రైతులకు అందించాల్సి ఉంది. కంపెనీలు తమ బ్రాండ్‌తో పాటు జర్మినేషన్ రేట్, ఎమ్మార్పీరేటు, ఎక్స్పైరీ డేట్ తదితర వివరాలు ప్రకటించాలి. వారిచ్చిన వివరాలకు భిన్నంగా పంట వేసిన రైతులకు నష్టం జరిగితే కంపెనీ భరించాల్సి ఉంటుంది. రాజ్యాంగం రీత్యాపై అంశాలను అమలు జరపాలి. రాష్ట్రాల పరిధిలో విత్తన కమిటీలు అవసరమైన రీతిలో సబ్ కమిటీలు, శాస్త్రవేత్తలు, నిపుణులు, అనుభవజ్ఞులైన రైతులతో ఏర్పాటు చేయాలి. సమగ్ర విత్తన చట్టం రూపొందించాలి. దేశంలో ఉత్పాదకతను, ఉత్పత్తిని పెంచడానికి వీలుగాను ఇతర దేశాల నుంచి అధికోత్పత్తి వంగడాలను, హైబ్రిడ్ వెరైటీలను దిగుమతి చేసుకోవడానికి వీలుగా విత్తన చట్టం - 1966 చేశారు. 1983లో విత్తన కంట్రోల్ చట్టానికి సవరణ చట్టం వచ్చింది. అనంతరం విత్తన ఉత్పత్తి చేసే రైతులకు కంపెనీల నుంచి రక్షణ కల్పించడానికి విత్తన ఉత్పత్తి చేసే రాష్ట్రాల పరిధిలో విత్తన చట్టాలు తేవాల్సిన అవశ్యకత ఏర్పడింది. విత్తన వ్యవస్థలోకి టాటా, బిర్లా, ఐటీసీ., రిలయన్స్ లాంటి ప్రముఖ కంపెనీలు వచ్చాయి. మరోపక్క మాన్సంటో, డు-ఫాండ్, కార్గిల్, సిన్‌జెంటలాంటి విదేశీ గుత్త కార్పొరేట్ కంపెనీలు అధిపత్యం సాధించాయి. ఈ స్థితిలో రైతుల ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం తెచ్చేందుకు ప్రయత్నించి, 2004లో పార్లమెంటులో ప్రవేశపెట్టినా ఆమోదం పొందలేదు. అదే చట్టానికి 2010లో కొన్ని సవరణలు ప్రతిపాదించినా కూడా పార్లమెంటు ఆమోదం లభించలేదు. 2019లో కేంద్రం మరో ముసాయిదా చట్టాన్ని తెచ్చే ప్రయత్నం చేసినా కార్పొరేట్ విత్తన కంపెనీల ఒత్తిడితో పెండింగ్‌లో పెట్టారు.

రాష్ట్రాల పరిధిలో విత్తన చట్టాలు తెచ్చే ప్రయత్నాలు జరిగినా కేంద్రం ఒత్తిడితో ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయి. కేంద్రం, రాష్ట్రాల వ్యవసాయ శాఖలు కార్పొరేట్ విత్తన సంస్థల కనుసన్నల్లో పనిచేస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. రైతుల ప్రయోజనాలు కాపాడే బలీయమైన విత్తన చట్టాలు లేనందున ప్రతి సంవత్సరం రైతాంగం ఉత్పత్తిని కోల్పోవడమేకాకుండా లక్షలాది కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. రైతాంగం అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరోపక్క స్వదేశీ, విదేశీ విత్తన సంస్థల లాభాలు మాత్రం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి.

2020 నవంబరు 26 నుంచి ఢిల్లీ సరిహద్దులతో పాటు దేశ వ్యాపితంగా మహోధృతంగా జరిగిన 13 మాసాల రైతాంగ ఉద్యమ విరమణ సందర్భంగా విత్తన చట్టం తెచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. అయితే ప్రస్తుతం ప్రతిపాదించిన 2025 విత్తన చట్ట ముసాయిదా రైతు సంఘాలతో, వ్యవసాయరంగ నిపుణులతో చర్చించకుండా ఏకపక్షంగా ప్రకటించింది. నెలరోజుల నామమాత్రపు గడువు పెట్టి సూచనలు, అభ్యంతరాలు కోరింది. విదేశీ విత్తన దిగుమతులపై ఆంక్షల తొలగింపు, నియంత్రణ రద్దు, జన్యు మార్పిడి పంటల ప్రోత్సాహనికి ముసాయిదా అధిక ప్రాధాన్యతనిచ్చింది. ముసాయిదాలోని అనేక అంశాలు రైతాంగ ప్రయోజనాలకు నష్టదాయకంగానూ, విత్తన కంపెనీలకు దోహదపడేలా ఉన్నాయి. ధనిక దేశాల నుంచి విత్తనాలు దిగుమతి చేసుకొని మన రైతాంగాన్ని మన దేశ విత్తన వ్యవస్థను దెబ్బతీసేలా ముసాయిదా రూపొందించారు.

గతంలో మాన్సెంటు లాంటి విదేశీ విత్తన సంస్థలు బీటీ విత్తనాలను రంగంలోకి తెచ్చాయి. 450 గ్రాముల విత్తనాలను రూ॥1,850కు అమ్మి పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించాయి. ఆ సమయంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులుగా ఉన్న కొల్లి నాగేశ్వరావు రైతుసంఘం ఆధ్వర్యాన రైతాంగ పక్షాన న్యాయపరంగానూ, ఐక్య ఆందోళన ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి బీటీ 1 రకం రూ॥ 650లకు, బీటీ వెరైటీ రూ॥ 750కు తగ్గించడంలో కృతకృత్యులయ్యారు.

ప్రస్తుతం కేంద్రం రూపొందించిన ముసాయిదాపై రాష్ట్ర వ్యవసాయ శాఖ అధ్యయనం చేసి రాష్ట్ర హక్కులను కాపాడే విధంగాను, రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించేలా అవసరమైన సవరణలు రూపొందించి కేంద్రానికి పంపాలి. విత్తన కంపెనీలు, డీలర్ల, మధ్యదళారులు, విత్తన ప్రమోటర్ల మోసాలకు రైతులు నష్టపోకుండా వ్యవసాయాభివృద్ధికి దోహదపడేలా సమగ్ర చట్టం తెచ్చేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాల్సి వుంది.

ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం

భారీగా పెరిగిన ఆర్థిక బాధ్యతలు, అప్పులు

ఆర్. సూర్యమూర్తి

భారతదేశ ఆర్థిక పథంపై శ్రద్ధ చూపే ఎవరినైనా కలవరపెట్టే అనేక విషయాలు ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడయ్యాయి. గృహ ఆర్థిక బాధ్యతలు - భారతీయ కుటుంబాలు బ్యాంకులు, ఎన్‌ఎఫ్‌బీసీలు ఇతర రుణదాతలకు చెల్లించాల్సిన అప్పులు - కేవలం నాలుగు సంవత్సరాలలో 76% పెరిగాయి, మార్చి 2021 లో ఉన్న రు.77.7 లక్షల కోట్ల నుంచి మార్చి 2025 నాటికి రు.136.6 లక్షల కోట్లకు ఈ రుణాలు పెరిగాయి. దేశం పొదుపు కాదు, రుణాలు తీసుకోవడం, భారత వృద్ధి కథను మరింతగా ప్రభావితం చేసే దశలోకి ప్రవేశించిందని దిగ్భ్రాంతికర వాస్తవాన్ని ఇక్కడ మరవకూడదు. రాజకీయంగా విస్మరించడానికి అనుకూలమైనప్పటికీ, ఆ ప్రాథమిక అసమతుల్యత ఒక తీవ్రమైన స్థూల ఆర్థిక ప్రమాదం. డిసెంబర్ 1 న లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో భారతదేశ గృహ బ్యాలెన్స్ షీట్ అరుదైన, భయంకరమైన వాస్తవాలను అందిస్తోంది. ఈ చిత్రం నిరపాయకరమైనది లేదా తాత్కాలికమైనది కాదు. అప్పుల పెరుగుదల విడిగా జరగడం లేదు. ఆర్థిక వ్యవస్థ సంప్రదాయ దిగ్భ్రాంతి కలిగించే పరిశీలన నికర గృహ ఆర్థిక పొదుపులు, కరోనా మహమ్మారి సమయంలో బలవంతపు పొదుపు సంవత్సరం (2020-21) జీడీపీలో 11.7% నుంచి 2022-23 లో కేవలం 5.0% కి పడిపోయి, 2023-24 లో 5.2% కి, 2024-25 లో 6.0% కి తిరిగి చేరుకున్న సందర్భంలో ఇది జరుగుతోంది. స్వల్పంగా కోలుకున్న తర్వాత కూడా, భారతదేశ గృహ పొదుపు రేటు కరోనా మహమ్మారికి ముందు సగటు అయిన 7%- 8% కంటే నాటకీయంగా తక్కువగా ఉంది. ఇందుకు విధాన రూపకర్తలు వారు అంగీకరించిన దానికంటే ఎక్కువగా ఆందోళన చెందాలి.

ఇదిలావుండగా, బాధ్యతలు మాత్రం చాలా వేగంగా పెరిగాయి. ఆర్బీఐ డేటా ప్రకారం ఆర్థిక బాధ్యతలు 2023 ఆర్థిక సంవత్సరంలో 18.5%, 2024 ఆర్థిక సంవత్సరంలో 18.4% పెరిగాయి. కొన్ని సంవత్సరాలలో ఆర్థిక ఆస్తుల వృద్ధి రేటు కంటే ఇది దాదాపు రెట్టింపుగా ఉన్నది. 2021-2025 మధ్య ఆస్తుల నిల్వ 228.7 లక్షల కోట్ల రూపాయల నుంచి 352.6 లక్షల కోట్ల రూపాయలకు పెరిగాయి. కానీ బాధ్యతలు అత్యంత వేగంగా ముందుకు సాగాయి, ఆర్థిక మాంద్యం సమయంలో కుటుంబాలు ఆధారపడే భద్రతా మార్జిన్‌ను తగ్గించాయి. ఇది ఒక నాటకీయ క్షణంలో ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయని ఒక రకమైన అసమతుల్యత; ఇది నిశ్శబ్దంగా స్థితిస్థాపకతను క్షీణింపజేస్తుంది. ఇక్కడ అత్యంత ఆశ్చర్యకర విషయమేమంటే... భారతదేశం అప్పులు చేయడమేకాదు, భారతీయులలో అత్యధికులు అప్పుల కోసం ఎగబడుతున్నారు. మార్చి 2018 లో, అధికారిక ఆర్థిక వ్యవస్థలో "ప్రత్యక్ష ప్రత్యేక రుణగ్రహీతల" సంఖ్య 12.8 కోట్లుగా ఉంది. మార్చి 2025 నాటికి, ఆ సంఖ్య 28.3 కోట్లకు పెరిగింది. ఏడు సంవత్సరాలలో ప్రతి రుణగ్రహీత సగటు రుణం రు.3.41 లక్షల నుంచి దాదాపు రు.4.78 లక్షలకు పెరిగింది. ఇది 40% కంటే ఎక్కువ. ఇవి చిన్నవి కావు, చక్రీయ హెచ్చుతగ్గులు. వినియోగం, ఆస్తి నిర్మాణం, సాధారణ ఖర్చులకు కూడా క్రెడిట్ మద్దతు ఎక్కువగా అవసరమయ్యే సమాజానికి ఇవి నిర్మాణాత్మక సూచికలు.

కానీ ఆస్తి ఆధారిత రుణాలు కూడా పెరుగుతున్న ఈఎంఐలు, అదుపులోనికి రాని ద్రవ్యోల్బణం, అసమాన ఆదాయ వృద్ధి, మధ్యతరగతికి స్థిరమైన వేతన పెంపుదల కోసం ఇప్పటికీ కష్టపడుతున్న కార్మిక మార్కెట్ కొనసాగుతున్నప్పుడు నష్టాలు తప్పనిసరి. ఆదాయాలు వేగంతో కొనసాగకపోతే, "ఆస్తి ఆధారిత" త్వరగా "ఒత్తిడి ఆధారిత"గా మారవచ్చు. మరింత ఇబ్బంది కలిగించే విషయం ఏమిటంటే డేటా దీర్ఘ చాపం. 2014-15, 2019-20 మధ్య గృహ బాధ్యతలు జీడీపీలో 4% కంటే తక్కువగా స్థిరంగా ఉన్నాయి. అప్పుడు కరోనా మహమ్మారి దెబ్బ, పొదుపులు తాత్కాలికంగా పెరిగాయి. ఆ తరువాత - అప్పులు మాత్రమే పెరిగాయి.

2022-23 నాటికి గృహ బాధ్యతలు జీడీపీలో 5.9 శాతానికి చేరుకున్నాయి. కరోనా అనంతర కాలం అంటే 2023-24 నాటికి అవి మరింత పెరిగి 6.2 శాతానికి చేరుకున్నాయి. ఒక దశాబ్ది కాలంలోనే ఇది అత్యధికం. 2025 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే మనం జీడీపీలో 4.7% కి తగ్గుదల చూస్తాం. ప్రభుత్వం దీనిని "ముందస్తు డెలివరేజింగ్" కి సంకేతంగా ప్రదర్శిస్తోంది. అది నిజమే కావచ్చు. లేదా అధిక వడ్డీ రేట్ల కారణంగా రుణాలు తీసుకోవడంలో కుటుంబాలు ఆలస్యం చేయటాన్ని ప్రతిబింబిస్తుంది, వారి ఆర్థిక పరిస్థితి అర్థవంతంగా మెరుగుపడినందున ఏమాత్రం కాదు. ప్రాథమికంగా మరో మార్పు జరుగుతోంది: కుటుంబాలు సంప్రదాయ బ్యాంకు డిపాజిట్లను వదిలివేసి మ్యూచువల్ ఫండ్ల వైపు మొగ్గ చూపుతున్నాయి. 2020-21 లో రు.0.6 లక్షల కోట్ల నుంచి 2024-25 లో రు, 4.7 లక్షల కోట్లకు మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు పెరిగాయి - ఇది సంపూర్ణ ప్రవాహాలలో దాదాపు ఎనిమిది రెట్లు పెరుగుదల. స్థూల ఆర్థిక పొదుపులో వాటాగా, మ్యూచువల్ ఫండ్లు కేవలం నాలుగు సంవత్సరాలలో 2.1% నుంచి 13.1% కి పెరిగాయి. దీనికి విరుద్ధంగా, స్థూల ఆర్థిక పొదుపులు అదే కాలంలో రు.30.7 లక్షల కోట్ల నుంచి కేవలం రు.35.6 లక్షల కోట్లకు పెరిగాయి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ కాగితంపై విస్తరిస్తున్నప్పటికీ, వినియోగం, పొదుపు, దీర్ఘకాలిక స్థిరత్వానికి మూలమైన దాని కుటుంబాల ఆర్థిక పునాది బలహీనపడుతోంది. ఏ దేశమూ అప్పుగా తీసుకున్న ఆశావాదంపై స్థిరంగా వృద్ధి చెందలేదు. భారతదేశం ఇప్పుడు తన గృహ రుణ సమస్యను ఎదుర్కోకపోతే, రేపు అది అద్భుతంగా కూలి పోదు. కానీ అది భారతదేశ చరిత్రను నిర్వచించాల్సిన ఆకాంక్షలు కలిగిన ప్రజల ఆర్థిక భద్రతను ఏడాదికి ఏడాది దెబ్బతీస్తుంది. హెచ్చరిక సంకేతాలు ఇప్పటికే డేటాలో ఉన్నాయి. ప్రశ్న ఏమిటంటే విధాన నిర్ణేతలు వాటిని చదవాలనుకుంటున్నారా - లేదా రుణ చక్రం పరిణామాలను విస్మరించడం అసాధ్యం చేసే వరకు వేచి ఉండాలనుకుంటున్నారా అనేదే.

మోదీపై కాంగ్రెస్ ఏఐ వీడియో

బీజేపీ మండిపాటు

న్యూదిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ కాంగ్రెస్ నాయకురాలు పోస్ట్ చేసిన ఓ వీడియో తీవ్ర దుమారం రేపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కించపరిచేలా ఆ వీడియో ఉండటంపై బీజేపీ నేతలు భగ్గుమన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రాగిణి నాయక్ తన సోషల్‌మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. ప్రధాని చాయ్ అమ్ముతున్నట్లుగా ఉన్న ఏఐ జనరేటెడ్ వీడియో అది. ఇది వివాదాస్పదమైంది. ఈ వీడియోపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రధాని మూలాలను వారు అవమానిస్తున్నారంటూ బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. 'ఓ కాంగ్రెస్ ఎంపీ పార్లమెంట్‌కు శునకాన్ని తీసుకొచ్చి అవమానించారు. ఇప్పుడు రాగిణి నాయక్ ప్రధాని చాయ్‌వాలా బ్యాక్‌గ్రౌండ్‌ను హేళన చేస్తున్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన మోదీ ఎదుగుదలను వారు జీర్ణించుకోలేకపోతున్నారు. కుటుంబం పేరు చెప్పి బతికే కాంగ్రెస్... పనిచేసే ప్రధానికి మద్దతుగా నిలబడలేకపోతోంది' అని షెహజాద్ ఎద్దేవా చేశారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రధానిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిందని ఆయన గుర్తుచేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని తల్లిని అవమానించారని, అలాంటి పార్టీని ప్రజలు ఎప్పటికీ క్షమించబోరని విమర్శించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేకు బిగుస్తోన్న ఉచ్చు

తిరువనంతపురం: కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కుటత్తిల్‌కు ఉచ్చుబిగుస్తోంది. ఆయనపై అత్యాచారం ఫిర్యాదులు పెరుగుతున్నాయి. రాహుల్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, అనంతరం గర్భాన్ని తొలగించుకోవాలని బెదిరించాడని కేరళకు చెందిన ఓ యువతి ఫిర్యాదు చేయడంతో ఇటీవల అతడిపై రేప్ కేసు నమోదైంది. పరారీలో ఉన్న అతడిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు. తాజాగా మరో యువతి కూడా రాహుల్ తనను లైంగికంగా వేధించినట్లు ఫిర్యాదు చేసింది. రాహుల్ తనను లైంగికంగా వేధించినట్లు కేరళకు చెందిన 23 ఏళ్ల యువతి కేరళ కాంగ్రెస్ కమిటీకి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేసింది. యువతి తన ఫిర్యాదులో రాహుల్ మామ్‌కుటత్తిల్ తనను వివాహం చేసుకుంటానని నమ్మించి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసినట్లు ఆరోపించింది. రాజకీయంగా అతడికి పలుకుబడి ఉండడంతో ఇన్ని రోజులు పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోయానని, అతడిపై తేత్యాచారం కేసు నమోదవడంతో తాను కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. యువతి కాంగ్రెస్ పార్టీకి చేసిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేయాలని పోలీసులకు సూచించామని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ తెలిపారు. ఆమె పంపిన మెయిల్‌ను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అతడి ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసింది. ఆయన పాలక్కాడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

సంచార్ సాథీతో స్నూపింగ్ సాధ్యం కాదు: సింధియా

న్యూదిల్లీ: సంచార్ సాథీ యాప్‌పై కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మరోసారి స్పందించారు. ఈ యాప్ ద్వారా స్నూపింగ్‌కు తావే లేదని, అది సాధ్యం కాదని బుధవారం లోక్‌సభలో వెల్లడించారు. ఇది ప్రజల రక్షణ కోసమేనన్నారు. యాప్‌లో రిజిస్టర్ కాకుండా అది పనిచేయదని వివరించారు. ఫోన్‌లో సంచార్‌సాథీ యాప్ ప్రీ ఇన్‌స్టాల్ అయి ఉండాలి. ఫోన్ వాడకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఈ యాప్ పని చేయాలి. ఫోన్ నుంచి ఈ యాప్‌ను తొలగించే వీలుండకూడదని కేంద్రం చెబుతోంది. దానిపై తీవ్ర విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో కేంద్రం వెనక్కి తగ్గింది. 'మీరు ఆ యాప్‌ను కొనసాగించాలని అనుకుంటే... మీ ఫోన్‌లో ఉంచుకోవచ్చు. డిలీట్ చేయాలనుకుంటే చేసేయొచ్చు. మీరు ఫోన్ కొనుగోలు చేసినప్పుడు ఎన్నో యాప్‌లు ముందుగానే ఇన్‌స్టాల్ అయి ఉంటాయి. అవి వద్దనుకుంటే తొలగించుకుంటాం కదా. ఇది యూజర్ల రక్షణకు సంబంధించిన అంశం. ఇందులో తప్పనిసరి ఏమీ లేదు. మీరు రిజిస్టర్ కాకపోతే... అది అచేతనంగా ఉండిపోతుంది' అని సింధియా వివరణ ఇచ్చారు.

ఐఐటీ కాన్పూర్ సరికొత్త రికార్డు

కాన్పూర్: ఐఐటీ కాన్పూర్‌లో ప్లేస్‌మెంట్ల సందడి మొదలైంది. ప్లేస్‌మెంట్‌ల సీజన్ ప్రారంభమైన తొలిరోజే ఈ క్యాంపస్ సరికొత్త రికార్డు నమోదు చేసింది. 2025-26 సంవత్సరానికిగాను మొదటిరోజే ఈ క్యాంపస్ నుంచి ఏకంగా 672 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగ ఆఫర్లు సాధించారు. గతేడాది తొలి రోజుతో పోలిస్తే ఇది 16 శాతం అధికమని, తమ విద్యార్థుల ప్రతిభకు పెరుగుతున్న డిమాండ్‌కు ఇదే నిదర్శనమని ఐఐటీ కాన్పూర్ 'ఎక్స్' పేర్కొంది. తొలి రోజే 627మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కాగా... వీటిలో 253 ప్రీ-ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ఉన్నాయి. తొమ్మిది అంతర్జాతీయ కంపెనీలతో పాటు మరో 250కి పైగా కంపెనీలు ఈ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో యాక్సెంచర్, బ్లాక్ రాక్, హెచ్‌ఎస్‌బీసీ, శాప్, ఎయిర్‌బస్, పీడబ్ల్యూసీ, నవీ, క్వాల్కమ్, డ్యూయిష్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ కంపెనీలూ ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ అద్భుతమైన ఆరంభంతో అంకిత భావం కలిగిన తమ విద్యార్థులు, అత్యుత్తమ అధ్యాపక సిబ్బంది, క్రియాశీలంగా పనిచేసే స్టూడెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీస్‌కు ఐఐటీ కాన్పూర్ శుభాకాంక్షలు చెప్పింది. ఈ ప్రయాణం కేవలం ఆరంభమేనని, త్వరలో అనేక కంపెనీలు రిక్రూట్‌మెంట్‌కు రాబోతున్నాయని, మరిన్ని గొప్ప అవకాశాలు ఉంటాయని తెలిపింది.

భావ్‌నగర్‌లో భారీ అగ్నిప్రమాదం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో ఒక కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ల్యాబ్ నుంచి వెలువడిన మంటలు, పొగలు సమీపంలోని ఆస్పత్రులకు వ్యాపించాయి. స్థానికులు వెంటనే హాస్పిటల్స్‌లోని చిన్నారులను బయటకు తెచ్చి రక్షించడంతో పెద్ద గండం తప్పింది. బుధవారం ఉదయం కాలా నాలా ప్రాంతంలోని వివిధ ఆసుపత్రులు, షాపులున్న కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం జరిగింది. దేవ్ పాథాలజీ ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి. ఆ కాంప్లెక్స్‌లో ఉన్న ఆసుపత్రులు, ఇతర కార్యాలయాలకు మంటలు, పొగలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు నిచ్చెనల ద్వారా పైకి ఎక్కి ఒక ఆసుపత్రి నుంచి సుమారు 15 మందికి పైగా శిశువులు, చిన్నారులను చేతుల మీదుగా బయటకు తీసుకువచ్చారు. ఇతర హాస్పిటల్స్‌లోని రోగులు, వృద్ధులను కూడా క్షేమంగా తరలించారు. ఆరు అగ్నిమాపక వాహనాల్లో చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు.మరోవైపు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అగ్నిమాపక అధికారి తెలిపారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అది ముమ్మాటికీ మరణమే!

ఆరావళి పర్వతాల్లో మైనింగ్‌పై సోనియాగాంధీ

న్యూదిల్లీ: కేంద్ర ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంటేనని సోనియా ఆగ్రహం వ్యక్తంచేశారు. వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చంటూ ఆరావళి పర్వతాల విషయంలో కేంద్ర పర్యాటక శాఖ కొత్త మార్పులు తీసుకువచ్చింది. దీనిపై సోనియాగాంధీ ఓ జాతీయమీడియా సంస్థకు రాసిన కథనంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కథనంలోని కొన్ని వాక్యాలను కాంగ్రెస్ షేర్ చేసింది. 'గుజరాత్, రాజస్థాన్, హర్యానాల్లో విస్తరించి ఉన్న ఈ పర్వతాలది దేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంలో కీలక పాత్ర. అక్రమ మైనింగ్ వల్ల ఇప్పటికే వాటి సహజ సంపద తరిగిపోతుండగా... మోదీ ప్రభుత్వం వాటికి డెత్ వారెంట్ ఇచ్చింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. ఇది మైనర్లు, మాఫియాకు బహిరంగ ఆహ్వానం. ప్రభుత్వ విధానాల్లో పర్యావరణంపై నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. ఇది వన్యప్రాణుల రక్షణ చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. వెంటనే ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి' అని సోనియా డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకువచ్చిన మార్పులను అంగీకరించిన సుప్రీంకోర్టు... అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు తీసుకోవలసిన చర్యలపై చేసిన సిఫారసులు పరిశీలించేందుకు అంగీకరించింది. సుస్థిర మైనింగ్ కోసం నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేయాలని పర్యావరణ మంత్రిత్వశాఖను సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ ప్రణాళిక ఖరారయ్యే వరకు మైనింగ్ కోసం కొత్తగా లీజులు ఇవ్వకూడదని ఆదేశాల్లో పేర్కొంది. కాగా... ప్రపంచంలోనే పురాతనమైన పర్వతశ్రేణుల్లో ఆరావళి ఒకటి. వాటిలో మితిమీరిన మానవ కార్యకలాపాలు, వనరుల దోపిడీ కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దానివల్ల కొన్ని రాష్ట్రాలతో పాటు రాజధాని దిల్లీ ప్రాంతం సైతం భవిష్యత్తులో తీవ్ర వాతావరణ దుష్పరిణామాలతో తల్లడిల్లే ప్రమాదం పొంచి ఉందన్న ఆందోళనలు వినిపిస్తున్నాయి.

చరిత్ర వక్రీకరించొద్దు

వ్యూహాత్మక సవాళ్లపై దృష్టి పెట్టండి

రాజ్‌నాథ్‌కు కాంగ్రెస్ సలహా

న్యూదిల్లీ: దేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రజాధనంతో బాబ్రీ మసీదును నిర్మించాలని కోరుకున్నారని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా స్పందిస్తూ...చర్చించాల్సిన నిజమైన సమస్యల నుండి దృష్టిని మరల్చడమే లక్ష్యంగా రాజ్‌నాథ్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. "ఇవన్నీ అంతరాయాలు. చర్చించాల్సిన అనేక ఇతర నిజమైన సమస్యలు ఉన్నాయి. అవి ప్రతిరోజూ కొత్త అంతరాయాన్ని సృష్టిస్తాయి. తద్వారా మనం నిజమైన ప్రజా సమస్యలను చట్టసభలో చర్చించలేకపోతున్నాము" అని ప్రియాంక అన్నారు. చండీగఢ్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ రక్షణ మంత్రి చరిత్రను వక్రీకరించడం మాని వ్యూహాత్మక సవాళ్లపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సహారన్‌పూర్ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ... "ఆయన ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారో నాకు తెలియదు. మనకు ఒకే ఒక చారిత్రక పత్రం గురించి తెలుసు. అది పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు సంబంధించినది అయితే, వారి వద్ద ఆ పత్రం ఉండాలి" అని స్పష్టం చేశారు. రాజ్‌నాథ్ అలా చెప్పినంత మాత్రాన ఎవరూ దానిని అంగీకరించరు. సర్దార్ పటేల్ ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించడానికి చర్య తీసుకున్న ఒక పత్రం ఉంది... ఇదంతా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేశారు. ఆయన రోడ్‌మ్యాప్ నేడు దేశం అభివృద్ధి చెందుతున్న మార్గం. ఆయన శాస్త్రీయ ఆలోచనను కూడా పెంపొందించారని తెలిపారు. కాంగ్రెస్ తో పాటు, ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా రక్షణ మంత్రి వ్యాఖ్యలను విమర్శించాయి. బదౌన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) ఎంపీ ధర్మేంద్ర యాదవ్, రాజ్ నాథ్ సింగ్ రక్షణ అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. "రాజ్ నాథ్ సింగ్ చాలా అనుభవజ్ఞుడైన నాయకుడు. భారతదేశ రక్షణ మంత్రి, అతను మన సాయుధ దళాలు, యోధులకు సౌకర్యాలు సహా ఇతరత్రా అవసరమైనవి అందించడంపై దృష్టి పెట్టాలి... రక్షణ మంత్రికి అలాంటి విషయాల గురించి పూర్తిగా తెలియకపోవచ్చునని నేను నమ్ముతున్నాను. భారతీయ జనతా పార్టీ చారిత్రక వాస్తవాలను వక్రీకరించడానికి ఎలా ప్రయత్నం చేస్తుందో మీకు తెలుసు. దేశం మొత్తం దీనిని అర్థం చేసుకుంటుందని నేను భావిస్తున్నాను" అని యాదవ్ అన్నారు.

ఆహ్వానిస్తేనే దిల్లీకి

సీఎం సిద్ధరామయ్య

మంగుళూరు : అధికారికంగా ఆహ్వానించబడకపోతే తాను న్యూదిల్లీకి వెళ్లనని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం అన్నారు. ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ బుధవారం న్యూదిల్లీలోని ఒక వివాహానికి హాజరు కావడానికి, పార్టీ పార్టీ కార్యక్రమానికి ప్రణాళికలు వేసుకోవడానికి వచ్చిన తర్వాత సీఎం వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై ఊహాగానాలను అరికట్టడానికి ఇద్దరు నాయకులు ఇటీవల బెంగళూరులోని తమ నివాసాలలో ఒకరికొకరు అల్పాహారం ఆతిథ్యం ఇవ్వడం ద్వారా స్నేహాన్ని ప్రదర్శించారు. ఉప ముఖ్యమంత్రి దిల్లీకి వెళ్లగా, మహాత్మా గాంధీతో సంఘ సంస్కర్త శ్రీ నారాయణ గురు సమావేశమైన శతాబ్ది జ్ఞాపకార్థం జరిగే కార్యక్రమంలో పాల్గొనడానికి సిద్ధరామయ్య మంగళూరు చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ కూడా మంగళూరు కార్యక్రమానికి హాజరయ్యారు. తరువాత, సిద్ధరామయ్య వేణుగోపాల్‌తో సమావేశం, భోజనం చేశారు. ఇక్కడ కావేరి అతిథి గృహానికి వెళ్లే ముందు, ఆహ్వానం లేకుండా తాను దిల్లీకి వెళ్లనని సిద్ధరామయ్య మీడియాతో అన్నారు. శివకుమార్ దిల్లీ వెళుతున్నారని విలేకరులు అడుగగా, 'అతన్ని వెళ్లనివ్వండి. ఎవరైనా అతనికి నో చెప్పారా?' అని బదులిచ్చారు. మీరు వెళతారా అని అడిగినప్పుడు, నేను ఆహ్వానించినప్పుడే వెళతాను. నన్ను ఆహ్వానించలేదు. అందువల్ల నేను వెళ్లడం లేదు. దిల్లీలో జరిగే సమావేశానికి పార్టీ అధిష్ఠానం నుంచి ఏదైనా దిశానిర్దేశం ఉంటే, దానిని వేణుగోపాల్ ద్వారా తెలియజేస్తామని ఆయన అన్నారు. శివకుమార్ మాట్లాడుతూ తాను ఒక వివాహానికి హాజరు కావడానికి దిల్లీ వెళుతున్నానని చెప్పారు. డిసెంబరు 14న దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఓటు చోరీ' ప్రచారంపై జరిగే గొప్ప కార్యక్రమానికి సంబంధించి కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో చర్చకు ప్రణాళికలు కూడా ఆయన ప్రస్తావించారు. 'డిసెంబరు 14న దిల్లీలో 'ఓటు చోరీ' కార్యక్రమం జరుగుతోంది. అందువల్ల మేము ప్రతి జిల్లా నుంచి కనీసం 300 మంది కార్యకర్తలను దిల్లీకి తీసుకువెళుతున్నాము. మేము పెద్ద సంఖ్యలో పాల్గొనాలి. వారిని దిల్లీకి తీసుకువెళ్లడానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా యూనిట్లకు చెప్పాను' అని దిల్లీ వెళ్లే ముందు శివకుమార్ మీడియాతో అన్నారు. వేణుగోపాల్‌తో సిద్ధరామయ్య సమావేశం గురించి శివకుమార్ ప్రశ్నించగా, వేణుగోపాల్, రాహుల్ గాంధీ లేదా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సీఎం కలవడంలో తప్పేంటి?' అని ప్రశ్నించారు. ఆయన మద్దతుదారులపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, వేణుగోపాల్ వచ్చిన తర్వాత మంగళూరు విమానాశ్రయంలో నినాదాలు చేస్తూ, 'ఇందులో తప్పేముంది?' అని ప్రశ్నించారు

పాక్ ఐఎస్ఐ కోసం లాయర్ గూఢచర్యం

న్యూదిల్లీ: పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తున్నాడన్న ఆరోపణలపై హర్యానాలోని గురుగ్రామ్‌కు చెందిన న్యాయవాది రిజ్వాన్ అరెస్టయ్యాడు. అతడు డబ్బులు తీసుకోవడానికి ఏడుసార్లు అమృత్‌సర్ వెళ్లాడని పోలీసుల అదుపులో ఉన్న అతడి స్నేహితుడు ముషారఫ్ అలియాస్ పర్వేజ్ వెల్లడించాడు. ఈ మేరకు దర్యాప్తు అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2022లో సోహ్నా కోర్టులో ఇంటర్న్‌షిప్ చేస్తోన్న సమయంలో రిజ్వాన్, ముషారఫ్ స్నేహితులయ్యారు. తర్వాత వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయినా... వృత్తిపరంగా తరచూ కలిసేవాళ్లమని ముషారఫ్ వెల్లడించాడు. అతడు తరచూ అమృత్‌సర్ వెళ్లేవాడని, ఈ జులైలో అతడితో కలిసి తాను కూడా వెళ్లానని చెప్పాడు. అప్పుడు వాఘా సరిహద్దు వద్ద బైక్ మీద వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒక బ్యాగ్‌లో రిజ్వాన్‌కు డబ్బు ఇచ్చారని తెలిపాడు. ఆ ఇద్దరు వ్యక్తులు ఎవరో తనకు తెలియదన్నాడు. రిజ్వాన్ ఏడుసార్లు అమృత్‌సర్ వెళ్లాడని, అతడు తీసుకున్న నగదులో రూ.41 లక్షలు అజయ్ అరోరా అనే వ్యక్తికి ఇచ్చినట్లు ముషారఫ్ వెల్లడించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌ల్లో రిజ్వాన్‌కు ఖాతాలు ఉన్నాయని, లావాదేవీల పరిమితి దాటడంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఖాతా మూత పడిందని అధికారులు వెల్లడించారు. పాకిస్థానీ హ్యాండ్లర్ల నుంచి కోట్లాది రూపాయలు అతడి ఖాతాలో జమ అయ్యాయని, పంజాబ్‌లోని ఉగ్రవాద నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి చాలా మొత్తాన్ని ఉపయోగించాడని తెలిపారు. రిజ్వాన్ ఫోన్, ల్యాప్‌టాప్‌లో అనుమానాస్పద లావాదేవీలు వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. పాకిస్థాన్‌కు గూఢచర్యం కేసును విచారిస్తోన్న నుహ్ ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ ఇద్దరితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. ఈ హవాలా డబ్బు చేతులు మారిన వ్యవహారంలో వారిని నిందితులుగా పేర్కొంది.

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలి

బెంగాల్ ఎంపీలకు మోదీ ఆదేశం



న్యూదిల్లీ: పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతోంది.

దాని నిర్వహణపై బెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని మోదీ ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుండా... విపక్షాల ట్రాప్‌లో చిక్కవద్దని బెంగాల్ బీజేపీ ఎంపీలకు చెప్పారు. బెంగాల్‌లో బీజేపీ ఎదిగిన తీరును ప్రస్తావిస్తూ 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. 2021లో ఆ సంఖ్య 65కు చేరిందన్నారు. కాగా... కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్‌ను విపక్షాలు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయి.

జుబీన్ గర్గ్‌కు న్యాయం జరగాలి

లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు గొగోయ్

న్యూదిల్లీ : సెప్టెంబరులో సింగపూర్‌లో మరణించిన అసోంకు చెందిన ప్రముఖ గాయకుడు-స్వరకర్త జుబీన్ గర్గ్‌కు న్యాయం జరగాలని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ బుధవారం కోరారు. లోక్ సభలో జీరో అవర్ సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తిన గొగోయ్... ఈశాన్య రాష్ట్రం తిరుగుబాటు గుప్పిట్లో ఉన్నప్పుడు 1980లు, 1990 లలో అసోం ప్రజలకు ఆశ కలిగించిన మానవతావాదిగా గర్గ్‌ను ప్రశంసిస్తూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ అసోం రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన గొగో య్... ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను గార్గ్‌కు ప్రదానం చేయాలని డిమాండ్ చేశారు. 'జుబీన్ గర్గ్ ఒక దిగ్గజ సంగీత విద్వాంసుడు. విదేశాంగ మంత్రిత్వ శాఖ, ప్రభుత్వం, సింగపూర్‌కు హైకమిషన్ నిర్వహించిన కార్యక్రమంలో ప్రదర్శన ఇవ్వాల్సి ఉండగా ఆయ న సింగపూర్‌లో మరణించారు' అని ఆయన అన్నారు. గర్గ్ ఒక కళాకారుడు, మానవతావాది, పర్యావరణవేత్త, వన్యప్రాణుల ఔత్సాహికుడు, ఆసక్తిగల పాఠకుడని గొగోయ్ అన్నారు. '80లు, 90లలో ఆయన అసోం ప్రజలకు ఆశను కలిగించారు. ఇటీవలి సంవత్సరాలలో ఆయన మాకు నైతిక ధైర్యాన్ని ఇచ్చారు. వ్యక్తిగత గాయాన్ని ఎలా అధిగమిం చాలో, మతం, కులం ద్వారా విభజించబడకూడదని ఆయన మాకు నేర్పిం చారు' అని గొగోయ్ తెలిపారు. గర్గ్ హత్యకు గురయ్యారని అసోం ప్రభుత్వం చెప్పిందని ఆయన అన్నారు. 'భారత ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో, విదేశీ గడ్డపై హత్య ఎలా జరిగిందో మేము తెలుసుకోవాలనుకుంటున్నాము' అని అన్నారు. 'ఈరోజు అసోం ప్రజలు ఆయనను కోల్పోయారు. మేము ఆయనకు న్యాయం జరగా లని కోరుకుంటున్నాము' అని జోర్హాట్ నియోజకవర్గ లోక్‌సభ సభ్యుడు గొగోయ్ అన్నారు.

బహుజనులకు మోదీ సర్కార్ మోసం

రాహుల్ గాంధీ

న్యూదిల్లీ : నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని బహుజనులకు బహిరంగంగా మోసం చేస్తోందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం విమర్శించారు. కుల గణన కసరత్తు 'ఒక నిర్దిష్ట చట్రం, ఒక నిర్దిష్ట కాలపరిమితి ప్రణాళిక లేదు. పార్లమెంటులో చర్చ లేదు, ప్రజలతోనూ చర్చించలేదు' అని తెలిపారు. తదుపరి జన గణన, కుల గణనపై తన ప్రశ్నకు లోక్‌సభలో ప్రభుత్వం స్పందించిన తర్వాత రాహుల్ ఈ విమర్శల దాడి చేశారు. 'పార్లమెంటులో నేను ప్రభుత్వాన్ని కుల గణన గురించి ఒక ప్రశ్న అడిగాను. దానికి ప్రతిస్పందన దిగ్భ్రాంతికరంగా ఉంది. నిర్దిష్ట చట్రం లేదు. ఒక నిర్దిష్ట కాలపరిమితి ప్రణాళిక లేదు. పార్లమెంటులో చర్చ లేదు. ప్రజలతోనూ చర్చించలేదు. ఇతర రాష్ట్రాల్లో విజయవంతమైన కుల సర్వేల వ్యూహాల నుంచి నేర్చుకోవాలనే కోరిక కూడా లేదు' అని 'ఎక్స్' లో హిందీలో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'కుల గణనపై మోదీ ప్రభుత్వ వైఖరి దేశ బహుజనులను బహిరంగంగా మోసం చేసింది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు తెలిపారు. మంగళవారం లోక్‌సభలో గాంధీ మూడు ప్రశ్నలు సంధించారు. దశాబ్ద జనాభా గణనకు సిద్ధం కావడానికి కీలకమైన విధానపరమైన దశల వివరాలు, తాత్కాలిక కాలక్రమాలను, షెడ్యూళ్లను నిర్ణయించడం వంటి వాటి గురించి అడిగారు. ముసాయిదా జనాభా గణన ప్రశ్నలను ప్రచురించి, ఈ ప్రశ్నలపై సాధారణ ప్రజల నుంచి లేదా ప్రజాప్రతినిధుల నుంచి వివరాలు కోరే ప్రతిపాదన ప్రభుత్వానికి ఉందా అని కూడా ఆయన ప్రశ్నించారు. వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన కుల సర్వేలతో సహా మునుపటి కసరత్తుల నుంచి ఉత్తమ పద్ధతులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందా? మరి అలా అయితే వాటి వివరాలను కూడా కాంగ్రెస్ అగ్ర నేత అడిగారు.

చిన్నారిని కాపాడిన వీధి కుక్కలు

కోల్‌కతా: చిన్నారులపై కుక్కలు విచక్షణారహితంగా దాడులు చేస్తున్న వార్తలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న వేళ... అప్పుడే పుట్టిన చిన్నారికి వీధి కుక్కలే రక్షణగా మారిన ఘటన వైరల్‌గా మారింది. ఓ నవజాత శిశువును కన్నవారు రోడ్డుపై వదిలేస్తే... చిన్నారికి వీధి కుక్కలు రక్షణగా నిలిచిన ఘటన పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లాలో వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నదియా జిల్లాలోని రైల్వేవర్కర్స్ కాలనీలో ఓ బాత్‌రూమ్ ఎదుట అప్పుడే పుట్టిన పసికందును తల్లిదండ్రులు బుధవారం తెల్లవారుజామున వదిలేసి వెళ్లారు. దుప్పటిలో చుట్టి ఉన్న ఆ పసికందు చూట్టూ వీధి కుక్కలు చేరి... ఉదయం వరకు చిన్నారికి రక్షణగా ఉన్నాయి. తెల్లవారిన తర్వాత కుక్కల మధ్యలో చిన్నారి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు... వెంటనే ఆ పసికందును ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పసికందుపై కుక్కలు వ్యవహరించిన తీరును స్థానికులు ప్రశంసించారు. చిన్నారి చుట్టూ చేరిన కుక్కలు చలిలో కొన్ని గంటల పాటు పసికందుకు కాపలాగా నిలబడే ఉన్నట్లు పేర్కొన్నారు. చిన్నారిని ఆస్పత్రికి తరలించడానికి వెళ్లినప్పుడు ముందు ఎవరినీ దగ్గరకు రానివ్వలేదని, అనంతరం పొరుగువారి సాయంతో శిశువును మహేశ్‌గంజ్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని... చిన్నారిని ఎవరు వదిలివెళ్లారనే విషయం తెలుసుకోవడానికి స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఆప్‌పై ప్రజల విశ్వాసం : కేజ్రీవాల్

న్యూదిల్లీ : దిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) ఉప ఎన్నికల ఫలితాలు కేవలం 10 నెలల్లోనే ఆప్ పై ప్రజల తిరిగి విశ్వాసం ప్రదర్శిస్తున్నారని దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం అన్నారు. దిల్లీలో మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న ఆప్, ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఓడిపోయింది. దిల్లీలో అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీకి 12 వార్డులకు జరిగిన ఎంసీడీ ఉప ఎన్నికలు అగ్నిపరీక్షగా పరిగణించబడుతున్నాయి. బీజేపీ గతంలో తొమ్మిది వార్డుల్లో ఏడింటిని గెలుచుకోగా, ఆప్ మూడు, కాంగ్రెస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఒక్కో వార్డును గెలుచుకున్నాయి. ఆప్ గతంలో చాందినీ మహల్, చాందినీ చౌక్ వార్డులను కోల్పోయింది. కానీ ముండ్కా, దక్షిణపురి, నరైనాను గెలుచుకుంది. 'ఈసారి ఎంసీడీ ఉప ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ తన అంకితభావంతో పనిచేసే కార్యకర్తలను అభ్యర్థులుగా నిలబెట్టింది. దాని తీర్పు ద్వారా దిల్లీ ప్రజలు నగరంలో ఆప్‌నకు అనుకూలంగా ప్రజల మద్దతు క్రమంగా బలపడుతోందని స్పష్టం చేశారు' అని కేజ్రీవాల్ 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. కేవలం 10 నెలల్లో ప్రజల విశ్వాసం మరోసారి ఆమ్ ఆద్మీ పార్టీ వైపు వేగంగా తిరిగి వస్తోందని ఆయన తెలిపారు. 'దిల్లీలో త్వరలో సానుకూల రాజకీయాలకు, సుపరిపాలనకు తిరిగి వస్తోంది' అని అన్నారు. కాగా బీజేపీ ఈ పరీక్షలో విఫలమైందని, దేశ రాజధానిలో అది తన స్థానాన్ని కోల్పోతోందని ఆప్ నాయకులు తెలిపారు.

మూడేళ్లలో రెండు లక్షల శ్వాస కోశ వ్యాధులు: కేంద్రం

న్యూదిల్లీ: వాయు కాలుష్యంతో దిల్లీలో మూడేళ్లలో రెండు లక్షలకు పైగా తీవ్రమైన శ్వాసకోశ వ్యాధుల కేసులు నమోదైనట్లు కేంద్రం బుధవారం పార్లమెంటుకు తెలిపింది. 2022-2024 మధ్య దిల్లీలోని ఆరు ప్రధాన కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోని అత్యవసర విభాగాల్లో 2,04,758 తీవ్రమైన శ్వాసకోశ అనారోగ్య (ఏఆర్ఐ) కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. వీటిలో 30,420 మంది రోగులు సుమారు 15 శాతం మంది ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. ఇది దిల్లీలో దీర్ఘకాలిక వాయు కాలుష్య సంక్షోభంతో తీవ్రమైన ఆరోగ్య నష్టాన్ని వెల్లడిస్తోంది. 2024లో మొత్తం అత్యవసర సందర్శనలలో స్వల్ప తగ్గుదల ఉన్నప్పటికీ... అడ్మిషన్ అవసరమైన రోగుల సంఖ్య బాగా పెరిగింది, ఇది ఆసుపత్రులకు వచ్చే కేసులు మరింత తీవ్రంగా మారుతున్నట్లు సూచిస్తోందని కేంద్రం తెలిపింది. వాయు కాలుష్యం శ్వాసకోశ వ్యాధులు, సంబంధిత వ్యాధులను కలిగించే కారకాల్లో ఒకటి అని ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఆహారం, వృత్తి, సామాజిక ఆర్థిక స్థితి, ముందుగా ఉన్న పరిస్థితులు సహా బహుళ కారకాలు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని స్పష్టం చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) పలు నగరాల్లో నిర్వహించిన అధ్యయనంలో కాలుష్య స్థాయిలలో పెరుగుదల శ్వాసకోశ వ్యాధులతో అత్యవసర విభాగాల్లో చేరే వారిసంఖ్య పెరుగుదలతో నేరుగా ముడిపడి ఉందని తేలింది. 33 వేల కంటే ఎక్కువ మంది రోగులలో, క్షీణిస్తున్న గాలి నాణ్యత, శ్వాసకోశ అనారోగ్యం మధ్య స్పష్టమైన సంబంధం ఉన్నట్లు నివేదిక తెలిపింది. అయితే, అధ్యయనం ప్రత్యక్ష కారణాన్ని నిరూపించలేకపోయింది. అలాగే, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) ఆగస్టు 2023 నుండి ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్ (ఐహెచ్‌పీ) ద్వారా వాయు కాలుష్య సంబంధిత వ్యాధుల డిజిటల్ నిఘాను చేపడుతోంది. దిల్లీలోని ఆరు ప్రాంతాలు సహా 30 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో 230 కంటే ఎక్కువ సెంటినెల్ సైట్‌లను కవర్ చేసినట్లు తెలిపింది. రాజ్యసభ ఎంపీ డాక్టర్ విక్రమ్‌జిత్ సింగ్ సాహ్నీ (నామినేట్ సభ్యులు) లేవనెత్తిన ప్రశ్నకు కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

యుద్ధానికి కాలుదువ్వితే వెనక్కు తగ్గం

యూరప్‌కు పుతిన్ హెచ్చరిక

మాస్కో: 'యుద్ధాన్ని కోరుకోవద్దు... ఒక్కసారి యుద్ధం మొదలైతే శాంతి చర్చల అవకాశం కూడా లేకుండానే ముగించేస్తాం' అని యూరప్‌ను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గట్టిగా హెచ్చరించారు. యూరోప్ శక్తులను ఓడించే సత్తా రష్యాకు ఉన్నదన్నారు. ఉక్రెయిన్‌తో నాలుగేళ్లుగా రష్యా యుద్ధం చేస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో అతిభయంకర పోరుగా ఇది నిలిచింది. యూరోపియన్ దేశాలు, అమెరికా అండదండలతో రష్యాను ఉక్రెయిన్ దీటుగా ఎదుర్కొంటున్నది. దీంతో ఆ దేశం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మాస్కో వశం కాలేదు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో పుతిన్ గెలిస్తే నాటో సభ్యదేశంపై దాడి చేస్తారని ఉక్రెయిన్, యూరప్ శక్తులు చాలా సార్లు హెచ్చరించాయి కానీ ఇది అర్థంలేని వాదనంటూ పుతిన్ ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూనే ఉన్నారు. రష్యాపై యుద్ధానికి యూరప్ సిద్ధమవుతున్నట్లు హంగరీ విదేశాంగ మంత్రి పీటర్ స్జిజార్తో హెచ్చరించిన నేపథ్యంలో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు పుతిన్ స్పందిస్తూ 'యూరప్ ఆకస్మికంగా యుద్ధాన్ని మొదలు పెడితే... అది ఎంత వేగంగా ముగుస్తుందంటే, చర్చలు జరిపే అవకాశం కూడా లభించదు' అని అన్నారు. ఉక్రెయిన్‌లో జరిగేది పూర్తి స్థాయి యుద్ధం కాదని, రష్యా లక్షిత దాడులు మాత్రమేనని చెప్పారు. యూరప్ యుద్ధానికి కాలుదువ్వితేగనుక తాము వెనక్కి తగ్గబోమని పుతిన్ తెల్చిచెప్పారు. రష్యాతో తెగతెంపులు చేసుకున్నందునే ఉక్రెయిన్ శాంతి చర్చల్లో యూరప్ భాగస్వామ్యం కావడంలేదని అన్నారు. యూరప్‌ది యుద్ధ పక్షమని పుతిన్ వ్యాఖ్యానించారు. నల్ల సముద్రంలో రష్యాకు చెందిన షాడో ఫ్లీట్ ట్యాంకర్లపై డ్రోన్ దాడులకు ప్రతిస్పందనగా సముద్రాన్ని వినియోగించుకునే అవకాశం ఉక్రెయిన్‌కు లేకుండా చేస్తామని హెచ్చరించారు.

విశాలాంధ్ర ప్రపంచం

ఆపిన ప్రతి యుద్ధానికో నోబెల్: ట్రంప్

వాషింగ్టన్: 'భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ముగించాం. ఎనిమిది యుద్ధాలకు తెరదించాం. అందుకోసం నోబెల్ పురస్కారం ఇవ్వాలి. మరో యుద్ధాన్ని కూడా ముగించబోతున్నాం (రష్యా-ఉక్రెయిన్‌నుద్దేశించి)' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. కేబినెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'నేను యుద్ధాన్ని ఆపిన ప్రతిసారి... ఇది కూడా ఆపితే నోబెల్ వరిస్తుందని చెబుతతున్నారు. అలా ఒక దాని తర్వాత ఒకటిగా యుద్ధాలు ఆపుతున్నాను తప్ప నోబెల్ వరించలేదు. ఇప్పుడేమో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తే తప్పకుండా నోబెల్ పురస్కారం లభిస్తుందని చెబుతున్నారు. మరి మిగతా ఎనిమిది యుద్ధాల సంగతేమిటి? నేను ఆపిన ప్రతి యుద్ధానికో నోబెల్ పురస్కారం నాకు లభించాలి కానీ నేను అంత అత్యాసకు పోను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్-పాక్ యుద్ధం తన వల్ల ఆగిందని మే 10 నుంచి కనీసం 60సార్లకుపైగా ట్రంప్ చెప్పుకున్నారు.

అమెరికా-రష్యాకు కుదరని రాజీ

ఉక్రెయిన్ శాంతిపై కొన్ని ప్రతిపాదనలు అంగీకరించని పుతిన్

మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించడంపై అమెరికాతో రష్యా చర్చల్లో పెద్దగా పురుగోతి లేదు. శాంతి దిశగా రాజీ కుదరలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నతస్థాయి రాయబారులతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బుధవారం ఐదు గంటల పాటు చర్చించారు. అమెరికా ప్రతినిధులుగా ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారేడ్ కుష్నర్‌తో పాటు పుతిన్ ఉన్నతస్థాయి విదేశాంగ విధానం సహచరి యూరి ఉషాకోవ్ పాల్గొన్నారు. ఐదు గంటలు చర్చించినాగానీ రాజీ కుదరలేదని క్రెమ్లిన్ తెలిపింది. అనంతరం యూరి ఉషాకోవ్ విలేకరులతో మాట్లాడుతూ అమెరికా చేసిన కొన్ని ప్రతిపాదనలను పుతిన్ తిరస్కరించారని చెప్పారు. చర్చల తర్వాత విట్కాఫ్ నేరుగా మాస్కోలోని అమెరికా ఎంబసీకి వెళ్లిపోయారని, ఆయన అక్కడ నుంచి శ్వేతసౌధానికి సమాచారం అందజేస్తారని చెప్పారు. పుతిన్, ట్రంప్ భేటీకి ప్రస్తుతం ఎలాంటి ప్రణాళికలు లేవన్నారు. తాజా చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయని చెప్పారు. అమెరికా, రష్యా ఆర్థిక సహకారానికి మంచి అవకాశాలు ఉన్నాయని ఉషాకోవ్ తెలిపారు. ప్రాదేశిక సమస్యలపైనా చర్చించినట్లు తెలిపారు. కొన్ని ముసాయిదా ప్రతిపాదనలకు సవరణలు అవసరమని, అవి చేస్తే వాటిని రష్యా ఆమోదించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ చర్చల క్రమంలో ట్రంప్ ఓ పోస్టు పెట్టారు. తమ ప్రతినిధులు రష్యాలో ఉన్నారని, ప్రస్తుత పరిస్థితి జటిలంగా ఉందని, సాధ్యమైంత త్వరగా యుద్ధం ముగిసిపోవాలని కోరుకుంటున్నామని చెప్పారు. సమస్యకు ఎంత త్వరగా పరిష్కారం లభిస్తే అంత మంచిందని అన్నారు. యుద్ధం కారణంగా ప్రతి నెలా 25 వేల నుంచి 30 వేల మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారని ట్రంప్ ఆందోళన వ్యక్తంచేశారు. కాగా, 2022 ఫిబ్రవరి నుంచి ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం జరుగుతున్న విషయం విదితమే.

శ్రీలంకకు భారత్ వైద్య సాయం

కొలంబో: దిత్వా తుపాను సృష్టించిన బీభత్సానికి అతలాకుతలమైన శ్రీలంకకు భారత్ ఆపన్నహస్తం అందించింది. మొబైల్ ఫీల్డ్ హాస్పిటల్‌తో పాటు 70 మంది వైద్య సిబ్బందిని ద్వీప దేశానికి మానవతా సాయంగా పంపింది. ఈ మేరకు ఇండియన్ మిషన్ బుధవారం వెల్లడించింది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదలకు తోడు కొండచరియలు విరిగి పడిన ఘటనలతో శ్రీలంకకు తీవ్ర ఆస్తి-ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పటివరకు 465 మంది చనిపోగా, 366 మంది ఆచూకీ లేరని అధికారులుత తెలిపారు. శ్రీలంకకు భారత్ అత్యవసర సాయం కింద ఫీల్డ్ ఆసుపత్రి, 70 మందికిపైగా వైద్య సిబ్బందిని పంపినట్లు ఇండియన్ హై కమిషన్ సామాజిక మాధ్యమంలో పేర్కొంది. ఐఏఎఫ్ సీ17 గ్లోబ్‌మాస్టర్ విమానం పారా ఫీల్డ్ ఆసుపత్రితో పాటు ఆగ్రా నుంచి 73 మంది వైద్య సిబ్బందిని ఎయిర్‌లిఫ్ట్ చేసినట్లు తెలిపింది. ఐఏఎఫ్ ఎంఐ17 హెలికాప్టర్లు ఇప్పటికే సేవలు అందిస్తున్నాయి. ఎనిమిది టన్నులకుపైగా సహాయ సామగ్రిని ఎయిర్‌లిఫ్ట్ చేశాయి. 65 మందిని కాపాడాయి. వీరిలో విదేశీ పౌరులు, గర్భిణులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారు ఉన్నారు. శ్రీలంకలో అనేక చోట్ల భారతీయ సిబ్బంది సహాయక చర్యలు నిర్వహిస్తున్నట్లు మిషన్ వెల్లడించింది. కొలంబో సమీపంలోని సెదావత్తా, నదీగమ ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. 8-10 అడుగుల లోతైన వరద నీటిలో చిక్కుకుపోయిన వారి ప్రాణాలు కాపాడటంలో నిమగ్నమయ్యాయి. 43 మందికిపైగా బాధితులను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. ఆపరేషన్ సాగర్ బంధు పేరిట శ్రీలంకకు భారత్ అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు ఇండియన్ హై కమిషన్ వెల్లడించింది.

ఖలీదా జియా కోసం విదేశీ వైద్య బృందాలు

ఢాకా: మాజీ ప్రధాని ఖలీదా జియా ఆరోగ్యం మరింతగా క్షీణించింది. ఆమెను బతికించుకోవాలని ఆదేశం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇప్పటికే చైనా వైద్యులు సేవలు అందిస్తుండగా, తాజాగా నలుగురు స్పెషలిస్టులతో కూడిన బ్రిటన్ వైద్య బృందం రంగంలోకి దిగింది. బుధవారం ఉదయం బంగ్లాదేశ్ రాజధాని ఢాకాకు చేరుకున్న ఈ బృందం నేరుగా ఎవర్ కేర్ ఆసుపత్రికి వెళ్లి ఖలీదా జియా ఆరోగ్యం, ఆమెకు అందించే వైద్యం గురించి ఆరా తీసింది. ఈ మేరకు బీఎన్‌పీ మీడియా సెల్ సభ్యుడు కబీర్ ఖాన్ తెలిపారు. విదేశీ వైద్య నిపుణుల రాకతో ఖలీదా జియా ఆరోగ్యం మెరుగువుతందని ఆకాంక్షించారు. ఖాలీదా జియాను విదేశాలకు తరలించే అవకాశం ఎంత మాత్రం లేదని ఆమె వ్యక్తిగత డాక్టర్ హుస్సేన్ ఇప్పటికే స్పష్టంచేశారు. కాగా, భారత్, చైనా, అమెరికా, ఖతార్, సౌదీ అరేబియా, పాకిస్థాన్ దేశాలు తమ వంతుగా ఆమె కోసం వైద్య సహాయం అందించేందుకు ముందుకొచ్చాయని చెప్పారు.

త్రివిధ దళాధిపతుల పరామర్శ: మాజీ ప్రధాని ఖలీదా జియాను బంగ్లాదేశ్ త్రివిధ దళాధిపతులు పరామర్శించారు. ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్ ఉజ్ జమన్, నేవీ చీఫ్ అడ్మిరల్ మహమ్మద్ నజ్ముల్ హసన్, ఎయిర్‌ఫోర్స్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ హసన్ మొహమూద్ ఖాన్ ఎవర్‌కేర్ ఆసుపత్రికి వెళ్లి ఖలీదా జియా ఆరోగ్యంపై ఆరా తీశారని అంతర్గత సేవల ప్రజా సంబంధాల డైరెక్టరేట్ (ఐఎస్‌పీఆర్) ఒక ప్రకటన విడుదల చేసింది. రాత్రి 9 గంటలప్పుడు ఆసుపత్రికి త్రివిధ దళాధిపతులు రాగా, వారు దాదాపు 20 నిమిషాలు అక్కడ గడిపారని బంగ్లాదేశ్ మీడియా పేర్కొంది. ఖలీదా జియా కుటుంబ సభ్యులను వారు పరామర్శించారని, ఆమె వైద్య బృందంతో మాట్లాడారని, మాజీ ప్రధాని త్వరగా కోలుకోవాలని ప్రార్థించారని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ప్రతినిధి కబీర్ ఖాన్ తెలిపారు. కాగా, జమాతే ఇస్లామీ అధినేత షఫీకుర్ రెహమాన్ కూడా ఖలీదా జియాను పరామర్శించారు.

నేడు భారత్‌కు పుతిన్

మాస్కో/న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ చేరుకోనున్నారు. ఆయన గురు-శుక్రవారాలు న్యూఢిల్లీలో పర్యటిస్తారు. అత్యుత్తమ శిక్షణ పొందిన భద్రతా సిబ్బంది రష్యా అధ్యక్ష భద్రతా సేవల దళం నుంచి ఆయన వెంట రాబోతోంది. భారత ఎన్ఎస్‌జీ కమాండోలు కూడా పుతిన్‌కు భద్రత కల్పిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో భారత్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. స్నైపర్లు, డ్రోన్లు, జామర్లు, ఏఐ నిఘా వంటి ఐదు అంచల నిఘా వలయాన్ని సిద్ధం చేసింది. పుతిన్ భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొంటారు. 4వ తేదీ సాయంత్రం ఆయన ఢిల్లీ చేరుకుంటారు. ప్రధానితో కలిసి రాత్రి భోజనం చేస్తారు. ఆపై రాష్ట్రపతి భవన్‌లో గౌరవ ఆతిథ్యం స్వీకరిస్తారు. శుక్రవారం రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తారు. ఆపై హైదరాబాద్ హౌస్‌లో జరిగే సదస్సుతో పాటు భారత్ మండపంలో కార్యక్రమానికి హాజరవుతారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్ము విందులో పాల్గొంటారు. పుతిన్ బస చేయబోయే హోటల్‌ను శానిటైజ్ చేసి సిద్ధం చేశారు. రష్యా భద్రతా అధికారులు ఇప్పటికే ముందస్తు తనిఖీలు నిర్వహిస్తారు. పుతిన్ పర్యటనలో భాగంగా భారత్-రష్యా మధ్య పౌర అణు సహకార ఒప్పందం జరగబోతోంది. రష్యా డ్యూమా ఇప్పటికే దీనిని ఆమోదించింది. వాణిజ్యం, రక్షణ, ఇతర రంగాల్లోనూ ఒప్పందాలకు పుతిన్-మోదీ శ్రీకారం చుట్టనున్నారు. ఎస్-400 క్షిపణి వ్యవస్థల ఒప్పందంపైనా సంతకం చేయనున్నట్లు సమాచారం.

వలసలపై ఆంక్షలతో ఆ దేశాలకే నష్టం: జైశంకర్

న్యూఢిల్లీ: అమెరికా, ఐరోపా దేశాల్లో వలసల ఆంక్షలపై విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వలసలు, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలపై మితిమీరిన ఆంక్షలు విధిస్తే.. వాటి సొంత ప్రయోజనాలే దెబ్బతినే అవకాశం ఉందన్నారు. చివరకు ఆ దేశాలే నష్టపోతాయని హెచ్చరించారు. ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి జైశంకర్ మాట్లాడుతూ చాలా సందర్భాల్లో వాళ్లే ఈ సమస్యను సృష్టించారని, కాబట్టి స్వయంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలకు, ఈ సంక్షోభానికి ఎటువంటి సంబంధం లేదు. వలసలకు సంబంధించి అమెరికా, ఐరోపా దేశాల్లో ఏమైనా ఆందోళనలు ఉంటే... అవి ఆ దేశాలు అమలు చేసిన దీర్ఘకాలిక విధానాల ఫలితమే. రెండు దశాబ్దాల్లో ఉద్దేశపూర్వకంగా, అన్నీ తెలిసే తమ వ్యాపారాలను విదేశాలకు విస్తరించాయి. ఇది వారి వ్యూహం. కాబట్టి... ఈ సమస్యలకు స్వయంగా పరిష్కార మార్గాలు కనుగొనాలి. నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలనేవి రెండు పక్షాలకు ప్రయోజనమని పాశ్చాత్య దేశాలు గుర్తించాలి. ఒకవేళ పెద్దఎత్తున ఆంక్షలు విధిస్తే ఆ దేశాలే నష్టపోతాయి. ప్రపంచం అధునాతన తయారీ రంగం వైపు మళ్లుతున్న వేళ... నైపుణ్యం కలిగిన ప్రతిభ అవసరం పెరుగుతుంది. ఏ దేశం కూడా స్వయంగా సరిపడా సంఖ్యలో నిపుణులను వేగంగా తయారు చేయలేదు' అని జైశంకర్ చెప్పారు. ఈ ఒత్తిళ్లను సమతుల్యం చేసుకునేందుకు పాశ్చాత్య దేశాలు ఓ మార్గాన్ని కనుగొంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

అధికార మార్పిడిపై గుసగుసలు

కొట్టిపారేసిన జేఎంఎం

రాంచీ: జార్ఖండ్‌లో రాజకీయ ప్రకంపనలు జరుగుతున్నాయి. అధికార మార్పిడి జరుగుతుందంటూ వార్తలు వస్తున్నాయి. హేమంత్ సోరెన్ సర్కార్... కమలంతో జతకట్టబోతుందంటూ ఉధృతంగా ప్రచారం సాగుతోంది. ఇటీవల హేమంత్ సోరెన్-కల్పనా సోరెన్ దంపతులు ఢిల్లీలో పర్యటించారు. బీజేపీ అగ్ర నాయకులతో రహస్య మంతనాలు జరిపినట్లు వార్తలు వచ్చాయి. చక్కర్లు కొడుతున్నాయి. దీంతో హేమంత్ సోరెన్ ఎన్డీయేలో చేరబోతున్నట్లుగా కథనాలు వెలువ డ్డాయి. బీజేపీతో పొత్తుకు కల్పనా సోరెన్ కీలకపాత్ర పోషించినట్లుగా తెలుస్తోంది. త్వరలోనే ఎన్డీయేలో చేరే అవకాశాలు ఉన్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. బీహార్ ఎన్నికల సమయంలో ఇండియా ఐక్యసంఘటన పట్టించుకోలేదని హేమంత్ దంపతులు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే చాలా రోజులుగా ఢిల్లీలో బీజేపీ అగ్రనేతలతో హేమంత్ సోరెన్ దంపతులు రహస్య చర్చలు జరిపినట్లుగా సమాచారం. అధికార మార్పిడిపై జోరుగా ప్రచారం జరగడంతో జేఎంఎం సోషల్ మీడియాలో కీలక పోస్ట్ పెట్టింది. 'జార్ఖండ్ తలవంచదు' అంటూ వ్యాఖ్యానించింది. పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న జేఎంఎం నాయకుడు వినోద్ పాండే మాట్లాడుతూ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఢిల్లీ పర్యటన వ్యక్తిగత హోదాలోనే జరిగిందని, కుట్రలు పన్నడం బీజేపీకి అలవాటని, ఈసారి కూడా అందుకు భిన్నంగా లేదని అన్నారు.అధికార మార్పిడిపై వస్తున్న ఊహాగానాలను రాష్ట్ర బీజేపీ కూడా తోసిపుచ్చింది. బీజేపీ-జేఎంఎం వ్యతిరేక తీరాలు అని, ఎప్పటికీ కలవలేవని పేర్కొన్నారు. జేఎంఎం ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలను మాత్రమే నమ్ముతుందని, భవిష్యత్‌లోనూ కలిసి వచ్చే అవకాశం లేదని ప్రతుల్ షాదేవ్ అన్నారు.

'కంప్యూటరైజ్డ్ రైఫిల్ సిస్టమ్'పై భారత్ గురి

ఇజ్రాయిల్ సంస్థతో సంప్రదింపులు

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే మొట్టమొదటి కంప్యూటరైజ్డ్ రైఫిల్ సిస్టమ్ కోసం భారత్ ప్రయత్నాలు చేస్తోంది. ఇది భారత్ సాయుధ దళాల్లో చేరితే దేశ రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఇందుకోసం ఇజ్రాయిల్ సంస్థతో చర్చలు జరుపుతోంది. దేశ సాయుధ దళాల కోసం విప్లవాత్మకమైన అర్బెల్ కంప్యూటరైజ్డ్ ఆయుధ వ్యవస్థ గురించి ఇజ్రాయిల్‌కు చెందిన ప్రముఖ చిన్న ఆయుధాల తయారీ సంస్థ ఇజ్రాయిల్ వెపన్ ఇండస్ట్రీస్ (ఐడబ్ల్యూఐ)తో భారత్ చర్చలు జరుపుతోంది. ఇదే విషయాన్ని ఆ సంస్థ సీఈఓ షుకి స్క్వార్ట్జ్ ఒక ఇంటర్వ్యూలో ధ్రువీకరించారు. భారత్‌కు అర్బెల్ వ్యవస్థలను అందించడం గురించి తాము ఇప్పటికే ఆ దేశంతో మొదటి దశ సంభాషణలు పూర్తి చేశామని తెలిపారు. తదుపరి చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు. ఐడబ్ల్యూఐ తయారు చేసిన అర్బెల్ కంప్యూటరైజ్డ్ రైఫిల్ సిస్టమ్ అత్యంత శక్తివంతమైంది. సంక్లిష్టమైన యుద్ధభూమి పరిస్థితులలో ఇది సైనికులకు బాగా ఉపయోగపడుతుంది. అత్యంత కచ్చితత్వంతో పనిచేస్తుంది. ప్రాణాంతక సమయంలో జవాన్లకు అర్బెల్ కంప్యూటరైజ్డ్ రైఫిల్ సిస్టమ్ బాగా ఉపయోగపడుతుంది. దీనిని భారత్ సంపాదిస్తే ప్రపంచంలోనే తొలిసారి చిన్న ఆయుధాల ఫైర్ కంట్రోల్ వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. యుద్ధ, ఘర్షణాత్మక వాతావరణంలో అర్బెల్ కంప్యూటరైజ్డ్ రైఫిల్ సిస్టమ్ సైనికులకు బాగా పనికొస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒకేసారి గురి చూసి ఎక్కువ మంది శత్రుదేశ జవాన్లను దీంతో ముట్టుబెట్టవచ్చునంటున్నారు. అందుకు ఇందులో అధునాతన సెన్సార్లు, రియల్ టైమ్ బాలిస్టిక్ కంప్యూటేషన్ వంటివి ఉన్నాయి. టార్గెట్ ను మిల్లీ సెకన్లలోపే ఫిక్స్ చేసే అల్గారిథమ్ ఈ అర్బెల్ కంప్యూటరైజ్డ్ రైఫిల్ సిస్టమ్‌లో ఉంది. అది మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్ (ఎంఇఎంఎస్) అల్గోరిథం ద్వారా నడుస్తుంది. మొదటి షాట్ తర్వాత ట్రిగ్గర్ నొక్కి పట్టుకున్న తర్వాత అర్బెల్ షూటర్ ప్రవర్తనను విశ్లేషిస్తుంది. గురి సరిగ్గా ఉన్నప్పుడు మాత్రమే తదుపరి రౌండ్లను విడుదల చేస్తుంది. ఈ వ్యవస్థను ఏదైనా చిన్న ఆయుధాల ప్లాట్?ఫామ్?తో అనుసంధానించవచ్చు. ఇది పనిచేయడానికి ప్రత్యేక ఆప్టికల్ భాగం అవసరం లేదు. మరోవైపు, ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీస్, భారత్ మధ్య భాగస్వామ్యం విస్తరిస్తోందని స్క్వార్ట్జ్ తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా వివిధ రక్షణ సంస్థల కోసం మేం భారత్‌తో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

ఆమెను వెనక్కి తీసుకొస్తాం

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు బహిష్కరించిన సునాలీ ఖాతున్ అనే మహిళను తిరిగి దేశానికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. గర్భిణిగా ఉన్న ఓ మహిళ విషయంలో మానవత్వాన్ని చూపాలని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలతో ఈ చర్యలు తీసుకుంది. బంగ్లాదేశ్‌కు చెందిన వారిని తిరిగి స్వదేశానికి పంపించే క్రమంలో భారత పౌరసత్వానికి సంబంధించి సరైన పత్రాలు లేవనే కారణంతో ఈ ఏడాది ప్రారంభంలో ఢిల్లీకి చెందిన సునాలీ ఖాతున్ అనే గర్భిణిని, ఆమె ఎనిమిదేళ్ల కుమారుడు సబీర్ సహా ఆరుగురిని అధికారులు దేశం నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. ఆమె భారత పౌరురాలేనని, గతంలో జరిగిన ఓ అగ్ని ప్రమాదంలో వారి జనన ధ్రువీకరణ పత్రాలు కాలిపోయాయని భారతీయ పౌరుడైన ఆమె తండ్రి కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై దర్యాప్తు చేసిన హైకోర్టు బంగ్లాదేశ్‌కు పంపించివేసిన ఆరుగురిని తిరిగి తీసుకురావాలని, వారి భారత పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి పూర్తి అవకాశం ఇవ్వాలని సెప్టెంబర్ 26న కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఇటువంటి కేసుల్లో సాంకేతిక అంశాలు కాకుండా మానవత్వంతో చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సునాలీ తండ్రి భారతీయుడు అయినప్పుడు సునాలీ, ఆమె కుమారుడు కూడా భారతీయులే అవుతారని ధర్మాసనం పేర్కొంది. ఆమె బహిష్కరణ విషయంపై క్షుణ్ణంగా విచారణ జరపాలని అధికారులను ఆదేశించింది. సునాలీ ఖాతున్‌కు అత్యవసర వైద్యసహాయం అవసరం ఉన్నందున మొదట ఆమెను, ఆమె కుమారుడిని భారత్‌కు తీసుకురావాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో సునాలీ ఖాతున్‌ను దేశానికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. కేంద్రం ఇచ్చిన హామీని నమోదు చేస్తూ... ప్రసవానికి సంబంధించిన అన్ని వైద్య సదుపాయాలు ఉచితంగా అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆమెతో పాటు బహిష్కరించిన మరో నలుగురు వ్యక్తులను కూడా విచారించాలని, భారత పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి అవకాశం ఇవ్వాలని సూచించింది.

నిందితుల వాదనలు 15 నిమిషాలకే పరిమితం

ఢిల్లీ అల్లర్ల కేసులో సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : వాదనలకు సమయ షెడ్యూల్ నిర్ణయించాల్సిన అవసరం ఉందని గమనించిన సుప్రీం కోర్టు బుధవారం ఫిబ్రవరి 2020 ఢిల్లీ అల్లర్లలో నిందితుల తరఫు న్యాయవాదులు తమ మౌఖిక వాదనలను 15 నిమిషాలకు పరిమితం చేయాలని ఆదేశించింది. నిందితుల న్యాయవాదులు ప్రతిపాదించిన వాదనలపై అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు చేసే ఏదైనా వివరణ 30 నిమిషాలకు మించరాదని న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'రెండువైపులా వాదనలు గణనీయంగా ముందుకు వచ్చాయి. సమయ షెడ్యూల్ నిర్ణయించాల్సిన అవసరం ఉందని మేము భావిస్తున్నాము. మౌఖిక వాదనలు ఒక్కొక్కటి 15 నిమిషాలకు మించకూడదు. ఏఎస్‌జీ వివరణ 30 నిమిషాలకు మించకూడదు' అని ధర్మాసనం విచారణను డిసెంబరు 9కి వాయిదా వేస్తూ పేర్కొంది. నిందితుల తరఫున హాజరయ్యే న్యాయవాదులు తమ శాశ్వత చిరునామాలను సమర్పించాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈ కేసులో బెయిల్ కోరుతూ, కార్యకర్త షర్జీల్ ఇమామ్ మంగళవారం సుప్రీం కోర్టు ముందు పూర్తి స్థాయి విచారణ లేదా ఒక్క నేరారోపణ కూడా లేకుండా 'ప్రమాదకరమైన మేధో ఉగ్రవాది' గా ముద్ర వేయడం పట్ల తన ఆవేదనను వ్యక్తం చేశారు. 'ప్రతివాది (పోలీసులు) నన్ను పిలిచినట్లుగా నేను ఉగ్రవాదిని కాదని నేను చెప్పాలనుకుంటున్నాను. నేను దేశ వ్యతిరేకిని కాదు. నేను ఈ దేశ పౌరుడిని, పుట్టుకతో పౌరుడిని, ఇప్పటి వరకు నాపై ఎటువంటి నేరం నమోదు కాలేదు' అని ఇమామ్ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే అన్నారు. ఈశాన్య ఢిల్లీని కుదిపేసిన మత హింసకు ముందు జనవరి 28, 2020న ఇమామ్‌ను అరెస్టు చేశారని, అల్లర్ల కేసులో 'నేరపూరిత కుట్ర' నేరంగా పరిగణించలేని తన ప్రసంగాల కోసం ఇమామ్‌ను అరెస్టు చేశారని ఆయన వాదించారు. ఉమర్ ఖలీద్ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఫిబ్రవరి 2020లో అల్లర్లు చెలరేగినప్పుడు తన క్లయింట్ ఢిల్లీలో లేడని, 'మీ నిరసనలకు శిక్షిస్తానని చెప్పినట్లుగా' అతనిని జైలులో ఉంచలేమని వాదించారు. గుల్ఫిషా ఫాతిమా తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపిస్తూ, కార్యకర్త ఆరు సంవత్సరాల కంటే తక్కువ కాలం జైలులో ఉన్నారని తెలిపారు. విచారణలో జాప్యాన్ని 'ఆశ్చరకరం, అపూర్వం' అని అభివర్ణించారు. ఖలీద్, ఇమామ్, ఇతరుల బెయిల్ పిటిషన్లను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఫిబ్రవరి 2020 అల్లర్లు ఆకస్మికంగా జరిగినవి కాదని, భారతదేశ సార్వభౌమాధికారంపై 'ముందస్తు ప్రణాళికతో, రూపొందించిన దాడి' అని ఢిల్లీ పోలీసులు తెలిపారు. పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ), జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) కి వ్యతిరేకంగా విస్తృత నిరసనల సందర్భంగా హింస చెలరేగింది.

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తీవ్ర సమస్యలు

విమానాల రద్దు... ప్రయాణికుల అవస్థలు

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశవ్యాప్తంగా చాలా విమానాశ్రయాల్లో మైక్రోసాఫ్ట్ విండోస్ మొరాయిస్తుండటంతో 'చెక్-ఇన్' వ్యవస్థల్లో తీవ్ర సమస్యలు తలెత్తాయి. ఫలితంగా విమాన సర్వీసుల్లో జాప్యం నెలకొంది. శంషాబాద్ సహా పలు విమానాశ్రయాల్లో విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. శంషాబాద్ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. దీంతో శబరిమల వెళ్లాల్సిన అయ్యప్ప భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఇక్కడి నుంచి ఢిల్లీ, మదురై, బెంగళూరు, గోవా, కోల్‌కతా, భువనేశ్వర్ వెళ్లాల్సిన కొన్ని విమానాలు రద్దయ్యాయి. గోవా, అహ్మదాబాద్, మదురై, బెంగళూరు, ఢిల్లీ, భువనేశ్వర్, చెన్నై నుంచి శంషాబాద్‌కు రావాల్సిన విమానాలు కూడా రద్దయినట్లు అధికారులు తెలిపారు. నిర్వహణ కారణాల వల్ల ఈ విమాన సర్వీసులు రద్దయినట్లు ఎయిర్‌లైన్లు వెల్లడించాయి. బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లాల్సిన ఏడు విమానాలు, ఇక్కడికి రావాల్సిన 12 విమాన సర్వీసులు రద్దయ్యాయి. 'చెక్-ఇన్ సిస్టమ్స్'లో సాంకేతిక సమస్య కారణంగానే విమాన సర్వీసులకు అంతరాయం కలిగినట్లు తెలుస్తోంది. 'ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ విండోస్ సేవలకు అంతరాయం కలిగింది. దీంతో ఎయిర్‌పోర్టుల వద్ద ఐటీ సర్వీసులు, చెక్ ఇన్ వ్యవస్థలు పనిచేయడం లేదు' అని తమకు సమాచారం అందినట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ సమస్య కారణంగా విమానాశ్రయాల్లో చెక్-ఇన్, బోర్డింగ్ ప్రక్రియలను మాన్యువల్‌గా చేస్తున్నారు. ఫలితంగా విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థల విమాన సర్వీసులపై ఈ ప్రభావం పడింది. అయితే, దీనిపై మైక్రోసాఫ్ట్ గానీ, ఎయిర్‌లైన్ల నుంచి గానీ ఎలాంటి స్పందన రాలేదు. కొన్ని విమానాశ్రయాల్లో మంగళవారం రాత్రి నుంచే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ సహా పలు విమానాశ్రయాల్లో సాంకేతిక సమస్య కారణంగా వందల సంఖ్యలో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. దానికి జీపీఎస్ స్పూఫింగ్ కారణమని కేంద్రం ధ్రువీకరించింది. గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) మార్చేందుకు ప్రయత్నాలు జరిగినట్లు పార్లమెంట్‌లో వెల్లడించింది.

23న ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

విశాలాంధ్ర-సచివాలయం : ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికల నిర్వహణపై అప్సా అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన కార్యవర్గం బుధవారం సమావేశమయ్యింది. ఈ నెల 29 తో ప్రస్తుత అప్సా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి పదవీ కాలం ముగియడంతో 23వ తేదీన ఎన్నికలను నిర్వహించాలని అప్సా కార్యవర్గం నిర్ణయించింది. 11న జనరల్ బాడి సమావేశం, 12న నోటిఫికేషన్ విడుదల,15-16 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 17న నామినేషన్ల స్క్రూటినీ, సాయంత్రం 5 గంటల వరకు ఉపసంహరణ, 23న ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నికలు, అదే రోజు కౌంటింగ్, గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన చేయనున్నారు.

ఇక దివ్యాంగులకూ ఉచిత బస్సు

అమరావతిలో దివ్యాంగ్ భవన్

టిడ్కో ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్ కేటాయింపు

సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు ఆరు వేల రూపాయల పింఛన్ ఇచ్చేది ఒక్క ఏపీలో మాత్రమేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రూ.3 వేల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. 63.50 లక్షల మందికి ప్రతి నెలా ఒకటో తేదీనే ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇస్తున్నామని పేర్కొన్నారు. దివ్యాంగులపై తమ ప్రభుత్వానికి ఉన్న ప్రత్యేక శ్రద్ధ ఇదని అన్నారు. విభిన్న ప్రతిభావంతులు అనేక రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ సభలో సీఎం చంద్రబాబు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన దివ్యాంగులను సన్మానించారు. పలువురు దివ్యాంగులకు మోటార్ సైకిళ్లు, లాప్ ట్యాప్, సెల్‌ఫోన్ తదితర ఉపకరణాలు పంపిణీ చేశారు. అనంతరం చంద్రబాబు ప్రసంగిస్తూ ఎన్ని అడ్డంకులు ఉన్నా వైకల్యం అడ్డుకాదని ఇక్కడ ఉన్న కొంతమంది నిరూపించారన్నారు. అలాంటి ఆదర్శవంతులను అభినందించి ఆశీర్వదించాలన్నారు. దృష్టి లోపం ఉన్నా కరుణకుమారి పట్టుదలతో రాణించి అవార్డు సాధించిందని, అంతర్జాతీయ ప్రపంచ కప్ క్రికెట్ 42 పరుగులు సాధించి భారత్‌కు కప్ అందించిందని చెప్పారు. ఆమె ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివి ఈ స్థాయికి చేరిందంటే తాను గర్విస్తున్నానన్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలన్నారు. అజయ్‌కుమార్ రెడ్డి అర్జున అవార్డు సాధించడం గొప్ప విషయమన్నారు. కర్నాటక తరపున ఆడిన దీపిక మన రాష్ట్రంలో పుట్టారని, కంటి చూపు పోయినా అధైర్య పడకుండా క్రికెట్‌లో, వంద మీటర్ల పరుగులో రాణించారన్నారు. మెగాడీఎస్సీ ద్వారా 2 వేలకు పైగా పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులకు స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ పొడిగిస్తున్నామని ప్రకటించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇంద్రధనస్సు రంగుల్లా వారి జీవితాలు బాగుండాలని, ఏడు వరాలు ఇస్తున్నామని చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటివరకు మహిళలకు మాత్రమే అందుతున్న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని దివ్యాంగులకు కల్పిస్తామన్నారు. స్థానికసంస్థల్లో, కార్పొరేషన్స్-పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్‌లో కనీసం ఒక దివ్యాంగ ప్రతినిధిని నామినేట్ చేస్తామన్నారు. ఆర్థిక సబ్సిడీ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అందించినట్టుగానే దివ్యాంగులకు మళ్లీ ప్రారంభిస్తామన్నారు. శ్యాప్ ద్వారా అన్ని క్రీడా కార్యక్రమాలు, టాలెంట్ డెవలప్‌మెంట్ స్కీములు దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. టిడ్కో ఇళ్ల కేటాయింపుల్లో దివ్యాంగులకు గ్రౌండ్‌ఫ్లోర్ కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బాపట్లలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజ్‌తో పాటు వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక డిగ్రీ కాలేజీ ఏర్పాటు. రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లలో చదివే దివ్యాంగ విద్యార్థులకు అదేచోట సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ చేస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయిలో అమరావతిలో 'దివ్యాంగ్ భవన్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విశాఖపట్నంలో నేషనల్ సెంటర్ ఫర్ డిజేబుల్డ్ స్పోర్ట్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కరుణ కుమారికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నజరానాతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.15 లక్షలు ప్రోత్సాహకం, ఇల్లు కట్టిస్తున్నామని తెలిపారు. అజయ్ కుమార్ రెడ్డికి ప్రభుత్వం తరపున రూ.2 లక్షలు, ఏసీఏ తరపున లక్ష రూపాయలు ఇస్తున్నామని, దీపికకు రూ.10 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. ఎంత బిజీగా ఉన్నా మీతో మమేకమై... మీకు ధైర్యం చెప్పాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమానికి వచ్చానని అన్నారు. 2019 నుంచి 2024 మధ్య ఎప్పుడైనా ఇలాంటి కార్యక్రమాలు చూశారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో దివ్యాంగులపై కక్షకట్టి దాడులు చేశారు తప్ప...ఆదుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయులు, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, చైర్మన్‌లు నారాయణస్వామి, కోటేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

100కుపైగా ఇండిగో విమానాల రద్దు

అసౌకర్యానికి చింతిస్తున్నట్లు సంస్థ ప్రకటన

48 గంటల షెడ్యూల్ సర్దుబాటు

న్యూఢిల్లీ: ఇండిగో సంస్థకు చెందిన విమాన సేవలకు తీవ్ర ఆటంకం కలిగింది. దేశవ్యాప్తంగా 100కుపైగా విమానాలు రద్దు అయ్యాయి. అంతరాయానికి చింతిస్తున్నామంటూ ఇండిగో సంస్థ ఒక ప్రకటనలో ప్రయాణికుల క్షమాపణ కోరింది. రానున్న 48 గంటల కోసం షెడ్యూల్ సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగానే విమానాల రద్దు, మరికొన్నింటిని రీషెడ్యూల్ చేయనున్నట్లు పేర్కొంది. చిన్నపాటి సాంకేతిక లోపాలు, శీతాకాలానికి సంబంధించిన షెడ్యూల్ మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పెరిగిన రద్దీ, అప్‌డేట్ చేసిన సిబ్బంది రోస్టరింగ్ నియమాల (ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్) అమలు వంటి కారణాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయని సంస్థ వివరణ ఇచ్చుకున్నది.

పరిస్థితిని వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు 24 గంటలూ నిర్విరామంగా తమ సిబ్బంది పనిచేస్తున్నట్లు తెలిపింది. ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, రీఫండ్ అందించడం వంటివి చేస్తున్నామని సంస్థ వెల్లడించింది. అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒకటిగా 'ఇండిగో' ఉన్నది. రోజుకు 2,300 విమాన సర్వీసులు నడుపుతుంది. తాజా సమస్యలతో మంగళవారం 1,400కు పైగా సర్వీసులు ఆలస్యమయ్యాయి. దిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు వంటి విమానాశ్రయాల్లో బుధవారం 100కుపైగా సర్వీసులు రద్దు అయ్యాయి. అనేక విమానాలు ఆలస్యంగా నడిచాయి. ఎఫ్‌డీటీఎల్ నిబంధనల రెండో దశ అమలు నుంచి 'ఇండిగో' సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది.

పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి పెద్ద పీట వేస్తూ, అవసరమైన సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఆయన బుధవారం 'ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్' (టీఐఈ) ప్రతినిధులతో సమావేశమయ్యారు. టీఐఈ సహకారంతో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుపై చర్చించారు. పీ4 విధానం గురించి మంత్రి వారికి అవగాహన కల్పించారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామిక వేత్త లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారం గురించి వివరించారు. తమ మెంటర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్ గురించి మంత్రికి, ఇతర అధికారులకు టీఐఈ ప్రతినిధులు వివరణ ఇచ్చారు. తద్వారా గ్లోబల్ నెట్‌వర్క్‌లో భాగంగా ఎంఎస్‌ఎంఈలకు మార్కెటింగ్, ఉత్పత్తులపై పారిశ్రామికవేత్తలకు అవగాహన, నూతన పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహానికి అవకాశం ఉంటుందని అన్నారు. జనవరి 4న రాజస్థాన్, జైపూర్‌లో టీఐఈ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని మంత్రిని ఆహ్వానించారు. కార్యక్రమంలో టీఐఈ గ్లోబల్ చైర్మన్ మురళి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ మీనన్, టీఐఈ గ్లోబల్ సమ్మిట్ చైర్మన్ మహావీర్ ప్రతాప్‌శర్మ, ఏపీఎంఎస్‌ఎంఈ డీసీ సీఈఓ విశ్వ మనోహరన్ పాల్గొన్నారు.

స్వర రసోదయశాల ఘంటసాల

విశాలాంధ్ర-విజయవాడ: పాట ఏదైనా తీవ్రస్థాయిలో పాడుతూ సుస్వరాలతో కూర్చిన సాహిత్యంలోని భావాన్ని శ్రోతల హృదయాలకు చేరువచేసే సన్నివేశానికి నిండుదనాన్ని చేకూర్చే ఘంటసాల గళం సుస్వరాల రసాలను ఉదయింప చేసే శాల అని వక్తలు పేర్కొన్నారు. ఆయన గానం తెలుగుజాతికి వరమన్నారు. ఎన్‌టీఆర్ ప్రణవి మ్యూజికల్ అకాడమీ సాంస్కృతిక, సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై ఘంటసాల 103వ జయంతి సందర్భంగా బుధవారం జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలను పరవశింప చేసింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కారుమంచి రాజు నేతృత్వంలో ముఖ్య, గౌరవ అతిథులుగా కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తి, ప్రసూన రామన్, మాంతి రమణారావు, బీవీ వీరభద్రరావు, డేవిడ్ రాజు తదితర ప్రముఖులు ఘంటసాల గాన వైద్యుష్యాన్ని కొనియాడుతూ గాయనీ, గాయకులను అభినందిస్తూ ప్రసంగించారు. బి మల్లీశ్వరి, సుహాసిని, పురుషోత్తమ ప్రసాద్, కేవీబీ ఆనంద్, బ్రహ్మం తదితరులు ఆనాటి మేటి చిత్రాలలోని ఘంటసాల ఆలపించిన దాదాపు 35 పాటలను రసరమ్యంగా పాడి వినిపించారు.

పేదలపై బుల్డోజర్ సహించం

- నితీశ్ సర్కార్‌కు సీపీఐ (ఎంఎల్) నేతల హెచ్చరిక
- పద్ధతి మార్చుకోకుంటే వీధి పోరాటాలు తప్పవని హెచ్చరిక
- బీహార్‌లో ఆక్రమణల తొలగింపు పేరుతో విధ్వంసం

పట్నా: బీహార్‌లో ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆక్రమణల తొలగింపు పేరుతో విధ్వంసం సృష్టిస్తోందని... పేదల్ని నిరాశ్రయుల్ని చేస్తోందని ప్రతిపక్ష సీపీఐ(ఎంఎల్) తీవ్రంగా విమర్శించింది. ఈ 'బుల్డోజర్ చర్య' ధనవంతులకు అనుకూలంగా సాగుతోందని పేదలను నిర్వాసితులను చేస్తోందని ఆ పార్టీకి చెందిన పాలిగంజ్ ఎమ్మెల్యే సందీప్ సౌరవ్ మండిపడ్డారు. పట్నాలోని గార్డానీబాగ్ ప్రాంతంలో జరిగిన నిరసన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నగర సుందరీకరణ పేరుతో ప్రజలను నిరాశ్రయులను చేస్తోందని ఆరోపించారు. పట్నాను అందంగా తీర్చిదిద్దడానికి వారు వీధి పక్కన పూలకుండీలను ఏర్పాటు చేస్తే, పేదలు ఎక్కడికి వెళతారని ఆయన ప్రశ్నించారు. పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు వీధి వ్యాపారాలను, ఫుట్‌పాత్ దుకాణాలను తొలగించడం ద్వారా 'మాల్ సంస్కృతి'ని ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. 'బీహార్ ప్రజలు తప్పనిసరిగా ఐదు సంవత్సరాలు వేచి ఉండరు. అవసరమైతే మేము వీధుల్లోకొచ్చి పోరాడతాం. మిమ్మల్ని అధికారం నుండి తరిమివేస్తాం' అని ఎన్డీఏ సర్కారును హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యుడు మెహబూబ్ ఆలం మాట్లాడుతూ... రాష్ట్ర హోంమంత్రి సామ్రాట్ చౌదరి ఆక్రమణ వ్యతిరేక డ్రైవ్ ద్వారా పేదలను వేధిస్తున్నారని మండిపడ్డారు. జీవనోపాధి అవకాశాలు పెంపొందించాల్సింది పోయి కొత్త హోంమంత్రి తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా బుల్డోజర్లను నడపడం ప్రారంభించారన్నారు. అణిచివేతను ఎదుర్కొంటున్న వీధి వ్యాపారులు ఆక్రమణదారులు కాదని తెలిపారు. చేతనైతే ముందు నిజమైన ఆక్రమణదారులను గుర్తించాలని ఆలం సవాల్ విసిరారు. ప్రధానమంత్రి స్వానిధి యోజన కింద ఒకప్పుడు రూ. 10,000 పొందిన చాలా మంది వీధి వ్యాపారులను ఇప్పుడు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన అన్నారు. "సాగు చేయని భూమిని ప్రభుత్వ భవనాలకు ఉపయోగించగలిగితే, అదానీకి రూపాయికి భూమి ఇవ్వగలిగినప్పుడు ఏడెనిమిది దశాబ్దాలుగా వారి స్థలాలలో నివసిస్తున్న పేదలకు భూమికి బదులుగా 'పార్చా' ఎందుకు ఇవ్వకూడదు?" అని ఆయన ప్రశ్నించారు. ఆక్రమణల పేరుతో పేదలపై దాడి చేస్తే పార్టీ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. బీహార్ ఎన్నికల్లో దిఘా అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేసిన దివ్య గౌతమ్ మాట్లాడుతూ ఆక్రమణ వ్యతిరేక డ్రైవ్ ముసుగులో పేదలను ఖాళీ చేయించడం ప్రభుత్వ ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ప్రత్యామ్నాయంగా వారికి వెండింగ్ జోన్లు లేదా ఇతర దుకాణాలు కేటాయించకుండా ఎక్కడికి పోతారని ప్రశ్నించారు. ఇది జీవనోపాధి రక్షణ, వీధి వ్యాపారాల నియంత్రణ చట్టం, 2014ను ఉల్లంఘించడమేనన్నారు. ఈ ఆక్రమణ వ్యతిరేక డ్రైవ్‌ను ఆపడానికి తాము చట్టపరంగా పోరాడతామని ఆమె తెలిపారు. ఫుల్వారీ షరీఫ్ మాజీ ఎమ్మెల్యే గోపాల్ రవిదాస్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరాశ్రయులను లక్ష్యంగా చేసుకుంటూ సంపన్న ఆక్రమణదారులను వదిలేస్తోందని మండిపడ్డారు. గోలంబార్, మహావీర్ మందిర్ మధ్య వీధి వ్యాపారులకు గతంలో కార్డులు, రుణాలు ఇచ్చారని... కానీ ఇప్పుడు వారందరినీ తరిమేస్తున్నారని తెలిపారు. వ్యాపారం చేసుకోనీయకుండా వారు తమ రుణాలను ఎలా తిరిగి చెల్లిస్తారని ప్రశ్నించారు. గయ, బక్సర్, ఔరంగాబాద్, ఇతర జిల్లాల్లో 'బుల్డోజర్ చర్య' జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇప్పుడు షాడో ముఖ్యమంత్రి అని పేర్కొంటూ, ప్రభుత్వాన్ని బీజేపీ నడుపుతోందని దాస్ పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం ఆక్రమణల తొలగింపు ఆపరేషన్ విరమించాలని డిమాండ్ చేశారు.

గిరిజన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

ఉధ్భవ్-2025 ప్రారంభోత్సవంలో జువల్ ఓరమ్, సంధ్యారాణి

విశాలాంధ్ర-సచివాలయం: గిరిజన పిల్లలు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, క్రీడలు నేర్చుకోవాలని, ఈఎంఆర్‌ఎస్ బాలబాలికలు అన్ని రంగాల్లో రాణించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్, ఏపీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆకాంక్షించారు. కేఎల్ యూనివర్సిటీ వేదికగా బుధవారం ఉధ్భవ్-2025 వేడుకలను మంత్రులు ప్రారంభించారు. విద్యార్థులకు హిందీ, ఆంగ్లంతో పాటు ప్రాంతీయ భాష ముఖ్యమేనని అన్నారు. గత ఐదేళ్లు జరిగిన గిరిజన సంస్కృతి ఉత్సవాలలో పాల్గొనడం, ఇప్పుడు మళ్లీ రావడం సంతోషంగా ఉందని జువల్ ఓరమ్ అన్నారు. జవహర్ లాల్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ల తరహాలోనే ఈఎంఆర్‌ఎస్ పాఠశాలలు అభివృద్ధి చేస్తామన్నారు. ఉధ్భవ్ అంటే హృదయాంతరాల నుంచి బయటకు తీయడం అనే అర్థం వస్తుంది కాబట్టే ఈ ఉత్సవాలకు ఆ పేరు పెట్టారని అన్నారు. 6వ జాతీయ ఈఎంఆర్‌ఎస్ సంస్కృతి, సాహిత్య, కళా ఉత్సవాన్ని ఓరమ్ ఆవిష్కరించారు. అనంతరం గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. మంత్రి సంధారాణి మాట్లాడుతూ

ఉధ్భవ్-2025 వేడుక కాదు-గొప్ప మార్పుకు వేదికన్నారు. చిన్నారులలోని ప్రతిభ, సృజనాత్మకతను బయటకి తీసి వారిలో విశ్వాసం నింపాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశంగా చెప్పారు. 405 ఈఎంఆర్‌ఎస్ స్కూళ్ల నుంచి 1,647 మంది తరలివచ్చారన్నారు. 110 మంది ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఏపీలోని గిరిజన బిడ్డల చదువు, పాఠశాల వసతులకు మరిన్ని నిధులివ్వాలని కేంద్రమంత్రి ఓరమ్‌కు ఆమె ఈ సందర్భంగా విన్నవించారు. గిరిజనులు ఉండే మారుమూల ప్రాంతాలలో రోడ్లు నిర్మించడం, వాటిని అనుసంధానం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఏపీకి మరిన్ని ఈఎంఆర్‌ఎస్ స్కూళ్లు మంజూరు చేయాలని మంత్రి సంధారాణి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్య రావు, మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ హసన్ బాషా, టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారు నాయక్, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి మల్లికార్జున నాయక్, నెస్ట్స్ కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ, ఏపీ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి, గురుకులం కార్యదర్శి ఎం.గౌతమి, నెస్ట్స్ జాయింట్ కమిషనర్ బిపిన్ చంద్ర రటూరీ, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డీన్, ప్రొఫెసర్ జీపీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

నక్షా కోటాలో రూ.125 కోట్ల మంజూరు

కేంద్రమంత్రి పెమ్మసాని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రం నుంచి రాష్ట్రానికి నక్షా కింద రూ.125 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు జారీచేసే నక్ష ప్రాజెక్టుకు రాష్ట్రంలోని పది పుర పాలక సంస్థలను కేంద్రం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిందన్నారు. 2026 మార్చి నెలాఖరులోగా ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజలకు కార్డులు జారీజేస్తారని పేర్కొన్నారు. నగరాలు, పట్టణాలలో భూములు, స్థలాలపై కచ్చితమైన రికార్డుల తయారీ, ఉన్న రికార్డుల ఆధునీకరించడం ద్వారా వివాదాలకు పరిష్కారం కల్పించాలన్న లక్ష్యంతో జాతీయ జియో స్పేషియల్ పరిజ్ఞానం ఆధారంగా పట్టణ ఆవాసాల్లో భూ సర్వే(నక్ష) పేరిట కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభించిందని గుర్తుచేశారు. నక్షా, ఎస్‌ఏఎస్‌సీఐ కార్యక్రమం కింద పట్టణ భూ సమీకరణ వ్యవస్థను ఆధునీకరించడంలో చూపిన ప్రగతికి కేంద్రం ఈ నిధులు మంజూరు చేసినట్లు ఆయన బుధవారం ఎక్స్‌వేదికగా తెలిపారు. రెండో దశలో మరికొన్ని పట్టణాలు దీనికింద ఎంపికయ్యే అవకాశముందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సారధ్యంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర పాలనను మరింత బలోపేతం దిశగా ప్రభుత్వం ముందుకు నడుస్తోందన్నారు. పైలెట్ ప్రాజెక్టు అమలు కోసం దేశ వ్యాప్తంగా 152 పట్టణ స్థానిక సంస్థలను ఎంపిక చేసి రూ.194 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒంగోలు, గుంటూరు, అనంతపురం, నెల్లూరు, కర్నూలు, ఏలూరు, తిరుపతి, కాకినాడ, మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థలతోపాటు కుప్పం పురపాలక సంఘాన్ని తొలి విడతలో కేంద్రం ఎంపిక చేసిందన్నారు.

రోడ్డెక్కిన జర్నలిస్టులు

హైదరాబాద్‌లో టీయూడబ్ల్యూజే మహాధర్నా

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కారాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఎదుట బుధవారం మహా ధర్నా నిర్వహించింది. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సి రావడం దురదృష్టకరమని సీనియర్ జర్నలిస్టులు వ్యాఖ్యానించారు. 12 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహాధర్నాకు యూనియన్ అనుబంధ సంస్థలైన తెలంగాణ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్, తెలంగాణ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్, తెలంగాణ చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం, మహిళా జర్నలిస్టుల విభాగం, తెలంగాణ ఉర్దూ జర్నలిస్టుల సమాఖ్యలతో పాటు హైదరాబాద్ ప్రెస్ క్లబ్, జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీ, జవహర్ లాల్ హౌసింగ్ సొసైటీ, టీజేఏ పాల్గొన్నాయి. రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి జర్నలిస్టులు హాజరయ్యారు. సమస్యల పరిష్కారం కోసం డిమాండ్- నినాదాలతో మహానగరాన్ని మార్మోగించారు. రాష్ట్ర సమాచార శాఖ సంయుక్త సంచాలకుడు డీఎస్ జగన్‌కు వినతిపత్రం అందజేశారు. మహాధర్నానుద్దేశించి ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎంఏ మజీద్, జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, నగునూరి శేఖర్, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, రమేశ్, ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.నరహరి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, హరీష్, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, హెచ్‌యూజే అధ్యక్షుడు శిగా శంకర్‌గౌడ్, ఉర్దూ జర్నలిస్టుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్, సీనియర్ మహిళా జర్నలిస్టులు విమల, అత్తలూరి అరుణ, వాకటి మంజుల, కళ్యాణం రాజేశ్వరీ తదితరులు ప్రసంగించారు. తొలుత దేవులపల్లి అమర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యులైన జర్నలిస్టులు ప్రస్తుతం హక్కుల కోసం పోరాడాల్సి రావడం దురదృష్టకరమని అన్నారు. మోదీ ప్రభుత్వం తొలి ప్రధాని నెహ్రూను ద్రోహిగా చిత్రీకరించి, ఆయన పేరునే రూపుమాపాలని యత్నిస్తోందన్నారు. 27 లేబర్ చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లు అమల్లోకి తెచ్చిందని, వీటితో కారిక వర్గంతో పాటు జర్నలిస్టులకు నష్టమన్నారు.

పదేళ్లలో 20 లక్షల ఇళ్లు కట్టిస్తాం

- కాళేశ్వరం కూలేశ్వరమైంది
- గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులు పూర్తిచేస్తాం
- ప్రజా పాలన విజయోత్సవాల సభలో సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-సిద్దిపేట/హుస్నాబాద్: పదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఇళ్లు కట్టిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రజా విజయోత్సవాల పాలన సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నెహ్రూ భూమి పూజ చేసిన ఎస్సారెస్పీ, నాగార్జున సాగర్, భాక్రానంగల్ ప్రాజెక్టులతో పాటు మరికొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తే నేడు తరతరాలుగా ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరం ప్రాజెక్టుగా మారిందని ఘాటుగా విమర్శించారు. హుస్నాబాద్ గడ్డ పోరాటాల పురిటిగడ్డని... నాడు దేశ్ముఖ దొరల పెత్తందారులను ఎదిరించి, తరిమి కొట్టి మట్టి కరిపించిన సర్దార్ సర్వాయి పాపన్న పుట్టిన నేలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కరీంనగర్ ప్రజల పాత్ర అమోఘమని, కరీంనగర్ జిల్లా వేదికగా సోనియమ్మ ఇచ్చిన మాట ప్రకారంగా 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నిలబెట్టారన్నారు. గ్లోబల్ సమ్మిట్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించామని చెప్పారు. డిసెంబరు 3 కు ప్రత్యేకత ఉందని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో శ్రీకాంతాచారి అసువులు బాశారని, అదే రోజు ఓటును వజ్రాయుధంగా మలుచుకొని దుర్మార్గపు బీఆర్‌ఎస్ పాలనకు అంతం పలికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు అని సీఎం రేవంత్ తెలిపారు. రెండున్నర ఏళ్లలో 60 వేల ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా మరో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో కట్టిన ఏ ఒక్క ప్రాజెక్టూ చెక్కుచెదరలేదని బీఆర్‌ఎస్ పార్టీ కట్టిన ప్రాజెక్టులు అస్తవ్యస్తంగా ఉన్నాయని విమర్శించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కొండపోచమ్మ, రంగనాయక సాగర్ పూర్తి చేసిన కేసీఆర్... బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సతీష్ బాబు ఉన్న ప్రాంతంలో గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోలార్ పవర్ ప్లాంట్లతో మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు రూ.1.4 లక్షల కోట్లు రైతుల కోసం, రూ.8 వేల కోట్లు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణానికి ఖర్చు చేశామన్నారు. రూ.50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే వారిని సర్పంచిగా ఎన్నుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అంతకముందు రూ.44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ఏటీసీ ఏర్పాటుకు, రూ.20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో అనేక అభివృద్ధి పనులకు, రూ.8.60 కోట్లతో ఆర్టీఏ యూనిట్ ఆఫీస్, రూ.86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్, కొత్తపల్లి ప్యాకేజీ-1 లో భాగంగా 4 వరసల రహదారి నిర్మాణానికి, రూ.58.91 కోట్లతో హుస్నాబాద్ నుంచి అక్కన్నపేట 4 వరసల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా 70 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ వెహికిల్, హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సును జెండాను ఊపి సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకట్ స్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సంజయ్ కుమార్, వీహెచ్ హన్మంతరావు, కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల రాజయ్య, ఇనగాల వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రియుడితో మహిళ... కాల్చి చంపిన కుటుంబసభ్యులు

జైపూర్: రాజస్థాన్‌లో దారుణం చోటుచేసుకుంది. మహిళ, ఆమె ప్రియుడిపై భర్త కుటుంబసభ్యులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. మొఖామ్‌పుర ఏరియాలోని బారోలావ్ గ్రామానికి చెందిన 30 ఏళ్ల సోని భర్త ఆరేళ్ల క్రితం చనిపోయాడు. సోని కొంతకాలం నుంచి అదే ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల కైలాశ్ గుర్జార్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఇద్దరూ తరచుగా ఏకాంతంగా కలుస్తూ ఉండేవారు. ఈ విషయం సోని అత్తింటి వారికి తెలిసింది. వారు ఇద్దరిపై పగ పెంచుకున్నారు. సరైన సమయం కోసం ఎదురు చూశారు. నవంబర్ 28వ తేదీన అర్ధరాత్రి సోని తన ప్రియుడ్ని కలవడానికి పొలాల్లోకి వెళ్లింది. సోని మామ, మరిది ఆమెను అనుసరించారు. ఇద్దరూ ఒకే చోట ఉండగా... రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరినీ కట్టేసి... మీద పెట్రోల్ పోసి నిప్పంటించారు. అనంతరం అక్కడినుంచి పరారయ్యారు. మంటల్లో కాలుతూ సోని, కైలాశ్ కేకలు పెట్టసాగారు. ఆ అరుపులు విన్న గ్రామస్తులు అక్కడికి వచ్చారు. మంటలు ఆర్పి ఇద్దర్నీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి కైలాశ్ చనిపోయాడు. బుధవారం తెల్లవారు జామున సోని చనిపోయింది. పోలీసులు హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్చారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ సోని, కైలాశ్ కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. నిందితులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు వారితో చర్యలు జరిపి... తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాధితులకు న్యాయం చేయకుంటే...

తీవ్రస్థాయిలో పోరాటం

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హెచ్చరిక

- విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్ర...ధర్నాచౌక్ వద్ద దీక్ష
- యాజమాన్యం కుట్రలను తిప్పికొట్టాలి
- అగ్రి ఆస్తుల వేలం వేగవంతం చేయాలి
- సీఎం చంద్రబాబు సమస్య పరిష్కరించాలి
- ఒక్క బాధితుడు మరణించినా ప్రభుత్వానిదే బాధ్యత
- అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ బాధితులు విజయవాడలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుండి తరలివచ్చిన బాధితులు విజయవాడ రైల్వేస్టేషన్ నుండి ధర్నాచౌక్ వరకు ఆవేదన యాత్ర నిర్వహించారు. ప్రభుత్వం న్యాయం చేయాలంటూ నినదించారు. నిరసన యాత్ర ముగిసిన అనంతరం ధర్నాచౌక్ వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు ఈవి నాయుడు అధ్యక్షతన అవేదన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన పట్టువీడకుండా వేలాదిమంది పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో కొంతమేర విజయం సాధించగలిగామన్నారు. దీంతో సుమారు 1.43 లక్షల మందికి రూ.10వేలు, రూ.20వేలు చొప్పున బాధితులకు అందాయన్నారు. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక దాదాపు 1100మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, అందులో 127మందికి ఎటువంటి రిపోర్టులు లేకుండా పరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. కంపెనీలో పెద్దమొత్తంలో డిపాజిట్ చేసినవారు 10లక్షలకు పైగా ఉన్నారని వారికి న్యాయం జరిగేవరకు ఈ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. చావోరేవో తేల్చుకునే వరకు వెనకడుగు వేయకుండా పోరాడాలని పిలుపునిచ్చారు. కొంతమంది కంపెనీ యాజమాన్య అనుకూల వ్యక్తులు సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారని... అది వారి విజ్ఞతకే వదిలేద్దామన్నారు. పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించే వరకు దాదాపుగా 12 సంవత్సరాల నుండి అనేక రూపాల్లో ఉద్యమిస్తున్నామన్నారు. ఇలాంటి ఉద్యమం ఇప్పటివరకు దేశంలోనే జరగలేదని స్పష్టం చేశారు. అసోసియేషన్ పోరాట ఫలితంగా సంస్థకు సంబంధించిన 14వేల ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఈ ఆస్తిని మ్యుటేషన్ చేయకుండా కోర్టులో కేసులు వేసి కంపెనీ యాజమాన్యం అడ్డుకుంటోందని... యాజమాన్యం ఆటలను సాగనివ్వమని తీవ్రంగా తిప్పికొడతామని ముప్పాళ్ల హెచ్చరించారు. అసోసియేషన్ నిబద్ధతతో అగ్రిగోల్డ్ బాధితుల పక్షంగా పోరాడుతోందని స్పష్టం చేశారు. సీఐడీలో నిజాయితీ గల అధికారులు బాధితులకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. బాధితుల పక్షంగా నిలబడిన అసోసియేషన్‌కు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. కస్టమర్లను, ఏజెంట్లను ఇప్పటికీ మోసం చేస్తున్న సంస్థ యాజమాన్యం అవ్వా వెంకట రామారావు, అవ్వా వెంకట శేషు నారాయణను ఇతర ప్రతినిధిల ఇళ్లను ముట్టించాలని పిలుపునిచ్చారు. బాధితుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఆస్తులను వేలం వేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. బాధితుల్లో ఏ ఒక్కరు మరణించినా ఆ బాధ్యత ప్రభుత్వానిదేనని ముప్పాళ్ల స్పష్టం చేశారు. అధికారంలో లేనప్పుడు పవన్ కల్యాణ్ అగ్రిగోల్డ్ బాధితులతో సమావేశమై న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఎటువంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజల అభివృద్ధి కన్నా ప్రపంచంలోని కోటీశ్వరుల అభివృద్ధి కోసం ఎక్కువగా పనిచేస్తున్నారని కార్పొరేట్ చంద్రబాబుగా పిలిచే పరిస్థితి వచ్చిందన్నారు. సమస్య పరిష్కారానికి రాబోయే రోజుల్లో బాధితులను కూడగట్టుకుని 10వేల మందితో రహదారులపై వంట వార్పుతో నిరసన కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన అర్థం చేసుకుని సమస్య పరిష్కారించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీ తిరుపతిరావు మాట్లాడుతూ ఉద్యమాన్ని ఆస్తులను కంపెనీ యాజమాన్యం స్వాధీనం చేసుకునే స్థాయికి తీసుకువచ్చామన్నారు. సీఐడి అధికారులు బాధితుల పక్షంగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. బాధితులను ఇబ్బందిపెడుతున్న యాజమాన్యానికి ప్రభుత్వాలు

కొమ్ముకాస్తున్నాయని మండిపడ్డారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్థ చేసిన అన్యాయంతో పిల్లల చదువులు, వివాహాలు చేసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ కర్నాటక అధ్యక్షుడు కె గురుమూర్తి మాట్లాడుతూ సంస్థ ఆస్తులకు విపరీతమైన విలువ పెరిగిందని 2015 లో రూ.6వేలు కోట్లు ఉన్న ఆస్తులు, ప్రస్తుతానికి రూ.30వేల కోట్లకు చేరుకున్నాయని... ఆస్తుల విలువ పెంచుకునే పనిలో కంపెనీ యాజమాన్యం ఉందని తెలిపారు. ఈ ఆస్తులను కాపాడుకునేందుకు కొంతమందిని అడ్డంపెట్టుకుని కుట్రలు పన్నుతోందని పేర్కొన్నారు. దీంతో బాధితులకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. త్వరలో సమస్య పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్ర స్థాయిలో ఉంటుందని, ఎవ్వరు ఆపలేరని దేనికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ దీక్షలో అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, కార్యనిర్వహక అధ్యక్షుడు మల్లికార్జునరావు, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు జీ రజిత, కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు, ఒడిశా అసోసియేషన్ కార్యదర్శి ఐ.చంద్రరావు, తమిళనాడు నాయకురాలు ఆశాబేగం, అసోసియేషన్ నాయకులు జంగాల అజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఏఐవైఎఫ్ ఉపాధ్యక్షుడు లంకా గోవిందరాజులు తదితర నాయకులతో పాటు తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిశా, రాష్ట్ర నలుమూలల నుండి ఏజెంట్స్, ఖాతాదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సర్కార్! ఇక మేలుకో!!

ప్రజల గోడు విను... సమస్యలు పరిష్కరించు

పార్లమెంటులో సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్

న్యూదిల్లీ: 'సర్కార్! ఇప్పటికైనా మేలుకో. ప్రజల గోడు విను. అర్థం చేసుకో. వారి సమస్యల పరిష్కారానికి తక్షణమే తగు సమర్థ చర్యలు తీసుకో' అంటూ సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ పార్లమెంటును దద్దరిల్లించారు. కేంద్రీకరణ, ప్రైవేటీకరణ మోజులో సంస్థలను నాశనం చేస్తున్నదని ప్రభుత్వాన్ని ఆక్షేపించారు. దేశ యూనివర్సిటీ, కాలేజీ టీచర్ల ఆవేదన, ఆగ్రహాన్ని తన మాటల్లో సభకు తెలియజేశారు. ఆగని దోపిడీ, సంస్థాగత నిర్లక్ష్యంపై గొంతెత్తారు. వీటికి వ్యతిరేకంగా ఏఐఎఫ్‌యూసీటీఓ ఈనెల 9న దిల్లీ నుంచి దేశవ్యాప్త ఆందోళనను దిగుతోందని తెలిపారు. మంజూరైన మూడు లక్షల టీచర్ పోస్టులు భర్తీకి నోచుకోలేదని, అర్హులైన యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని సంతోశ్ కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 6.5 లక్షల మంది టీచర్లు అడ్-హాక్‌లో చిక్కుకుపోయారని, ఒప్పంద నియామకాలతో గౌరవ ఉపాధికి దూరమై, అభద్రతా భావంతో న్యాయమైన ప్రయోజనాలను కోల్పోతున్నారని తెలిపారు. మళ్లీ టెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాలంటూ విధుల్లో ఉన్న టీచర్లపై ఒత్తిడి తెచ్చే తిరోగమన విధానాలను యూజీసీ అవలంభిస్తోందని సీపీఐ ఎంపీ విమర్శించారు. ఇలాంటి విధానాలను సీపీఐ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సామాఖ్య స్ఫూర్తికి విరుద్ధమైన ఎన్ఈపీ 2020 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏడవ వేతన సవరణను ప్రస్తావించారు. దాని ప్రయోజనాలు అందరికీ సమానంగా అందడం లేదన్నారు. పింఛన్‌దారులకు అన్యాయం జరుగు తోందని తెలిపారు. తమ జీవితాలను విద్యా రంగానికి అంకితమిచ్చిన వారి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సంతోశ్ దుయ్యబట్టారు. కేంద్రీకరణ కోసం ప్రభుత్వం పట్టుదలగా ఉండి, వ్యవస్థలను నాశనం చేస్తున్నదన్నారు. రాష్ట్రాల సాధికారతకు విఘాతం కలిగిస్తుందని, టీచర్లను, విద్యార్థులను అణచివేస్తున్నదని వ్యాఖ్యానించారు. అధ్యాపకులు దేశానికి మూలస్తంభాలని, వారి పోరాటం అత్యవసరం, న్యాయమైనదని అన్నారు. సర్కారు ఇప్పటికైనా మేల్కొనాలని, ప్రజల పక్షం వినాలని, తగు చర్యలను తక్షణమే తీసుకోవాలని సంతోశ్ కుమార్ హితవు పలికారు.

పవన్ కల్యాణ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలి

నారాయణ డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: ఏపీ ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఆ పదవికి అనర్హుడని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ బుధవారం అన్నారు. పవన్ కల్యాణ్‌ను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టేవిగా, ఐక్యతకు భంగం కలిగించేవిగా ఉన్నాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాలు సాంకేతికంగా విడిపోయినా అందరూ కలిసే ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భీమవరానికి చెందిన వారు తమ కుమార్తెను ఇచ్చి వివాహం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పవన్ కల్యాణ్ తొలి రోజుల్లో చేగువేరా తనకు ఆదర్శం అన్నారని, ఇప్పుడు సావర్కర్‌ను భుజాన వేసుకుని తిరుగుతూ సనాతన ధర్మం అంటున్నారని విమర్శించారు. సనాతన ధర్మం కోసం తిరగాలనుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని, రాజకీయాల్లో ఉండకుండా ఆ పని చేసుకోవచ్చని చురకలు వేశారు. సనాతన ధర్మం చెప్పే దిష్టి తగిలింది లాంటి మాటలు మాట్లాడే సనాతన వాదికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదని వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ రాజకీయాలకు తగడని, తక్షణమే ఆయనను ఆంధ్ర ప్రదేశ్ మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

పచ్చదనం ఉట్టిపడేలా అమరావతి

- ప్రత్యేక ప్రణాళికలు
- 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ రాజధానిగా నిర్మాణం
- ల్యాండ్ పూలింగ్ రైతుల కోసం సీఆర్డీఏ కార్యాలయంలో ప్రత్యేక సెల్: మంత్రి నారాయణ

విశాలాంధ్ర-సచివాలయం: రాజధాని అమరావతిలో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా అమ్యూజ్‌మెంట్ పార్కులు, ఎకో రిసార్ట్స్, మ్యూజికల్ ఫౌంటెయిన్స్, స్నోవరల్డ్ వంటివి ఏర్పాటు చేయడం ద్వారా ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం రాజధానిలో 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉండేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణాలు,రోడ్ల పనులతో పాటే పచ్చదనం అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. అమరావతిలో పచ్చదనం అభివృద్ధిపై రాయపూడిలోని మున్సిపల్ శాఖ ప్రధాన కార్యాలయంలో అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష చేసిన మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ అమరావతిలో ట్రంక్ రోడ్లు,ఎల్పీఎస్ జోన్లలో రోడ్లకు ఇరువైపులా, డివైడర్ మధ్య, రిజర్వాయర్ల చుట్టూ పచ్చదనం పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. 217 చ.కిమీ మాస్టర్ ప్లాన్ లో బ్లూ అండ్ గ్రీన్ కు 30 శాతం కేటాయించామని తెలిపారు. 34 ట్రంక్ రోడ్లకు ఇరువైపులా 640 కిమీ, సెంట్రల్ డివైడర్ ల మీద 450 కి.మీ మేర బ్యూటిఫికేషన్, 22 ట్రంక్ రోడ్ల బఫర్ జోన్ లలో 133.31 కి.మీ మేర అవెన్యూ ప్లాంటేషన్, ఎల్పీఎస్ జోన్ల వద్ద 1244 కి.మీ మేర పచ్చదనం అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. శాఖమూరులో 190 ఎకరాల్లో, మల్కాపురం వద్ద 21 ఎకరాల్లో పబ్లిక్ రిక్రియేషన్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతవరం వద్ద 31 ఎకరాల్లో లంగ్ స్పేస్ పార్కులు,కురగల్లు వద్ద 200 ఎకరాల్లో బయో డైవర్సిటీ పార్కు, ఎల్పీఎస్ జోన్లలో 1602 ఎకరాల మేర ఎకరం నుంచి పదెకరాల లోపు విస్తీర్ణంలో పార్కులు నిర్మిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. కృష్ణాయపాలెం రిజర్వాయర్ వద్ద 71 ఎకరాలు, నీరుకొండ రిజర్వాయర్ వద్ద 158 ఎకరాల్లో పచ్చదనం అభివృద్ధి చేస్తున్నామన్నారు. శాఖమూరు పార్కులో 30 ఎకరాల్లో అమ్యూజ్ మెంట్ పార్కు అభివృద్ధి రిజర్వాయర్ లలో బోటింగ్ డక్,మ్యూజికల్ ఫౌంటెయిన్ అలాగే ఎడ్వంచర్ పార్క్ లో స్కో వరల్డ్,ఎకో రిసార్ట్స్ లో 10 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్లు,రెస్టారెంట్స్,బోటింగ్,కాటేజీలు,పబ్లిక్ పార్క్ లో 30 ఎకరాల్లో సైక్లింగ్, వాకింగ్, మ్యూజికల్ ఫౌంటెయిన్ నర్సరీ లో గ్లాస్ డోం ఉండేలా థీమ్ పార్క్ లు,డిస్ ప్లే అండ్ షాపింగ్,కిడ్స్ ప్లే ఏరియా, 20 ఎకరాల్లో ఫ్లవర్ పార్క్ లో దశావతార ఫ్లవర్ గార్డెన్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించామని ఈ పనులన్నీ జనవరినెలాఖరు నుంచి ప్రారంభిస్తామని మంత్రి నారాయణ చెప్పారు.

రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం

రాజధానికి భూములిచ్చి ప్లాట్లు పొందిన రైతులను వెంటనే రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఫోన్ ల ద్వారా సమాచారం ఇస్తున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. మొత్తం 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్లు కేటాయించగా ఇంకా కేవలం 2168 మంది రైతులకు 7743 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. లంక, అసైన్డ్ ప్లాట్లకు సంబంధించి ఇంకా 157 మంది రైతులకు 295 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. కొంతమంది రైతులు రిజిస్ట్రేషన్ కోసం మరింత సమయం కావాలని కోరుతున్నారు. ఇంకా రైతులకు 719 ఎకరాల మేర ప్లాట్లు కేటాయించాల్సి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం 900 కోట్లతో పనులు చేపడుతున్నారు. ఆయా పనులకు సంబంధించి సర్వే జరుగుతుందన్నారు. ఇక రైతులకు కేటాయించిన ప్లాట్లలో సరిహద్దు రాళ్ల కూడా త్వరలోనే వేసేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు,స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసం మరికొంత భూమి అవసరం అవుతుందన్నారు .దీనికి సంబంధించి అధికారులు కసరత్తు జరుగుతుందని మంత్రి చెప్పారు.గతంలో మాదిరిగా ల్యాండ్ పూలింగ్ పై రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరించేలా సీఆర్డీఏ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు.

చెరో 10 గంటలు

వందేమాతరం, ఎన్నికల సంస్కరణపై చర్చ

న్యూదిల్లీ: వందే మాతరం, ఎన్నికల సంస్కరణలపై చర్చకు చెరో 10 గంటల సమయాన్ని రాజ్యసభ బీఏసీ కేటాయించింది. వచ్చే వారంలో ఈ చర్చలు ప్రారంభమవుతాయి. బీఏసీ సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. వందే మాతరానికి 150 ఏళ్లు అయిన సందర్భంగా జాతీయ గీతంపై మంగళవారం రాజ్యసభలో చర్చ ప్రారంభం కాబోతోంది. ఈ మేరకు సమావేశం నిర్ణయించిందని బీఏసీ వర్గాలు తెలిపాయి. వందే మాతరంపై చర్చ ముగిసిన తర్వాత ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ మొదలవుతుంది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైన రెండు రోజులలో ఎస్ఐఆర్‌పై చర్చ కోసం ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో సభలు రసాభాస అయ్యాయి. ఎస్ఐఆర్‌పై చర్చకు వీల్లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇదే క్రమంలో ఎన్నికల సంస్కరణలపై చర్చను ప్రతిపక్షాలు కోరాయి. ముందుగా వందే మాతరంపై చర్చ కోసం ప్రభుత్వం ప్రతిపాదిం చగా, విపక్షాలు ఒప్పుకున్నాయి. దీంతో వందే మారతం, ఎన్నికల సంస్కరణలపై వచ్చే వారం చర్చ కోసం చెరో 10 గంటలు కేటాయించారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కండి

జనసేన శ్రేణులకు పవన్ పిలుపు

గ్రామ స్థాయిలో ఐదుగురితో కమిటీలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పంచాయతీల నుంచి పార్లమెంట్ నియోజక వర్గం వరకూ అభివృద్ధిలో భాగం కావాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తమ ప్రాంత అభివృద్ధిలో, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించేలా పార్టీ శ్రేణులను ముందుకు తీసుకువెళ్తామని పవన్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ కమిటీల నిర్మాణంలో భాగంగా గ్రామ స్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించడం ద్వారా వారు గ్రామాభివృద్ధిలో భాగమయ్యేలా చేద్దామన్నారు. అదే విధంగా మండల, అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల అభివృద్ధిపై ఆయా కమిటీలు దృష్టి కేంద్రీకరించేలా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. బుధవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యులతో పవన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవులపై సమీక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకూ జనసేన పొందిన నామినేటెడ్ పదవుల వివరాలను పరిశీలించారు. మిగిలిన పదవుల భర్తీపై సూచనలు చేశారు. కూటమి ధర్మాన్ని అనుసరించి ముందుకు వెళ్లడంతో పాటు, పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేసినవారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలను అందించే దిశగా ప్రయాణిస్తున్నామన్నారు.పార్టీ కమిటీల నియామకంపై పవన్ కళ్యాణ్ పలు సూచనలు అందించారు. గ్రామ స్థాయి నుంచి నియోజక వర్గ స్థాయి వరకూ పార్టీ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలకు ఐదుగురు చొప్పున సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ సభ్యులు స్థానికంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు.ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్‌గా పిఠాపురంలో నియోజకవర్గ స్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైందని, ఆ కమిటీ పని తీరును మదింపు చేసి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలు రూపకల్పన చేయాలన్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి నెలకొనే అంశాలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన కాన్ ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ విభాగాన్ని కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షించాలని పవన్ స్పష్టం చేశారు. ఈ విభాగంలో 11 మంది వరకూ సభ్యులను నియమించాలని నిర్ణయించారు. ఈ విభాగం ముందుకు వచ్చే అంశం ప్రాధాన్యం, తీవ్రతను బట్టి ముగ్గురు లేదా మొత్తం విభాగంలోని సభ్యులు చర్చించి పరిష్కరించాలని పార్టీ అధ్యక్షుల దిశానిర్దేశం చేశారు. ఇకపై ప్రతి కమిటీలో మహిళలకు స్థానం కల్పించాలని స్పష్టం చేశారు.

వైద్య విద్య ప్రైవేటీకరణతో వ్యవస్థ ఛిద్రం

కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్న కూటమి సర్కార్: ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాలకులు విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు అప్పజెప్పడంతో సామాజిక వ్యవస్థ ఛిద్రమవుతుందని, ప్రజల జీవన ప్రమాణాలు మరింత దిగజారి భవిష్యత్ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదముందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య బుధవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు నరేంద్రమోదీ సర్కారు ప్రభుత్వ రంగాలను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పావులు కదుపుతుండగా... మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రానికి తామేమీ తీసిపోమన్నట్లుగా విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిందని ఈశ్వరయ్య విమర్శించారు. రాష్ట్రంలో విద్యారంగం మెరుగుదల కేవలం మాటలకే పరిమితమైందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయకుండా... విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించకుండా విద్యారంగాభివృద్ధి ఎలా సాధ్యమో పాలకులే చెప్పాలని ఆయన ప్రశ్నించారు. 14 ఏళ్లలోపు బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యనందించాలనే లక్ష్యం కేవలం మాటలకే పరిమితమైందని, పాలకుల వాగ్దానాలు అమలుకు నోచుకోక కంటితుడుపు చర్యగానే మిగులుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీచైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ విద్యావ్యవస్థను తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నాయని మండిపడ్డారు. చదువు కేవలం ర్యాంకులకే పరిమితమవుతూ విద్యార్థులలో సామాజిక అవగాహన, పరిజ్ఞానం వంటివి కొరవడే పరిస్థితి దాపురిస్తున్నదని పేర్కొన్నారు.

విద్య, వైద్యం ప్రైవేటీకరణ దుర్మార్గం

ప్రజలకు విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించడం ప్రభుత్వాల బాధ్యతని, దీనికిబదులు వాటిని దశలవారీగా ప్రైవేటీకరించాలనుకోవడం దుర్మార్గమని ఈశ్వరయ్య మండిపడ్డారు. ప్రభుత్వ అధీనంలో కొనసాగాల్సిన వైద్యరంగాన్ని దశలవారీగా ప్రైవేటుకు అప్పగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. నూతనంగా ఏర్పాటుచేసే 17 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 10 కళాశాలలను పీపీపీ పేరుతో 33 సంవత్సరాల పాటు ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం జీవో 107, 108 ద్వారా వైద్య కళాశాలల్లో 50 శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో బీ, సీ కేటగిరీలుగా విభజించి... బీ కేటగిరి రూ.12 లక్షలకు, సీ కేటగిరి రూ.20 లక్షలకు విక్రయించడంతో ప్రతిభ గల పేద, సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరమయ్యారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం కూడా జీవో నంబరు 107, 108ని రద్దు చేయకుండా... 2024-25, 2025-2026లో గత ప్రభుత్వం మాదిరిగా సీట్లను భర్తీ చేసిందన్నారు. 10 వైద్య కళాశాలలను పూర్తిగా ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులేస్తూ... 765 ఎకరాల ప్రభుత్వభూమిని ఎకరా రూ.100కే కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెట్టిందని, ప్రభుత్వాసుపత్రులలో ఖాళీగా ఉన్న నర్సులు, పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్లు, ప్రొఫెసర్లను భర్తీ చేయకపోవడం వలన ప్రజలకు నాణ్యమైన వైద్యం కరువైందని పేర్కొన్నారు.

పేరుకుపోయిన ఆరోగ్యశ్రీ బకాయిలు

ప్రైవేట్ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం చేసుకున్న వారికి వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, ఫలితంగా పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సంరక్షణ అందని ద్రాక్షగా మారిందని ఈశ్వరయ్య ఆందోళన వెలిబుచ్చారు. దీనికితోడు పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లిలోని నాలుగు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) టెండర్లు పిలిచిందన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సెల్ మార్గదర్శకాల ప్రకారం కొత్తగా బోధనాసుపత్రి ప్రారంభించాలంటే కనీసం 25 ఎకరాల భూమి అవసరం. కోట్లాది రూపాయలు వెచ్చించి 320 పడకలతో, ఆసుపత్రిలో అనేక విభాగాలు నెలకొల్పడం, సిబ్బందిని నియమించి ఆసుపత్రిని అభివృద్ధి చేయడంతోపాటు ఎన్ఎంసీ అనుమతి పొందిన మీదట తరగతులు ప్రారంభించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ అత్యుత్సాహంతో వందల కోట్ల పెట్టుబడిగానీ, కాలయాపనగానీ లేకుండా రెడీమేడ్‌గా బోధనాసుపత్రులను ప్రైవేటు సంస్థలు పొందేందుకు వీలవుతున్నదని తెలిపారు. ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన వైద్య కళాశాలలను రెండేళ్లపాటు ప్రైవేటు శక్తులకు అప్పగిస్తూ, అందులో పనిచేసే వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వ ఖజానా నుంచే వేతనాలు చెల్లించాలని చంద్రబాబు సర్కార్ చూడడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రైవేటు శక్తులకు లాభం చేకూర్చే విధంగా వందల కోట్ల ప్రజాధనాన్ని కూటమి ప్రభుత్వం దోచిపెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు కట్టబెట్టే ప్రతిపాదనలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

కనిష్ట స్థాయికి రూపాయి పతనం

ముంబై: దాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఉదయం ట్రేడింగ్‌లో 6 పైసలు తగ్గి చరిత్రలో తొలిసారిగా 90.02కి చేరుకుంది. గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 89.96 వద్ద ప్రారంభమైన రూపాయి... రికార్డు స్థాయిలో 90.15కి చేరుకుంది. తరువాత కొంత కోలుకుని 90.02 వద్ద ట్రేడయింది. ఇది దాని మునుపటి ముగింపు కంటే 6 పైసలు తగ్గింది. బ్యాంకులు అధిక స్థాయిలో డాలర్లను నిరంతరం కొనుగోలు చేయడం, ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు కొనసాగడం దీనికి కారణమని చెబుతున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో సెన్సెక్స్ 165.35 పాయింట్లు తగ్గి 84,972.92కు, నిఫ్టీ 77.85 పాయింట్లు తగ్గి 25,954.35కు చేరుకుంది. రూపాయి క్షీణత అకస్మాత్తుగా సంభవించలేదు. ఇది 2025 అంతటా క్రమంగా తగ్గుతూ వచ్చింది. అప్పుడప్పుడు తిరిగి పుంజుకునే సంకేతాలు వచ్చినప్పటికీ కొనసాగలేకపోయింది. 2025 ప్రారంభంలో (జనవరి-ఫిబ్రవరి) రూపాయి బలహీనపడటం ప్రారంభమైంది. 2025 జనవరి మధ్య నాటికి రూ.86.70కి పడిపోయింది. మార్చి 10న 30 పైసలు తగ్గి సుమారు రూ.87.25కి చేరుకుంది. సెప్టెంబర్‌లో ఇది ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది. దాదాపు రూ.88.79కి చేరుకుంది. నవంబర్ 21న రూ.89.49కి పడిపోయింది. నవంబర్ చివరిలో ఇది కోలుకునే సంకేతాలు చూపించింది. కొన్ని రోజుల్లో రూపాయి రూ.89.26- రూ.89.28 మధ్య ట్రేడవుతూ నిలిచింది. కానీ దీనిని నిలబెట్టుకోలేకపోయింది. డిసెంబర్ నాటికి ఇది 90 దాటి దిగువకు పడిపోయింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.